




ESTD: 1999 www.voodayam.com

# వుదయం

కరీంనగర్ 31-07-2026 శుక్రవారం | సంపుటి : 14 | సంచిక :224 SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 4.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily

Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal — Follow us on









# విద్య లేకపోవడమే అసలైన వెనుకబాటుతనం

## సీఎం రేవంత్ రెడ్డి

- మండలం యూనిట్‌గా ప్రణాళికలు పంపండి
- ప్రతి పిల్లవాడు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా పని చేయాలి
- మీ పర్యటన అనుభవాలు విద్యార్థులకు మేలు చేయాలి
- విదేశీ విద్యకు ఏటా 10-15 మంది ఉపాధ్యాయుల ఎంపిక
- సమాజ మార్పునకే విద్యా శాఖ బాధ్యతలు

**హైదరాబాద్, జూలై 30 (వుదయం) :**

నాణ్యమైన విద్య రాష్ట్రానికి పునాది అయితే, నైపుణ్యాలు అంతస్తుల్లాంటివని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. రానున్న ఐదేళ్లు ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందిస్తామనే దీక్షను ఉపాధ్యాయులు తీసుకోవాలని సూచించారు. టీచర్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్సేంజ్" కార్యక్రమంలో భాగంగా ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో ఎంసీహెచ్ఆర్డీలో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక్కో విద్యార్థిపై సగటున రూ.1.08 లక్షలు వ్యయం చేస్తున్నామని, దానిని వారి అభివృద్ధికి పెట్టే పెట్టుబడిలా చూడాలన్నారు. అంత మొత్తం ఖర్చు చేస్తున్నా విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు ఎందుకు వెళుతున్నారో ఆలోచించాలన్నారు. తెలంగాణలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యా వ్యవస్థ ఉండాలనే లక్ష్యంతోనే ఉపాధ్యాయులను విదేశీ పర్యటనలకు పంపుతున్నామని తెలిపారు. ఆయా దేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయులు అక్కడి అనుభవాలను ఇక్కడ ఆచరణలో తీసుకురావాలని సూచించారు. వివిధ దేశాల పర్యటనతో ప్రపంచం ఎటు వెళుతుందో తెలుస్తుందని.. పర్యటనతో తెలుసుకున్న అంశాలను ఇక్కడ విద్యార్థులకు బోధించి వారిని ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆస్తులు లేకపోవడం వెనుకబాటుతనం కాదని, విద్య లేకపోవడమే వెనుకబాటుతనమని తాము నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, కుల సర్వే తేల్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎకరాల కొద్ది భూమి, ఇతర ఆస్తులు ఉన్నా సమాజం ఎటు వెళుతుందో తెలియక వెనుకబడి పోతున్నారని, ఏ ఆస్తులు లేకపోయినా చదువుకొని ఉద్యోగాలు సాధించిన వారు ప్రపంచంతో పోటీ పడుతున్నారని తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతోనే బ్రేక్‌ఫాస్ట్ స్కీంకు రూపకల్పన చేశామన్నారు. తాము అధికారంలోకి వచ్చాక హాస్టల్ విద్యార్థులకు డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచామన్నారు. 55 రోజుల్లోనే 11 వేల ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టామని, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు ఇచ్చామని సీఎం గుర్తు చేశారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల మాదిరే ప్రతి ఏటా 10 నుంచి 15 మంది ఉపాధ్యాయులను విదేశీ విద్యకు పంపిస్తామని సీఎం తెలిపారు. అక్కడ నేర్చుకున్న జ్ఞానాన్ని ఇక్కడ విద్యార్థులకు పంచాలని సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తాను పాటుపడతానని, ఉపాధ్యాయ సంఘాలు విద్యార్థుల సమస్యలపై తనతో కొట్లాడాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఉపాధ్యాయులు ఏ మండలానికి ఆ మండలం యూనిట్‌గా తీసుకొని, వచ్చే విద్యా సంవత్సరానికి అవసరమైన ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. ఆ మండలంలోని పాఠశాలల్లో ఏ వసతులు కావాలి, ఎంత మంది ఉపాధ్యాయులు కావాలి, మెరుగైన విద్యా బోధనకు తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి? ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేరేందుకు ఏం అవసరమనే అంశాలు ఆ ప్రణాళికలో ఉండాలని సూచించారు. డిసెంబరు నెలాఖరుకు ఆ ప్రణాళిక తమకు అందజేస్తే దానికి అనుగుణంగా తాము కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆయా మండలాల నుంచి వచ్చే సూచనలు, సలహాలను ఆ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని సీఎం సూచించారు.

# నమ్మకంతోనే అద్భుత దేశ నిర్మాణం

### ఆందోళనకారులపై కేసుల ఎత్తివేతపై ఇచ్చిన హామీకి కేంద్రం కట్టుబడి ఉండాలి



**న్యూఢిల్లీ, జూలై 30 (ఎఎంస్) :**

దేశంలో యువతకు, ప్రభుత్వానికి మధ్య ఉండే పరస్పర నమ్మకమే అత్యంత కీలకమని, అప్పుడే అద్భుతమైన దేశ నిర్మాణం సాధ్యపడుతుందని ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ పేర్కొన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 'పబ్లిక్ పరీక్షల (అనుచిత పద్ధతుల నివారణ) సవరణ బిల్లు 2026'ను ఆయన సాదరంగా స్వాగతించారు. కేవలం పరీక్షల నిర్వహణలోనే కాకుండా, దేశ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడానికి ఈ బిల్లు ఎంతగానో దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆయన ఓ ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. గతంలో నీట్ (NEET) ప్రశ్నపత్రం లీకేజీ నేపథ్యంలో దిల్లీలో చోటుచేసుకున్న నిరసనలు, ఆందోళనల గురించి కూడా వాంగ్‌చుక్ ప్రస్తావించారు. ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన పోలీసు కేసులను (ఎఫ్ఐఆర్‌లను) బేషరతుగా కొట్టివేస్తామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లిఖితపూర్వక హామీకి కట్టుబడి ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆందోళనకారులపై ఉన్న కేసులను తక్షణమే ఎత్తివేయాలని, లేనిపక్షంలో మరోసారి ఉద్యమిస్తామని 'కాక్రోచ్ జనతాపార్టీ' (సీజేపీ) హెచ్చరించిన నేపథ్యంలో వాంగ్‌చుక్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు, దిల్లీ నుంచి శ్రీనగర్ వరకు వందేభారత్ రైలులో ప్రయాణించిన అనుభవాలను ఆయన పంచుకున్నారు. భారతీయ రైల్వే పురోగతిని చూస్తుంటే దేశస్థుడిగా ఎంతో గర్వంగా ఉందని ప్రశంసించారు. ముఖ్యంగా ప్రపంచంలోనే ఎత్తైన చీనాబ్ రైల్వే వంతెనపై సాగిన ప్రయాణం అత్యంత అద్భుతంగా అనిపించిందని కొనియాడారు. తన బృందంతో కలిసి కశ్మీర్‌లో ఒక రోజు ఆనందంగా గడిపిన అనంతరం, అక్కడి నుంచి నేరుగా లద్దాఖ్‌కు పయనమవుతామని సోనమ్ వాంగ్‌చుక్ వెల్లడించారు.

# 'క్రిమినల్ వేస్ట్' వ్యాఖ్యలపై భగ్గుమన్న బీఆర్ఎస్



**హైదరాబాద్, జూలై 30 (వుదయం) :**

తెలంగాణ యువ ఇంజినీర్ల ప్రతిభను 'క్రిమినల్ వేస్ట్' అంటూ తీవ్ర పదజాలంతో అవమానించడం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అహంకారానికి స్పష్టమైన నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ సీఎం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తక్షణమే రాష్ట్ర యువ ఇంజినీర్లకు ముఖ్యమంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ యువత అసాధారణ సామర్థ్యాన్ని, మేధస్సును కించపరిచేలా మాట్లాడే అర్హత రేవంత్ రెడ్డికి ఎక్కడినుంచి వచ్చిందని కేటీఆర్ నిలదీశారు. తన జీవితంలో ముఖ్యమంత్రి ఎప్పుడైనా ఏదైనా ఒక పోటీ పరీక్ష రాశారా? ఏదైనా ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకు హాజరయ్యారా? లేదా ఏదైనా వృత్తిపరమైన (ప్రొఫెషనల్) సంస్థలో పనిచేసిన కనీస అనుభవం ఉందా? అంటూ వరుస ప్రశ్నలతో తీవ్రంగా విమర్శించారు. రేవంత్ రెడ్డి గత జీవితాన్ని ప్రజలు ఎప్పటికీ మరచిపోలేదని, ఒక రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా రాజకీయ ప్రయాణం ప్రారంభించిన ఆయన, చివరికి బ్లాక్‌మెయిల్ రాజకీయాల స్థాయికి దిగజారారని ఆరోపించారు. దివాళా తీసిన కాంగ్రెస్ పార్టీలో భారీగా వెచ్చించి ముఖ్యమంత్రి పదవిని కొనుగోలు చేసి అధికారంలోకి వచ్చిన వ్యక్తి.. దేశ విదేశాలకు సాంకేతిక నిపుణులు, మేధావులు, ఇంజినీర్లను అందిస్తున్న తెలంగాణ యువతను కించపరచడం అత్యంత దురదృష్టకరమని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి యువత స్వశక్తితో సాధిస్తున్న విజయాలు, కనబరుస్తున్న ప్రతిభ ప్రపంచవ్యాప్తంగా అగ్రగామిగా గుర్తింపు పొందుతుంటే, వారిని చిన్నచూపు చూస్తూ ముఖ్యమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని కేటీఆర్ గట్టిగా డిమాండ్ చేశారు.

# ఒకనాడు తాను కూడా కాంగ్రెస్ వ్యక్తినే

### పార్లమెంట్ ఆవరణలో సరదా ముచ్చట్లు
### రాజీవ్ గాంధీకి దీదీ అంటే ఎంతో గౌరవం

**న్యూఢిల్లీ, జూలై 30 (ఎఎంస్) :**



కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీతో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ కల్యాణ్ బెనర్జీ మధ్య జరిగిన సరదా సంభాషణ రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తికరంగా మారింది. తృణమూల్ కాంగ్రెస్ రెబల్ ఎంపీల వ్యవహారంపై పార్లమెంట్ ఆవరణలో వీరిద్దరి మధ్య ఆసక్తికర చర్చ సాగింది. లోక్‌సభ నుంచి సస్పెన్షన్‌కు గురైన కల్యాణ్ బెనర్జీ పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ క్రమంలో అటుగా వచ్చిన కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ ఆయన వద్దకు వచ్చి సరదాగా ముచ్చటించారు. టీఎంసీలో తిరుగుబాటు చేసిన ఆ రెబల్ ఎంపీలను ఉద్దేశించి.. వారు మొదట కాంగ్రెస్‌ను వీడి టీఎంసీలో చేరారని, చివరకు ఈమధ్య నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ)లో చేరిపోయారని ప్రియాంక నవ్వుతూ వ్యాఖ్యానించారు. దీనికి కల్యాణ్ బెనర్జీ బదులిస్తూ.. పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్‌కు పెద్దగా బలం లేకపోవడం వల్లే వాళ్లు 2014లో ఆ పార్టీని వీడి, తమ పార్టీ టికెట్‌పై గెలుపొందారని చెప్పారు. అక్కడే ఉన్న మరో ఎంపీ పప్పూ యాదవ్ జోక్యం చేసుకుంటూ.. వాస్తవానికి వారంతా ఒకప్పుడు కాంగ్రెస్ సభ్యులేనని గుర్తుచేశారు. దీనికి స్పందించిన కల్యాణ్ బెనర్జీ.. అప్పట్లో తాను కూడా కాంగ్రెస్ వ్యక్తినేనని, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా కూడా పనిచేశానని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చరిత్రపై కల్యాణ్ బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. "కాంగ్రెస్ నుంచి దీదీని (మమతా బెనర్జీ) వెళ్లగొట్టారు.. దాని గురించి కూడా మాట్లాడండి. 1997లో మమతా బెనర్జీని బయటకు గెంటేశారు. ఒకవేళ అప్పుడు అలా చేసి ఉండకపోతే, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నేడు ఈ దుస్థితిలో ఉండేది కాదు" అని పేర్కొన్నారు. దీనికి ప్రియాంకా గాంధీ స్పందిస్తూ.. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి దీదీ అంటే ఎంతో గౌరవం ఉండేదని గుర్తుచేశారు. ఈ చర్చ సందర్భంగా స్పందించిన పప్పూ యాదవ్.. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ మమతా బెనర్జీకి మద్దతుగా నిలుస్తోందని చెప్పగా, కల్యాణ్ బెనర్జీ అది నిజమేనని అంగీకరించారు. పార్లమెంట్ ప్రాంగణంలో జరిగిన ఈ ఆసక్తికర సంభాషణ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

### ఉమ్మడి ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాలకు

# రెడ్ అలర్ట్

**హైదరాబాద్, జూలై 30 (వుదయం) :**

హైదరాబాద్: తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఇవాళ రాష్ట్రంలో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు జగిత్యాల జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ రెండు జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది.






# జోర్డాన్ బేస్‌లపై దాడికి ప్రతీకారంగానే దాడులు



**టెహ్రాన్ (ఎఎంస్) :**

అమెరికాఇరాన్ దేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిని, ఘర్షణలు మరోసారి పతాకస్థాయికి చేరుకున్నాయి. అగ్రరాజ్యం చేస్తోన్న వరుస దాడులతో ఇరాన్ భూభాగం దద్దరిల్లుతోంది. జోర్డాన్‌లోని తమ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ జరిపిన దాడికి ప్రతిచర్యగానే ఈ శక్తిమంతమైన దాడులు చేపట్టినట్లు యూఎస్ మిలిటరీ అధికారికంగా ప్రకటించింది. జోర్డాన్‌లోని తమ బేస్‌లపై జరిగిన దాడిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా పరిగణించారు. "మేం వారిని గట్టిగా దెబ్బకొడతాం" అని ఆయన స్పష్టంగా ప్రకటించారు.

ఈ ప్రకటన వెలువడిన వెంటనే దక్షిణ ఇరాన్‌లో భారీ పేలుళ్లు సంభవించాయి. వ్యూహాత్మక ఖేష్మ్ ద్వీపంతో పాటు, అణువిద్యుత్ కేంద్రం ఉన్న తీర ప్రాంత నగరమైన బుషెహర్‌ను అమెరికా సైన్యం ప్రధానంగా టార్గెట్ చేసింది. ఖేష్మ్ ద్వీపంలోని నివాస ప్రాంతాలపై కూడా క్షిపణి దాడి జరిగిందని ఇరాన్ స్థానిక మీడియా వెల్లడించింది. మరోవైపు, తాము జోర్డాన్‌లోని ఎయిర్‌బేస్, కమాండ్ సెంటర్‌ను లక్ష్యంగా చేసుకున్నామని ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ధృవీకరించింది. అమెరికా బెదిరింపులు కొనసాగినంత కాలం ఇరాన్ వైపు నుంచి ప్రతీకార ప్రతిఘటన తప్పదని హెచ్చరించింది. అయితే, ఇరాన్ ప్రయోగించిన అనేక బాలిస్టిక్ క్షిపణులను తాము విజయవంతంగా అడ్డుకున్నామని యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంటూ, డజన్ల కొద్దీ ఇరాన్ లక్ష్యాలపై విరుచుకుపడ్డామని వెల్లడించింది.

**ఈజిప్ట్‌లో గ్యాస్ ట్యాంకర్లపై దాడి..**

ఇంతకాలం కేవలం ఇరాన్, గల్ఫ్ దేశాలకే పరిమితమైన ఈ యుద్ధం బుధవారం మరో కొత్త మలుపు తిరిగింది. ఈజిప్ట్‌లోని దమియెట్టా పోర్ట్‌లో ఉన్న అమెరికాకు చెందిన ఒక గ్యాస్ ట్యాంకర్‌పై గుర్తుతెలియని డ్రోన్ దాడి జరిగింది. ఎల్ఎన్‌జీ లోడింగ్ మరియు ఇతర ప్రక్రియలు జోరుగా సాగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో భారీ ఎత్తున మంటలు ఎగసిపడి, క్షణాల వ్యవధిలో మరో ట్యాంకర్‌కు కూడా వ్యాపించాయి. దీంతో అప్రమత్తమైన అత్యవసర సహాయక బృందాలు వెంటనే రంగంలోకి దిగి నావికులను సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. ఇంధన నిల్వలు ఉన్న మరో ప్రాంతానికి ఘర్షణలు విస్తరించడంతో రాబోయే రోజుల్లో ఈ యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చనుందన్న ఆందోళన అంతర్జాతీయంగా వ్యక్తమవుతోంది. గత ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో ప్రారంభమైన ఈ భీకర యుద్ధం ఇప్పటికే ప్రపంచ దేశాలను తీవ్రమైన ఇంధన సంక్షోభంలోకి నెట్టేసింది. ఈ సంక్షోభాన్ని ముగించేందుకు జరుగుతున్న వివిధ దౌత్య ప్రయత్నాల వల్ల ఘర్షణలు తాత్కాలికంగా మరుగున పడుతున్నప్పటికీ, కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాలను పక్కనపెట్టి మరీ గత 10 రోజులకుపైగా ఇరు దేశాలు భారీ దాడులకు తెగబడుతుండటంతో శాంతి చర్చల ఆశలు పూర్తిగా అడుగంటుతున్నాయి.

### అమెరికా విమానాలకు ముప్పు

**వాషింగ్టన్ :** అమెరికా యుద్ధ విమానాలు, హెలికాప్టర్లకు పెను సవాల్‌గా మారిన అధునాతన ఆయుధాలను చైనా నుంచి ఇరాన్‌కు సరఫరా చేసేందుకు సర్వం సిద్ధమైంది. ఈ ప్రమాదకర ఆయుధాల రవాణా కోసం పొరుగు దేశమైన పాకిస్థాన్‌ను రహస్య మార్గంగా ఎంచుకున్నట్లు ఓ ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థ సంచలన కథనాన్ని ప్రచురించింది. ఈ పరిణామంతో అగ్రరాజ్యాధిపతి డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించకపోయినా, డ్రాగన్ దేశం చైనా తీరుపై తన తీవ్ర నిరాసను, అసంతృప్తిని వెళ్లగక్కారు. చైనా నుంచి దాదాపు 60 మిలియన్ డాలర్లకు (భారత కరెన్సీలో కోట్లలో) పైగా భారీ విలువైన 400 షోల్డర్‌ఫైర్డ్ ఎయిర్ డిఫెన్స్ (భుజాలపై మోసుకెళ్లే గగనతల రక్షణ) వ్యవస్థల కొనుగోలుకు ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది.

## నాసిరకం 'గుండ్లు' రైతు బతుకులో మంటలు!



- మోసపోయిన రైతు ఆగ్రహజ్వాల.. విత్తన దుకాణం ఎదుట నిరసన రణభేరి!
- అధికారుల నిర్లక్ష్యం.. అక్రమార్కుల దందాకు ఇంకెన్ని బలులు?

**అయిజ జూలై 30 (వుదయం బ్యూరో)**

నాసిరకం విత్తనాల రాక్షస క్రీడకు మరో రైతు బలిపీఠమెక్కాడు! వ్యాపారి చెప్పిన అబద్ధాలను నమ్మి విత్తనాలు కొని, ఉన్నదంతా ఊడ్చి సాగు చేస్తే చివరికి మిగిలింది శూన్యమే! చేతికొచ్చిన పంటను దున్నేసి, ఆవేదనతో విత్తన విక్రేత దుకాణం ముందు రైతు తిరగబడిన ఘటన జోగులాంబ గద్వాల జిల్లా అయిజలో సంచలనం సృష్టించింది. పర్ధపురానికి చెందిన తిమ్మప్ప గౌడ్ రెండెకరాల్లో బుడ్డల గుండ్లు సాగు చేసేందుకు అయిజలో రెండు క్వింటాళ్లు కొనుగోలు చేశాడు. కంటికి రెప్పలా కాపాడుకున్నా దిగుబడి రాకపోవడంతో నిలువునా మునిగి పోయాడు. వేరే మార్గం లేక పొలంలోని పంటను ట్రాక్టర్‌తో తొలగించిన రైతు, నేరుగా సదరు విత్తన దుకాణం ముందే నిరసన రణభేరి మోగించాడు. "నా పొలం బూడిదైంది.. నా నష్టానికి బాధ్యులెవరు?" అంటూ వ్యాపారిని నిలదీశాడు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వ్యాపారులపై వ్యవసాయ శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్థానికులు హెచ్చరించారు.

## రాయికోడ్‌లో కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**రాయికోడ్, జూలై 30(వు దయం):**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం గురువారం రాయికోడ్ మండల కేంద్రంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. అంజయ్య ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్ధనా పాటిల్,మండల పార్టీ అధ్యక్షుడు బాలాజీ నర్సింలు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కేదారనాథ్ పాటిల్, ఆలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి, అల్లాపూర్ సర్పంచ్ చరణ్ కుమార్, రాయికోడ్ సర్పంచ్ రాధ తుకారాం, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నాగశెట్టి పాటిల్, మాజీ చైర్మన్ నజీర్, మాజీ యువత అధ్యక్షుడు విదర్శన్ రెడ్డి, యువజన అధ్యక్షుడు ప్రభాకర్తో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన అతిథులు,ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు ఆర్థికంగా బలహీన వర్గాల కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొని చెక్కులు అందుకుని ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎడ తరపు లేని వర్షాలు

- మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షులు మైసయ్య యాదవ్

**వుదయం, న్యూస్ శివ్వంపేట జులై 30:**



మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో నేడు మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షులు అక్కమొల్ల మైసయ్యా యాదవ్ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. రాష్ట్రవ్యాప్తంగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల మెదక్ జిల్లా ప్రజలకు రైతులకు ఆయన సూచనలు చేశారు. గ్రామంలో ఉన్న ప్రజలు కరెంటు స్తంభాలు నానిపోయి ఉండడం వల్ల లూజు కలెక్షన్ల వల్ల కరెంటు షార్ట్ సర్కుడు అవడం జరుగుతుంది. అందువల్ల ప్రజలు స్తంభాలకు గాని నీరు ఎక్కువగా ఉన్న చోట గాని ఉండకూడదు. ముఖ్యంగా రైతులు తమ పొలాల వద్దకు వెళ్ళినప్పుడు తడి చేతులతో కరెంటు డబ్బాలను ముట్టుకోవడం గానీ. కరెంటు స్తంభాలను తాకడం గానీ చేయకూడదని అందరూ జాగ్రత్త పడాలని ప్రజల్ని ఉద్దేశించి ఆయన సూచనలు చేయడం జరిగింది.

## 'ఉప సర్పంచుల' సారథిగా ఏకగ్రీవం



- హక్కుల సాధనకు సమర శంఖం.. అధికారులపై ఒత్తిడి తథ్యం!

**గద్వాల, జూలై 30 (వుదయం కరస్పాండెంట్)**

జోగులాంబ గద్వాల జిల్లా ఉప సర్పంచుల ఫోరం పోరుబాటకు నూతన సారథి దొరికాడు! ఫోరం జిల్లా అధ్యక్షుడిగా వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామ ఉప సర్పంచ్ నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలో డిప్యూటీ కలెక్టర్ రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఉప సర్పంచుల రణభేరి సమావేశంలో ఏకగ్రీవ ఎన్నిక జరిగిందని సగర్వంగా ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్లా కార్తిక్ ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల్లో ఉప సర్పంచుల హక్కులను కాలరాస్తే ఊరుకునేది లేదని, రాబోయే రోజుల్లో ఫోరమ్‌ను మరింత శక్త్యుపేతంగా మారుస్తామని ఉద్ఘాటించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పురుషోత్తం, వర్కింగ్ ప్రెసిడెంట్ గణేష్‌లతో పాటు జిల్లాలోని మూలమూలల నుంచి కదలివచ్చిన ఉప సర్పంచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతన సారథి నాగరాజును పూలమాలలు, శాలువాలతో నేతలు, సభ్యులు అభినందనలతో ముంచెత్తారు.

**అధికారుల ముందుకు సమస్యల చిట్టా.. రాజీపడేదే లేదు!**

ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ వార్నింగ్ ఇచ్చే రీతిలో స్పందించారు. "నాపై ఉంచిన నమ్మకాన్ని గుండెల్లో పెట్టుకుంటా. జిల్లాలోని ఉప సర్పంచుల సమస్యల పరిష్కారానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధమే. కాలయాపన చేసే అధికారుల వైఖరిని సహించేది లేదు. హక్కుల సాధన కోసం పాలనా యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి, తీరని సమస్యలను వెంటపడి మరీ పరిష్కరిస్తాం. జిల్లాలోని ప్రతి ఒక్క ఉప సర్పంచ్‌నూ ఏకం చేసి ఫోరంను తిరుగులేని శక్తగా తీర్చిదిద్దుతాం!" అని స్పష్టం చేశారు.

## కోహీర్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

- "నేరపూరిత కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఆదేశం"
- "ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక"

**కోహీర్, జూలై 30 (వుదయం ప్రతినిధి): .**

సంగారెడ్డి జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ ఆదేశాల మేరకు కోహీర్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ (CI) శివలింగం, కోహీర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను పిలిపించి, వారి హాజరును పరిశీలించి కౌన్సెలింగ్ నిర్వహించారు. వారి రికార్డులను కూడా సమగ్రంగా తనిఖీ చేశారు.

**కౌన్సెలింగ్ సమయంలో CI శివలింగం మాట్లాడుతూ:**

రౌడీషీటర్లు సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని, ఎలాంటి అసాంఘిక లేదా నేరపూరిత కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలు లేదా నేరాలకు పాల్పడితే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని



వారిలో 22 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారని తెలిపారు. హాజరుకాని వారికి త్వరలోనే స్టేషన్‌లో హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.పోలీసులు రౌడీషీటర్లకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతామని హెచ్చరించారు.ఈ కౌన్సెలింగ్ కార్యక్రమంలో కోహీర్ పోలీస్ స్టేషన్ అధికారులు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## హాస్టళ్లా... విషవలయాలా?

- వేధిస్తున్న రోగాలు.. వేదనలో విద్యార్థులు!
- మురికి కూపాలుగా వసతి గృహాలు.. పట్టించుకోని పాలకులు
- పీవైఎల్ ఆగ్రహం.. జిల్లా సంక్షేమ అధికారికి వినతి

**గద్వాల జూలై 30 (వుదయం బ్యూరో)**

సంక్షేమ పథకాలంటూ గొప్పలు చెప్పుకునే ప్రభుత్వ పాలనలో పేద విద్యార్థుల బతుకులు అగాధంలోకి నెట్టబడుతు న్నాయని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్) జిల్లా అధ్యక్షుడు బీరెల్లి దానయ్య తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని పట్టిక కులాలు, వెనుకబడిన తరగతుల వసతి గృహాలు కనీస వసతులు లేక నరకానికి ప్రతిరూపాలుగా మారాయని ధ్వజమెత్తారు. కడుపునొప్పి, వాంతులు, విషజ్వరాలతో విద్యార్థులు హాస్పిటళ్ల పాలవుతున్నా అధికారుల్లో చలనం లేకపోవడం శోచనీయమన్నారు. వేడి నీటి సౌకర్యం లేకపోవడంతో చలి, వర్షాకాలంలో గజగజ వణుకుతూ చల్లని నీటితోనే స్నానాలు చేయాల్సి వస్తోందని, ఫలితంగా అనేక రకాల ఊపిరితిత్తుల, చర్మ సంబంధిత వ్యాధులు సంక్రమిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరకొర వసతులు.. నాసిరకం కూడు! స్నానపు గదులు, మరుగుదొడ్లు తీవ్ర అపరిశుభ్రతకు నిలయాలుగా మారి దుర్వాసన వెదజల్లుతున్నాయని ఆరోపించారు. కరెంట్ కోతలు, తిరగని ఫ్యాన్లు, వెలగని లైట్లు, సరిపడా మంచాలు, పరుపులు లేక విద్యార్థులు నేలపైనే



నిద్రిస్తూ రాత్రంతా జాగారాలు చేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులకు పెట్టే భోజనంలో నాణ్యత మృగ్యమైందని, పురుగుల కూడు పెడుతూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని నిలదీశారు. అధికారులారా...నిద్రమత్తు వీడండి! అధికారులు తమ శీతల గదులను వదిలి క్షేత్రస్థాయిలో వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే శుద్ధి చేసిన తాగునీటి వ్యవస్థలను, వేడినీటి యంత్రాలను పునరుద్ధరించాలని, మౌలిక వసతులను యుద్ధప్రాతిపదికన కల్పించాలని హెచ్చరించారు. "పేద విద్యార్థుల చదువు, ప్రాణాలతో ప్రభుత్వం చదరంగం ఆడొద్దు. ఈ దయనీయ పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపకపోతే జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ, విద్యార్థి లోకంతో కలిసి ఆందోళనలను తీవ్రతరం చేస్తాం" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాముకాటుకు బాలుడు బలి: 'గోల్డెన్ అవర్'లో దక్కని వైద్యం

**అయిజ జూలై 30 (వుదయం ప్రతినిధి)**

రేపటి పౌరుడిగా ఎదగాల్సిన ఆ చిరుదీపం.. కాలసర్పం కాటుకు, వ్యవస్థ అచేతనత్వానికి మధ్య నలిగి ఆరిపోయింది! కంటికి రెప్పలా కాపాడుకుంటున్న కన్నపేగు కళ్లముందే విలవిలలాడుతున్నా, కాపాడుకోవడానికి పల్లెలో కాసింత వైద్యం దొరక్క ఆ తండ్రి పడ్డ ఆవేదన వర్ణనాతీతం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర వసతులు మృగ్యమై, సరిహద్దు దాటితే తప్ప ప్రాణం దక్కని దైన్యస్థితికి జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగిన ఈ ఘటన సజీవ సాక్ష్యంగా నిలిచింది. కాటేసిన కాలసర్పం:వెంకటాపూర్ గ్రామానికి చెందిన కే. తిరుమలేష్ (14) స్థానిక పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కాలసర్పం బాలుడిని కాటేసింది. సమయం తినివేసిన జాప్యం: పాముకాటు పడిన వెంటనే అందించాల్సిన 'యాంటీ స్నేక్ వెనమ్' (ఏ ఎస్ వి) స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో లేకపోవడంతో, సమయం క్షణక్షణమూ కరిగిపోయింది. ప్రాణాలు కాపాడుకునేందుకు కుటుంబ సభ్యులు బాలుడిని పొరుగున ఉన్న ఏపీలోని కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. అయితే, మార్గమధ్యంలో జరిగిన కాలయాపన వల్ల విషం ఒళ్లంతా ప్రాకింది. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ బాలుడు కన్నుమూశాడు.



వైద్యం ఉంటే.. ప్రాణం దక్కేదే! పాముకాటు పడిన తొలి గంట ('గోల్డెన్ అవర్')లోనే ప్రాథమిక చికిత్స అంది ఉంటే తిరుమలేష్ దక్కేవాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ఆసుపత్రుల్లో అత్యవసర ఇంజెక్షన్లు, వెంటిలేటర్ వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని మండిపడుతు న్నారు. బాలుడి అకాల మరణంతో వెంకటాపూర్ గ్రామంలో శోకసంద్రం అలుముకోగా, కన్నవారి రోదనలు స్థానికులను కలచివేశాయి. ప్రజాగ్రహం – ప్రజాప్రతినిధులు, అధికారులపై ప్రశ్నల వర్షం: అసలు అయిజ లాంటి మండల కేంద్రంలో కనీసం ఒక పాము కాటుకు కూడా మందు దొరకకపోవడం ఏంటి? పేరుకే ప్రభుత్వ హాస్పిటల్స్ తప్ప, ప్రజలకు ఉపయోగం ఏముంది? ఎక్కడైనా, ఏ చిన్న సమస్య వచ్చినా.. కొద్దిగా సీరియస్ ఉంటే 'కర్నూలుకి వెళ్ళండి' అని చెప్పడం తప్ప ఈ ప్రభుత్వ హాస్పిటళ్ళు చేసేదేమీ లేదు" అని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ గారికి విజ్ఞప్తి:ఆపదలో ఉన్న పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యమే కొండంత అండగా నిలవాలి. కానీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే – గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ గారు ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వ ఆసుపత్రుల తీరును పర్యవేక్షించాలని, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అత్యవసర మందులు (ఏఎస్ వి) అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, బాధితులు వేడుకుంటున్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి, జూలై 30:వుదయం:**



ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. గురువారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజలను కలిసి వారి సమస్యలను ఓర్పుగా విని, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ప్రతి వినతిని శ్రద్ధగా పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ, "ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటం, వారి సమస్యలను వేగంగా పరిష్కరించడం ప్రజాప్రతినిధిగా నా బాధ్యత. ప్రజల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి సమస్యపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటాం" అని పేర్కొన్నారు.

## రోడ్డు నిర్మాణంతోప్రజలకు రవాణ సౌకర్యం మెరుగు

- ఫార్మేషన్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన
- శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

**నారాయణఖేడ్ జులై 30 (వుదయం)**

నారాయణఖేడ్ మండల పరిధిలోని హంగిర్గ (కే )గ్రామం నుండి గోప్య నాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని లాల్ సింగ్ తండా వరకు నూతనంగా నిర్మించనున్న ఫార్మేషన్ (మట్టి) రోడ్డు పనులకు భూమిపూజ చేసి ఈ రోడ్డు నిర్మాణం తో ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగు పడుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి, తండాకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. హంగిర్గ కే నుండి లాల్ సింగ్ తండా వరకు సరైన రోడ్డు లేక ప్రజలు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.రోడ్డు నిర్మాణం పూర్తయితే తండా ప్రజలకు రవాణా కష్టాలు తీరడమే కాకుండా, రాకపోకలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను



ఆదేశించారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహాదేవి శాంత్ కుమార్, ఉప సర్పంచ్ భాస్కర్ ముదిరాజ్, మనోహర్ పాటిల్, మాజీ సర్పంచ్, వినోద్ పాటిల్, పండరి రెడ్డి మాజీ ఎంపీటీసీ, రమేష్ చౌహాన్, జ్ఞానేశ్వర్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాజు కుమార్ పాటిల్, పుండ్లిక్, నగ్శెట్టి పాటిల్, సంగప్ప బిరాదర్,శ్రీకాంత్,స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు , తండావాసులు పాల్గొన్నారు.

## గర్భాశయ క్యాన్సర్‌పై విరుచుకుపడ్డ జిల్లా యంత్రాంగం!

- 14 ఏళ్ల బాలికలకు ప్రాణరక్షణ కవచం | గద్వాల్‌లో ముమ్మరంగా వ్యాధి నిరోధక టీకా సమరం
- లక్ష్యం 7,676.. ఇప్పటికే 4,197 మందికి పూర్తి!
- ఏ ఒక్క బాలికా మిగలొద్దు.. గడువులోగా శతశాతం పూర్తి చేయాల్సిందే!
- రంగంలోకి రాష్ట్ర బృందం.. క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు, పకడ్బందీ ఆదేశాలు

**గద్వాల, జూలై 30 (వుదయం బ్యూరో):**

ఆడపడుచుల ప్రాణాలను ఊపిరి ఉండగానే తీస్తున్న గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ రక్కసిపై జోగులాంబ గద్వాల్ జిల్లా యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. ముక్కుపచ్చలారని 14 ఏళ్ల బాలికల భవిష్యత్తుకు బలమైన రక్షణ కవచం నిర్మించేందుకు వ్యాధి నిరోధక టీకాకరణను యుద్ధప్రాతిపదికన పరుగులు తీస్తోంది. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సంధ్య కిరణ్మై పర్యవేక్షణలో రాష్ట్ర టీకాల తనిఖీ బృందం సభ్యులు డేవిడ్ దమార, డాక్టర్ పృథ్వీరాజ్ క్షేత్రస్థాయిలో రౌండ్ వేశారు. గద్వాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ధరూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో టీకాల పంపిణీ



తీరును జల్లెడ పట్టారు. నిల్వ కేంద్రాల భద్రత, శీతలీకరణ వ్యవస్థల పనితీరు, లబ్ధిదారుల నమోదు ప్రక్రియను క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులపై తీవ్ర ఒత్తిడి పెంచారు.

**లక్ష్యం వంద శాతం.. వదిలేదే లేదు!**

ఈ సందర్భంగా జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి మహమ్మద్ అస్గర్ అలీ స్పష్టం చేస్తూ.. జిల్లా వ్యాప్తంగా 14 సంవత్సరాల వయస్సు గల అర్హులైన బాలికలు మొత్తం 7,676 మంది ఉన్నారని, వారిలో ఇప్పటికే 4,197 మందికి టీకాలు పూర్తి చేశామని వెల్లడించారు. విద్యాశాఖ, వైద్యారోగ్య శాఖల ఉమ్మడి దండయాత్రతో ఏ ఒక్క బాలికా ఈ ఆరోగ్య రక్షణ నుంచి బయటపడకుండా అణువణువూ శోధిస్తున్నామని తెలిపారు. ఈ తనిఖీల్లో వైద్య, విద్యా శాఖల ఉన్నతాధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సైతం పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేసేందుకు పట్టుదలతో పని చేస్తున్నారు.

## వర్షం నీటిని ఒడిసి పట్టాలి

**నారాయణపేట, జూలై 30 (వుదయం ప్రతినిధి):**

వర్షం నీటిని ప్రతి ఒక్కరు ఒడిసి పట్టాలని అందుకు జలసిరి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్ గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ గౌడ్ పిలుపునిచ్చారు.గురువారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ ఇంకుడు గుంతలు ఊట కుంటలు వీటిని నిర్మాణం చేసుకుంటే రైతులకు పొలంలో నీటి నిలువ శాతం ఉంటుందని వివరించారు.ఈ సందర్భంగా ఎస్ ఐ ఆర్ ను సమర్థంగా నిర్వహించిన వి ఎల్ ఓ సావిత్రమ్మను,జి పి వెంకట రమణ ను సన్మానించారు.



## మూగజీవి ప్రాణానికి విలువేలేదా..?

- ఎలుకూరులో 'టిప్పర్' రాక్షసత్వం... పంది అక్కడికక్కడే బలి!
- రక్తమోడుతున్న పల్లె బాటలు... అధికారుల గుడ్డి వైఖరిపై నిప్పులు చెరుగుతున్న జనం!

**మల్దకల్ జూలై 30 (వుదయం బ్యూరో)**



గ్రామీణ రహదారులు మృత్యుకూపాలుగా మారుతున్నాయి! బాధ్యతారాహిత్యం, అతివేగం, అడ్డూ అదుపూ లేని రాక్షస డ్రైవింగ్ అమాయక జీవులను బలితీసుకుంటున్నాయి. జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఎలుకూరు గ్రామంలో గురువారం ఉదయం చోటుచేసుకున్న ఘోర ఘటన స్థానికులలో తీవ్ర ఆగ్రహజ్వాలలను రగిల్చింది. గ్రామం నడిబొడ్డున మరణ మృదంగం మోగిస్తూ దూసుకొచ్చిన ఓ టిప్పర్ రాక్షసత్వానికి అమాయక పంది అక్కడికక్కడే నలిగిపోయి విగతజీవిగా మారింది.మనిషి చస్తేనే స్పందిస్తారా..? ఈ దారుణంపై గ్రామస్తులు తీవ్ర ఆక్రోశం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "పోతే పోయింది మూగజీవే కదా అని అధికారుల నిర్లక్ష్యం! అదే ఇక్కడ ఒక మనిషి ప్రాణం పోయి ఉంటే అధికారుల హడావుడి, నాయకుల కంటితుడుపు నాటకాలు వేరేలా ఉండేవి. నోరులేని జీవి కాబట్టే ఈ ఉదాసీనతా?" అని నిలదీస్తున్నారు. ప్రాణంలో తేడాలు వెతికే ఈ కుళ్ళిన సమాజం ముందు మూగజీవి రక్తం ప్రశ్నిస్తూనే ఉందంటూ విరుచుకుపడు తున్నారు. రహదారులపై రాక్షస క్రీడగ్రామాల గుండా వెళ్లే భారీ వాహనాలు, ఇసుక/మట్టి టిప్పర్లు కనీస మానవత్వం, స్పృహ లేకుండా యథేచ్ఛగా రేసుగుర్రాల్లా పరిగెడుతున్నాయి. ఎటువైపు నుంచి పసిపిల్లలు వస్తారో, పశువులు వస్తాయో అన్న భయం కొంచెమైనా లేకుండా డ్రైవర్లు మరణ మృదంగం వాయిస్తున్నారు. రవాణా శాఖ, పోలీసు అధికారుల మామూళ్ల మత్తు, నిఘా రాహిత్యమే ఈ వరుస ప్రమాదాలకు సజీవ సాక్ష్యమని పల్లె జనం నిప్పులు చెరుగుతున్నారు. ఇకనైనా కళ్లు తెరవండి! ఈ ఘటనపై తక్షణమే విచారణ జరిపి, ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను అరెస్ట్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఎలుకూరు రహదారులపై తక్షణమే ప్రాణాంతక వేగాన్ని నియంత్రించే స్పీడ్ బ్రేకర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయకపోతే రహదారి దిగ్బంధనానికి దిగుతామని హెచ్చరిస్తున్నారు. ఒక మూగజీవి రక్తం రోడ్డుపై ఇంకిపోయింది... కానీ అధికారుల నిర్లక్ష్యం, సామాజిక బాధ్యతారాహిత్యంపై ఆ నెత్తుటి చారికలు వేస్తున్న ప్రశ్నలు మాత్రం నివురుగప్పిన నిప్పులా రగులుతూనే ఉన్నాయి!

## శ్రీ సాయి కి నేడు ప్రత్యేక పూజలు



- శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్

**వుదయం, న్యూస్ శివ్వంపేట జులై 30:**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో కొలువుదీరిన శ్రీ దత్తాత్రేయ మహాస్వామి. శిరిడి సాయిబాబా నేడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ సంఘ సేవకులు పెద్దగోని జిన్నారం శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నేడు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం. శివ కుమార్ గౌడ్ మాట్లాడుతూ నేడు గురువారం ఉపవాసం ఉండటం మంచిది.. ఉపవాసం రోజు ప్రశాంతంగా ఉండండి, ఎవరి గురించి చెడుగా భావించకండి లేదా మరొకరి గురించి చెడుగా మాట్లాడకండి. సాయిబాబా పూజ, ఉపవాసం ఉన్నప్పుడు నీరు తీసుకోకుండా ఉపవాసం ఉండాలనే నియమం లేదు. మీరు ఒక సమయంలో పండు లేదా ఒక భోజనం తినడం ద్వారా ఈ ఉపవాసాన్ని పాటించవచ్చు. ఉపవాస సమయంలో బాబాకు సమర్పించే ప్రసాదాన్ని పంచిపెట్టి తీసుకోవాలి.. పూజకు ధూపం, దీపం, సాయిబాబా విగ్రహం, చందనం, పసుపు పువ్వులు, నెయ్యి దీపం, పసుపు వస్త్రం, పంచామృతం, ప్రసాదం, పండ్లు మొదలైనవి అవసరం.. హారతి ఇవ్వడం మర్చిపోకండి గురువారం తెల్లవారు జామున నిద్రలేచి స్నానం చేసి ధ్యానం చేయండి. అప్పుడు శుభ్రమైన బట్టలు ధరించండి. తర్వాత సాయిబాబా విగ్రహానికి పంచామృతంతో అభిషేకం చేయండి. దీని తర్వాత సాయిబాబాను ఆరాధిస్తూ ఉపవాసం పాటించండి. పూజ ప్రారంభించేముందు సాయిబాబా విగ్రహం కింద శుభ్రమైన పసుపు వస్త్రాన్ని పరచి ఉంచండి. సాయిబాబా విగ్రహం ముందు దీపం, అగరుబత్తీలు, ధూపం వెలిగించండి. సాయిబాబాకు చందనం లేదా కుంకుమ తిలకం వేయండి. అలాగే సాయి వ్రత కథ చదవండి, సాయి చాలీసా చదవండి. సాయిబాబా పూజ ముగింపులో బాబాకు ఆరతి ఇవ్వడం మర్చిపోకండి అందరికీ ప్రసాదం పంచండి. పదిమందికి మీకు వీలైనంతలో దానం చేయండి. బాబా అనుగ్రహం ఎప్పుడూ ఉంటుంది అని వారు వివరించారు. అనంతరం భక్తులు మాట్లాడుతూ ఈ మహత్తరమైన ఆలయం నిర్మించడం. ఇక్కడికి విచ్చేసిన భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం. భక్తి అంటే ఏంటి అది ఎలా ఉంటుంది దాని సాధన ఎలా అనే అంశాల గురించి చక్కగా వివరించడం మాకు ఎంతో ఆనందంగా ఉందని ఆ భగవంతుని కృప వల్ల శివకుమార్ గౌడ్ దంపతులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని వారి సేవలు మరి ఎంతోమందికి అందేటట్లు ఆ భగవంతుని ఆశీర్వాదాలు పొందాలని శ్రీ సాయినీ ప్రార్థించడం జరిగింది వారు వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి చేసిన భక్తులు. శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు. ప్రముఖులు విచ్చేశారు.

## ఉద్యమ నాయకులపై అక్రమ కేసులను వెనక్కి తీసుకోవాలి



- సిఐటియు రాష్ట్ర నాయకులు జయలక్ష్మి

**నారాయణపేట టౌన్, జూలై 30(వుదయం ప్రతినిధి):**

నారాయణపేట జిల్లాలో కార్మికుల రైతుల కోసం వ్యవసాయ కూలీల కోసం పనిచేస్తున్న ఉద్యమ నాయకుల పై అప్పటి బి ఆర్ ఎస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించిందని వాటిని బేసరత్తుగా వెనక్కి తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర నాయకులు పి జయలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం ఉద్యమ నాయకులతో కలిసి నారాయణపేట జిల్లా కోర్టులో హాజరైన తర్వాత ఆమె కోర్టు వెలపల మాట్లాడారు.

2024 సంవత్సరంలో అంగన్వాడి, ఆశ ,మధ్యాహ్న భోజన కార్మికులు, మున్సిపల్ గ్రామపంచాయతీ తదితర రంగాల కార్మికుల హక్కుల కోసం కనీస వేతనం కోసం ధర్నాలు రాస్తారోకోలు చేశామని , ఆ సమయంలో కార్మిక సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం తమపై అక్రమంగా కేసులు బనయించిందని విమర్శించారు .

సమస్యలు పరిశీలించకుండా ప్రజలను ఇబ్బంది పెడుతూ కేసులు బనాయించిన బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేకతో గద్దె దిగిపోయిందని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అంటున్న రేవంత్ రెడ్డి ఉద్యమ నాయకుల పై మోపిన అక్రమ కేసులను రద్దు చేయాలని కోరారు.ఆమెతోపాటు సిపిఎం జిల్లా కార్యదర్శి జి వెంకట్రామిరెడ్డి , తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ , సిఐటియు జిల్లా కార్యదర్శి బండమీది బలరాం , సిఐటియు జిల్లా అధ్యక్షులు గోవిందరాజ్ , తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుండెగొరి దస్తప్ప, సిఐటియు జిల్లా నాయకులు నరహరి ,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పవన్ ,మోహన్ తదితరులు ఉన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత



**శేర్లింగంపల్లి:**

శేర్లింగంపల్లి నియోజకవర్గం లోని చందానగర్ డివిజన్ లో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు మిరియాల ప్రీతం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయం తక్కువగా ఉన్న తరుణంలో ప్రతి ఒక్కరు తమ ఓటును మరొకసారి పరిశీలించుకోవాలని, సంబంధిత అధికారులకు గుర్తింపు పత్రాలను అందజేయాలని ఆయన కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును నిలబెట్టు కోవాలని ఆయన సూచించారు. ఈ సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అందరూ తమ తమ కాలనీలలోని పరిధిలో ని ఇన్ఫర్మేషన్ సెంటర్స్ లో అప్లికేషన్లు ఇవ్వాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించిన కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్,**
**జులై 30,(వుదయం ప్రతినిధి ),**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి కృషితో సీఎంసీ స్పెషల్ ఫండ్ ద్వారా రూ.40 లక్షలు, రూ.68 లక్షల నిధులు మంజూరు కాగా ఈ నిధులతో 277వ డివిజన్ పరిధిలోని మహాదేవపురం కాలనీలో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు.

మహాదేవపురం కాలనీలోని ఏ,డి,ఎం, బ్లాక్‌లతో పాటు ఫేజ్-2 పరిధిలోని పలు ప్రాంతాల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ కాలనీల సమగ్ర



అభివృద్ధి, నాణ్యమైన రహదారుల నిర్మాణం, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తూ, ప్రతి కాలనీ అభివృద్ధే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కాలనీ అభివృద్ధికి విశేష కృషి చేసి సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన కాంగ్రెస్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డికి కాలనీ వాసులు, వెల్ఫేర్ సొసైటీ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 277వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు సిద్ధనోళ్ల సంజీవ్ రెడ్డి, స్టేట్ మహిళా వైస్ ప్రెసిడెంట్ అంజలి యాదవ్, మహాదేవపురం కాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కే. వెంకటరెడ్డి, ప్రసాద్, రాంచందర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ప్రవీణ్, వెంకట్ రెడ్డి, కృష్ణ రెడ్డి, దిలీప్, రాజమహేంద్ర, మల్లారెడ్డి, జాంగా రెడ్డి, శివ రెడ్డి, రాంచందర్ (ఎస్ఐ), సంతోష్, రంజిత్, వెంకటేష్, సురేష్, చావా శ్రీనివాస్, వీరయ్య, ప్రభాకర్, అనిల్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, ప్రశాంతి, చర్చి పాస్టర్లు, కాలనీ వాసులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాంలీలా మైదానంను మరింత అభివృద్ధి చేస్తాం...



**: బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**

**కుత్బుల్లాపూర్,**
**జులై 30,(వుదయం ప్రతినిధి ),**

సుభాష్ నగర్ డివిజన్ 130, సూరారం కాలనీ "శ్రీ రాంలీలా మైదానం" నూతన కమిటీ కార్యవర్గం సభ్యులు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ ఆధ్వర్యంలో పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద్ ను మర్యాదపూర్వకంగా కలిసి రామ్ లీలా మైదానంలో నిరుపయోగంగా ఉన్న బోరుకు మోటారు బిగించడంతో పాటు విద్యుత్ సదుపాయాన్ని కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన కమిటీ అధ్యక్షులైన కొట్టే రవి, ప్రధాన కార్యదర్శి కొత్తకొండ రవిలను శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలకు, పండుగలకు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న శ్రీ రామ్ లీలా మైదానమును అభివృద్ధి చేసేందుకు కమిటీ సభ్యులకు తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు ధారం సాయికుమార్, మాణిక్య రెడ్డి, జాయింట్ సెక్రెటరీ మాసిరెడ్డి, శ్రీనివాస్, సెక్రటరీ లక్ష్మణ్, గోవిందప్ప, ఆర్గనైజింగ్ సెక్రటరీలు శ్రావణ్ కుమార్, వీరన్న, భాస్కర్ రెడ్డి, సభ్యులు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల సీఐ, ఎస్సైలకు తల్లారం ప్రజాప్రతినిధుల ఘన సన్మానం

**నూతన బాధ్యతల స్వీకరణ సందర్భంగా శాలువాతో సత్కారం – మెరుగైన పోలీస్ సేవలు అందించాలని ఆకాంక్ష**

**చేవెళ్ల,**
**జూలై30(వుదయం)**

చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ నరేందర్ రెడ్డి, ఎస్సై కోటీశ్వరరావులను గురువారం తల్లారం గ్రామ ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా స న్మా నిం చా రు . నూ త న బాధ్యతల స్వీకరణ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు నిష్పక్షపాతంగా, మరింత సమర్థవంతమైన పోలీస్ సేవలు అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో విశేషంగా సేవలందించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తల్లారం సర్పంచ్ కావలి లక్ష్మి ప్రసన్న శేఖర్, ఉపసర్పంచ్ మహమ్మద్ నవాజ్, మాజీ వార్డ్ సభ్యుడు ఎండి అంజాద్ ప్రసాద్, వుదయం రిపోర్టర్ కె. అశోక్ పాల్గొన్నారు.

## సనాతన ధర్మం - ఆదర్శం

**.పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్న నరేష్ కుమార్ సేవలు భేష్**
**.భాజపా తెలంగాణ ఎండోన్మెంట్ సేల్ దార్మిక సంస్థ కన్వీనర్ శ్రీ అన్నవజ్జుల సూర్య ప్రకాష్ రావ్**

**శంకర్ పల్లి**
**జులై 30(వుదయం)**



సనాతన ధర్మాన్ని విశ్వవ్యాపితం చేసిన జగద్గురు ఆదిశంకర చార్లను హిందూ హైందవ జాతి చైతన్యం కోసం ప్రాణాలను కూడా లెక్కచేయని చత్రపతి శివాజీ లను ప్రతి భారతీయుడు ఆదర్శంగా తీసుకొని ఎదగాలని తెలంగాణ ఎండోమెంట్ సెల్ ధార్మిక స్టేట్ కన్వీనర్ శ్రీ అన్నవజ్జుల సూర్యప్రకాష్ గారు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం వ్యాస పూర్ణిమ గురిపౌర్ణిమ సందర్భంగా నవపేట్ మండలం గుబ్బడి పత్యపురంలోని శ్రీ రాధాకృష్ణ ఆలయ క్షేత్రం శ్రీ క్రిష్ణగిరి పా దా ల గు ట్ట ను ఆయన సందర్శించి ప్రత్యేక అభిషేక పూ జ లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన ఆలయాలు అభివృద్ధి సనాతన చరిత్రల అభివృద్ధి కోసం శ్రమించి చెందిప్ప మరకత శివలింగ నామకరణ భక్తుడు ఆలయ పున నిర్మాణ స్వీకారకుడు కోటి దీపోత్సవ రాష్ట్రస్థాయి ధర్మకర్త అవార్డు గ్రహీత శంకర్పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్ నరేష్ కుమార్ (సతీష్ కుమార్ )సేవలు భినందనీయమన్నారు. నేటి యువతరం నరేష్ కుమార్ ను ఆదర్శంగా తీసుకొని తమ తమ గ్రామాలలో ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్నారు. స్టేట్ కో కన్వీనర్ శ్రీ నిరంజన్ దేశాయ్ గారు మాట్లాడుతూ తాను మా ధార్మిక సంస్థలో రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్ గా ఉన్న నరేష్ కుమార్ సతీష్ కుమార్ ఇలాంటి మారుమూల గ్రామాల్లో దేశభక్తిని దైవభక్తిని పెంపొందించడం తమ సంస్థకే గర్వకారణమని కొనియాడారు. ప్రతి హిందూ ప్రతి శనివారం తప్పకుండా గుడికెళ్లి పూజలు చేయాలని నరేష్ కు మీరంతా సహకరిస్తే మీ గ్రామానికి మరింత పేరు ప్రఖ్యాతలు లభిస్తాయి అని సూచించారు. స్టేట్ కార్యవర్గ సభ్యులు మణిదీప్, జిల్లా కో కన్వీనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఈ గుబ్బడి పత్తి పురంలోని క్రిష్ణగిరి పాదాల గుట్ట ఎంతో మహిమగలదని ఇలాంటి ప్రాంతానికి పిలిపించిన నరేష్ కుమార్ గారికి గ్రామస్తులకు కృతజ్ఞతలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయాలని తాము కూడా ఇలాంటి ఆలయాల నిర్మాణాలకు అండగా ఉంటామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా రూరల్ కన్వీనర్ నర్సింగ్ రావ్, భాజపా ఎండోమెంట్ సెల్ ధార్మిక జాయింట్ కన్వీనర్ ఆర్ నరేష్ కుమార్ సతీష్ కుమార్ మాట్లాడుతూ పుట్టిన ఊరును జన్మనిచ్చిన తల్లిదండ్రులను మర్చిపోవద్దని శ్రీరామచంద్రుడు అన్నాడు కాబట్టి ప్రతి ఒక్కరూ రాముని సందేశాన్ని ఆదర్శంగా తీసుకుంటే ప్రతి గ్రామం ఓ రామ రాజ్యం అవుతుందని తెలిపారు... గురు పూర్ణిమ గురు పూజత్సవమును పురస్కరించుకొని అంతప్ప గూడ గ్రామం లోని శ్రీ శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున బ్రహ్మానంద ఆశ్రమ పిఠాధిపతి ఏ. నర్సింహా గౌడ్ గారిని, సూర్య ప్రకాష్ రావ్ గారు శాలువాతో సత్కరించి గురువందనం గౌరవాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రావులపల్లి రామ లక్ష్మయ్య భూపతిరెడ్డి, ముదిరాజ్ జంగయ్య, ఆర్ రాజు, రాములు గౌడ్, వేనేంద్ర చారి, కార్తీక్, పోచయ్య, తదితరులను స్టేట్ కమిటీ అభినందించి శాలువాక్ అప్పడం జరిగింది. స్టేట్ జాయింట్ కన్వీనర్ ఎస్ విజయ శ్రీ చౌదరి గుడి అభివృద్ధికి ఐదువేలను విజయేందర్ సింగ్ 10000 అందించడం జరిగింది. అనంతరం నరేష్ కుమార్ స్టేట్ కమిటీ అన్న వజ్జుల సూర్యప్రకాష్ గారిని, నిరంజన్ దేశాయ్ గారిని, విజయ్ శ్రీ చౌదరి గారిని, అండెం నర్సిరెడ్డి గారిని, ముత్యాల అనిల్ కుమార్ గారిని, హనుమకొండ శైలజ గారిని, శంకర్ చారిని, జిల్లా జాయింట్ కన్వీనర్ ఎన్.రమేష్ గారిని, జిల్లా జాయింట్ కన్వీనర్ డి భాస్కర్ గౌడ్, గారిని జిల్లా కో కన్వీనర్ కొంగూరి కిరణ్ గారిని, వైబావ్, నర్సింహా రెడ్డి తదితర కార్యవర్గ సభ్యులందరికీ సన్మానించి తీర్థ ప్రసాదలను అందించడం జరిగింది . అనంతరం వచ్చిన భక్తులందరికీ అన్న వితరణ అన్న ప్రసాద వితరణ జరిగింది. పచ్చని పంట పొలాలు చల్లని చిరుజల్లులతో కూడిన గాలులో పల్లెటూరి వాతావరణం మనసులను ఆనందపరిచిందని వచ్చిన భక్తులందరూ పులకించి పోవడం జరిగింది.

## క్రీడలతోనే పోలీసులకు శారీరక దృఢత్వం – ఎస్పీ శ్రీనివాసరావు

**గద్వాల**
**జూలై 30 (వుదయం కరస్పాండెంట్)**

పోలీసు విధులు అత్యంత సవాళ్లతో కూడుకున్నవని, వాటిని సమర్థవంతంగా నిర్వర్తించాలంటే ప్రతి పోలీసు ఉద్యోగి శారీరకంగా దృఢంగా, మానసికంగా ఉత్సాహంగా ఉండాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు అన్నారు. ఇందుకు నిత్య వ్యాయామం, క్రీడల్లో చురుకైన భాగస్వామ్యం తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా బీచుపల్లి సమీపంలోని తెలంగాణ స్పెషల్ పోలీస్ 10వ బెటాలియన్‌లో మూడు రోజుల పాటు ఉత్సాహభరితంగా నిర్వహించిన వార్షిక క్రీడలు-2026 ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా, జాయింట్ కలెక్టర్ బి. నర్సింగ్ రావు గౌరవ అతిథిగా హాజరయ్యారు. బెటాలియన్ కమాండెంట్ ఎం. జయరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బంది, క్రీడాకారులకు ముఖ్య అతిథులు ట్రోఫీలు, పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. విజేతల ప్రతిభను కొనియాడుతూ, క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, క్రీడలు కేవలం శారీరక ఆరోగ్యానికే పరిమితం కావని, అవి క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ లక్షణాలు, సహజమని, పోటీలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో పాటు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించడమే నిర్వహించిన క్రీడా పోటీలకు విశేష స్పందన లభించిందని, ఇలాంటి కార్యక్రమాలు కుటుంబాల మధ్య అనుబంధాన్ని బలోపేతం చేయడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు వివిధ క్రీడా పోటీలతో ఉత్సాహభరితంగా సాగిన వార్షిక క్రీడలు-2026 బెటాలియన్‌లో క్రీడా స్ఫూర్తి, శారీరక దృఢత్వం, మానసిక ఉత్సాహం, ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని మరింత బలోపేతం చేస్తూ విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు పార్థసారథి రెడ్డి, అలంపూర్ సీఐ ప్రదీప్ కుమార్, పాణి వెంకటరమణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రాజు, నరసింహారాజు, ఆర్.పీ. సింగ్, శ్రీనివాస్, తిరుపతి, రాజేశం, బెటాలియన్ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మణ్, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులు, ఆహ్వానితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---

**IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JDGE, CITY CIVIL COURT: AT SECUNDERABAD**
**O.S.NO. 370 OF 2026**

***Between:***
Smt.G.Pushapalatha Goud & Othaers.
**.... PLAINTIFFS**
**AND**
THE MRO, Trimulgherry Manddal & Another's
**...Defendants**
To,
ALL CONCERNED
**.....DEFENDANT No.2**

Please take notice that the above named plaintiff had filed the above Suit against you and others for declaration of Irgal heirs. The Hon'ble Court was pleased to order notice through substitute service, by publishing the same in the news paper. Thus, take notice that the above suit is posted to 12-08-2026 for your appearance. Therefore, please take notice and appear in person or through advocate before the Hon'ble XI Junior Civil Judge, City Civil Court, at Secunderabad on 12-08-2026 at 10.30AM failing which the matter will be adjudicated in your absence.

***[By order of the Hon'ble Court]***
**sd/-**
**M.B.MANDAKINI,**
**Advocate,**
**h. No.151, Doveton Road,**
**Bolarum, Secunderabad.**

---

**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE cum XI ADDITIONAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS RANGA REDDY DISTRICT AT RAJENDRANAGAR**
**O.S. No. 342 of 2026**

Between:
Ram Pratap Mula Dharma Veer S/o. Mula Srinivasa Rao and 2 others.
**.... PLAINTIFFS**
**AND**
The Tahsildar (MRO), Gandipet Mandal, Ranga Reddy District.
2. All Concerned.
**...Defendants**

**NOTICE TO DEFENDANT NO.2**

It is here by informed that Ram Pratap Mula Dharma Veer S/o. Mula Srinivasa Rao and 2 others have filed the above case for declaring them as Legal heirs of **SMT.MULA SARADA.** The above case stands posted on 17.08.2026 for further hearing. If any body is having any dispute/objections they may appear before the above court. i.e., Principal Junior Civil Judge cum XI Additional Judicial Magistrate of First Class::Ranga Reddy District AT Rajendranagar and submit their grievances.

**[By order of the court]**
**sd/-**
**N.Vasudeva Rao**
**Advocate**
**Counsel for the Petitioner**
**Plot No.A-69,Street No.3**
**Raghavendra Colony,**
**Kondapur, Hyderabad-84.**
**Cell no. 98481 28702.**

---

**IN THE COURT OF THE HON'BLE IIADDL. CHIEF JUDG:CITY CIVIL COURT. AT HYDERABAD**
**O.S. No. 418 Of 2025**

***Between:***
P.M. Sai Prasad Aged: 35 years, Occ: Philanthropist, R/o H No 1-5-84, Gangaputhra Colony, Old Alwal, Secunderabad-10.
**.... Plaintiff**
**AND**
To
EIN. Rari & others
**.....Defendants**
1. KR TV, Telugu Digital Media. Office. No. 7-1, Srinivas Nagar, Ameerpet, Hyderabad -38.
2. Kranthi Sandepalli, S/o. Not known to Plaintiff, Aged Major, Occ: TV Presenter and Director, Office. No. 7-1, Srinivas Nagar, Ameerpet, Hyderabad-38.
**(Defendants 12 & 13)**

Please take notice that Mr. P.M. Sai Prasad has filed O.S. No. 418 of 2025 on the file of Hon'ble II Addl. Chief Judge, City Civil Court, Hyderabad, seeking damages against and 2 of you and others. Please take notice that the said case is posted to 17-08-2026 and 1 and 2 of you are called upon to appear before the Hon'ble court at 10-30 A.M. in person or through your Counsels. Otherwise the Hon'ble Court would pass appropriate Orders.

***[By ORDERS OF THE HON'BLE COURT]***
***sd/-***
***C.V. NARAYAN RAO,***
***ADVOCATE***
***COUNSEL FOR PLAINTIFF***
***Rlat No. 303, 4th floor***
***Laxminilayam***
***Narayanguda, Hyderabad***

---

**IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE : CITY CIVIL COURTS:: AT SECUNDERBAD**
**OS NO. 24 / 2025**

***Between:***
State Bank of India
SME Centre Secunderabad, Ist Floor, Administrative Office, Patny Centre, Secunderabad -03 Rep. by its Chief Manager
**.... Plaintiff**
**AND**
M/s Sri Maha Lakshmi Kirana and General Store And another
**...Defendants**
To
1. M/s Sri Maha Lakshmi Kirana and General Store Rep. by its Prop. G Mounika H.No. 8-35/6/1/1, Road No.2, New Hemanagar Boduppal, Medchal Malkajgiri District, TG-39
2. Ms. G Mounika H.No. 8-35/6/1/1, Road No.2, New Hemanagar Boduppal, Medchal Malkajgiri District, TG-39 Take notice that the above named plaintiff instituted the suit against both of you for recovery of **Rs** 4,55,968 – 00. You are hereby summoned to appear in this court in person or by pleader duly instructed and able to answer all material questions on **23-09-2026** at 10.30 AM. Take notice that in default of your appearance the suit will be heard and decided in your absence.

***[By order of the court]***
***sd/-***
***Ms. D.K Lakshmi Kumari,***
***Advocate***
***Flat No.304, H.No. 8-90/34/5 & 8-90/35/5,***
***Manikanta Paradise Apartment,***
***Dwarakanagar, Phase-II,***
***Uppal, Hyderabad,***
***Pin Code- 500 039.***
***Counsel For Plaintiff***

---

**IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE :CITY CIVIL COURTS:: AT SECUNDERABAD**
**OS No. 129 / 2023**

***Between:***
State Bank of India
SME Centre Secunderabad, Ist Floor, Administrative Office, Patny Centre, Secunderabad -03 Rep. by its Chief Manager
**.... Plaintiff**
**AND**
M/s Narmul Mother Dairy Point And another
**...Defendants**
To
1. M/s Narmul Mother Dairy Point Rep. By its Prop. Shabana Begum Shop No.
A 43, 44, Sachivalayanagar, Vanasthalipuram, Hyderabad -70
2. Mr. Shabana Begum Shop No. A 43, 44, Sachivalayanagar, Vanasthalipuram, Hyderabad -70
Take notice that the above named plaintiff instituted the suit against both of you for recovery of **Rs** 3,10,815-00 Ps. You are hereby summoned to appear in this court in person or by pleader duly instructed and able to answer all material questions on **16-09-2026** at 10.30 AM. Take notice that in default of your appearance the suit will be heard and decided in your absence.

***[By order of the court]***
***sd/-***
***Ms. D.K Lakshmi Kumari,***
***Advocate***
***Flat No.304, H.No. 8-90/34/5 & 8-90/35/5,***
***Manikanta Paradise Apartment,***
***Dwarakanagar, Phase-II,***
***Uppal, Hyderabad,***
***Pin Code- 500 039.***
***Counsel For Plaintiff***

---

**IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE : : CITY CIVIL COURTS :AT SECUNDERABAD**
**OS NO. 1023 / 2024**

***Between:***
State Bank of India SME Centre Secunderabad, Ist Floor, Administrative Office, Patny Centre, Secunderabad -03 Rep. by its Chief Manager
**.... Plaintiff**
**AND**
M/s Kanaka Mahalakshmi Kirana & General Store and another
**...Defendants**
To
1. M/s Kanaka Mahalakshmi Kirana & General Store Rep. By its Proproprietor Rasam Sri Hasini 8-43/8/5/15/A, Balajahills, Boduppal Road No.10, Hyderabad, Telangana-92
2. Ms Rasam Sri Hasini C/o Rasam Venkat 8-6-2/1, Rm No. 102, Srinilayam Residency Road No.9, Hemanagar, Uppal, TG-500039 Take notice that the above named plaintiff instituted the suit against both of you for recovery of Rs 4,09,520– 00 Ps. You are hereby summoned to appear in this court in person or by pleader duly instructed and able to answer all material questions on 22-09-2026 at 10.30 AM. Take notice that in default of your appearance the suit will be heard and decided in your absence.

***[By order of the court]***
***sd/-***
***Ms. D.K Lakshmi Kumari,***
***Advocate***
***Flat No.304,***
***H.No. 8-90/34/5 & 8-90/35/5,***
***Manikanta Paradise Apartment,***
***Dwarakanagar, Phase-II,***
***Uppal, Hyderabad,***
***Pin Code- 500 039.***
***Counsel For Plaintiff***

---

**IN THE COURTOF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE,CITY CIVIL COURT, AT: SECUNDERABAD**
**0.S.NO. 468 OF 2026**

***Between:***
1. Barla Lalitha
2. Barla Shailaja
3. Barla Shirisha
**.... Plaintiff**
**AND**
1The Tahsildhar
Secunderabad Mandal, Hyderabad. 3rd Floor DBS House, Paradise Circle, Telangana -500003. Sardar Patel Road, Secunderabad, Hyderabad
2 All Concerned
**...Defendants**

Whereas the above named Plaintif/s filed a Suit for Declaration to declare the Plaintiffls are the Legal Heirs of Late. B. Pandu (@ Late. Barla Pandu S/o Late. Barla Babaiah, who expired on 19-05-2000. Hence the general public hereby informed that any person/s institution/s etc., having any claims, demands, objections or whatsoever in respect of claim of Declaration of the Plaintiff/s as/are only Legal Heirs of Late. B. Pandu (@ Late. Barla Pandu S/o Late. Barla Babaiah. Shall appear in person or through advocate on I1-08-2026 at 10.30 A.M., Before The Hon'ble I JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT,
AT : SECUNDERABAD and submit your claims, objections, demands or whatsoever or else the matter will be decided Ex-parte.

***[By order of the court]***
***sd/-***
***M/S. B.SRIKANTH***
***ADVOCATE***
***O/o.: SRI KANAKA DURGA NILAYAM,***
***#8-3-252, Second Bazar,***
***Market Street,***
***Secunderabad,***
***Hyderabad- 500003.,T.S.***
***Cell No's.9052079507.***
***9393356521.***

---

**IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE ::CITY CIVIL COURT : AT SECUNDERABAD**
**OS NO. 490 / 2025**

***Between:***
State Bank of India
SME Centre Secunderabad, Ist Floor, Administrative Office, Patny Centre, Secunderabad -03 Rep. by its Chief Manager
**.... Plaintiff**
**AND**
M/s Vinaayaaka Generic Medical & Surgical store And another
**...Defendants**
To
1.M/s Vinaayaaka Generic Medical & Surgical store Rep. by its Prop Vadlagatta Saritha 17-2-579/106/A, Madannapet, Kurmaguda P S Road, Saidabad, Hyderabad-500059, Cell-6360638591
2. Mrs. Vadlagatta Saritha W/O S.Srikanth, 9-9-21/1/3, Plot No.24, 1st Floor, Road No.3, Reddy Colony, Champapet, Hyderabad-500059., Cell-6360638591, 8008457447 And Also At: Vadlagatta Saritha D/O Vadlagatta Buchirajam, 3-6-225, Vani Nagar, Jagtial, Karimnagar, Telangana-505327., Cell-6360638591, 8008457447
Take notice that the above named plaintiff instituted the suit against all of you for recovery of Rs 3,00,054-00. You are hereby summoned to appear in this court in person or by pleader duly instructed and able to answer all material questions on 24-09-2026 at 10.30 AM. Take notice that in default of your appearance the suit will be heard and decided in your absence.

***[By order of the court]***
***sd/-***
***Ms. D.K Lakshmi Kumari,***
***Advocate***
***Flat No.304,***
***H.No. 8-90/34/5 & 8-90/35/5,***
***Manikanta Paradise Apartment,***
***Dwarakanagar, Phase-II,***
***Uppal, Hyderabad,***
***Pin Code- 500 039.***
***Counsel For Plaintiff***

---

**IIN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE ::CITY CIVIL COURTS:: AT SECUNDERABAD:**
**OS NO. 605 / 2021**

***Between:***
State Bank of India
SME Centre Secunderabad, Ist Floor, Administrative Office, Patny Centre, Secunderabad -03 Rep. by its Chief Manager
**.... Plaintiff**
**AND**
M/s Yahoo Enterprises and others
**...Defendants**
To
1. M/s Yahoo Enterprises Rep. by its partners N Radhika & Nomula Shoban Babu F4/B/1, IDA Gandhinagar, Prashanthnagar, Quthbullapur, Medchal, Hyderabad-500037.
2. Sri Nomula Shoban Babu S/o Sri N. Stayanarayana R/o H.No. 6-492/1/C/1, Dwarkanagar, Quthbullapur, Near Pochamma Temple, HMT Township, Chintal, Hyderabad- 500 054. 3. Smt. Nomula Radhika W/o Nomula Shoban Babu R/o H.No. 6-492/1/C/1, Dwarkanagar, Quthbullapur, Near Pochamma Temple, HMT Township, Chintal, Hyderabad- 500 054. Take notice that the above named plaintiff instituted the suit against all of you for recovery of Rs 14,70,042-00 Ps. You are hereby summoned to appear in this court in person or by pleader duly instructed and able to answer all material questions on 07-09-2026 at 10.30 AM. Take notice that in default of your appearance the suit will be heard and decided in your absence.

***[By order of the court]***
***sd/-***
***Ms. D.K Lakshmi Kumari,***
***Advocate***
***Flat No.304, H.No. 8-90/34/5 & 8-90/35/5,***
***Manikanta Paradise Apartment,***
***Dwarakanagar, Phase-II,***
***Uppal, Hyderabad,***
***Pin Code- 500 039.***
***Counsel For Plaintiff***

---

**IN THE COURT OF THE HON'BLE III ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT, AT HYDERABAD**
**MVOP.NO. 865 OF 2025**

***Between:***
Smt. Nanavath Shanthi
**.... petitioner**
**AND**
A.N. Sanitation, and others
**...Respondents**
To
1. A.N. Sanitation, rep. by its owner Amit Kumar S/o. Lakshmeshwer Roy, Aged: 40 years, Occ: Owner of Vehicle Br. No. TS08 HK 4141, R/o. Afcons Prestige Apartments, Plot No. 68 & 69, Padmanagar colony, Phase-I, Near Venkateshwara Temple, Chinthal, Jeedimetla, Post HMT Township, Hyderabad, Telangana, Pin No.500054.
**...Respondents 1**
2. Dhaneshwar Kumar S/o. Ravindra Ram Aged: 29 years, Occ: Driver of Vehicle Br. No. TS08 HK 4141, R/o. Afcons Prestige Apartments, Plot No. 68 & 69, Padmanagar colony, Phase-I, Near Venkateshwara Temple, Chinthal, Jeedimetla, Post HMT Township, Hyderabad, Telangana, Pin No.500054.
**...Respondent No.3**

Please take notice that the above named Petitioner have filed above MVOP on the file of III Addl. Chief Judge, C.C.C., Hyderabad, against you and another for claiming compensation for the injury of the Smt. Nanavath Shanthi W/o. Nanavath Hemanth Kumar, in road accident caused by the driver of Vehicle Br. No. TS08 HK 4141. The Hon'ble court was pleased to posted the above case to 14-08-2026 for your appearance. Therefore, you are hereby requested to appear before the above said court on 14-08-2026 at 10.30 a.m. either in person or through an advocate duly instructed and file your counter if any. Failing which the matter will be heard in your absence.

***//BY THE ORDER OF COURT//***
**sd/-**
**Mr. P. NARASIMHA,**
**Advocate**
**Residence-cum-Office:**
**H.No.13-68/A/1Plot No.68,**
**Road No.6, CMR colony,**
**Almasguda village, Balapur**
**Mandal,R.R.District,Hyderabad,**
**T.S. Pin: No.500058.**
**Cell No.9100085959**
**council for the petitioner**




### ప్రభుత్వాన్నే మార్చేస్తాం

"జంతర్ మంతర్ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై ప్రభుత్వం వేధింపులు ఆపాలి. నిరసనకారులపై పెల్లెట్ తుపాకులు వాడేలా పోలీసులకు అనుమతి ఇచ్చిన వ్యక్తిపై చర్య తీసుకోవాలి. ప్రభుత్వం దారికి రాకపోతే యువత ప్రభుత్వాన్నే మారుస్తుంది. పోలీసులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అరెస్టు చేస్తామని బెదిరిస్తున్నారు. విద్యార్థులు ఈ దేశ భవిత. వారు ఉగ్రవాదులు కారు. ఇదేవిధంగా వారిని ఇబ్బంది పెడుతూ ఉంటే ధర్మేంద్ర ప్రధాన్‌లాగే రేపు ప్రభుత్వాన్ని కూడా మార్చేస్తాం. ప్రధాని మోదీ తన పదవికి రాజీనామా చేసి, ఆయన ప్రావీణ్యానికి తగ్గట్టు ఇన్‌ఫ్లుయెన్సరుగా మారితే బాగుంటుంది. విద్యార్థుల ఆగ్రహం సద్దుమణగలేదు. అవసరమైతే ఇంకా పెద్ద ఆందోళనను మళ్లీ ప్రారంభిస్తాం."

**-అభిజీత్ దీప్కే, సీజేపీ వ్యవస్థాపకుడు**

## వే'మన' పద్యం



వాన గురియకున్న వచ్చును క్షామంబు
వాన గురిసెనేని వరదపారు
వరద కరవు రెండు వలసతో నెరుగుడీ
విశ్వదాభిరామ! వినురవేమ!

# సంపాదకీయం

## దేశానికి ఏం ఒరిగింది?

భారత ప్రధాని నరేంద్రమోడీ తన 'మన్ కీ బాత్' 135వ ఎపిసోడ్‌లోఇటీవల దేశ ప్రజలకు మరోసారి నీతిపాఠాలు చెప్పారు. అయితే ఈసారి ధన్యవాదాలతో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశ ప్రజలు బంగారం కొనుగోళ్లు తగ్గించడం, విదేశీ పర్యటనలను వాయిదా వేయడం వంటి దేశ ప్రయోజనాల కోసం ప్రజలు బాధ్యతగా వ్యవహరించారని ప్రశంసించారు. ప్రజలకు పొదుపు, త్యాగం, మిత వ్యయం చెప్పడం తప్పుకాదు. కానీ, ప్రజలకు చెప్పే సందేశం, సర్కార్ ఆచరణ ఒకేతీరులో ఉన్నాయా? అన్నదే అసలు ప్రశ్న. కష్టకాలంలో ప్రజలు త్యాగాలు చేయాలని పిలుపునివ్వడం మంచిదే, ఆ కష్టాలకు కారణాలేమిటన్నది వేరే అంశం. కానీ, ప్రభుత్వం తన ఖర్చులు, ప్రాధా న్యతలు, విధానాల విషయంలో ఎంతమేరకు మితవ్యయం పాటిస్తోంది? అన్నదే ప్రధాన ప్రశ్న. ప్రజలు బంగారం కొనద్దని చెప్పే ముందు, దాని దిగుమతులు పెరగడానికి దారితీస్తున్న ఆర్థిక విధానాలపై ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసిందా? రూపాయి బలహీనపడటం, ద్రవ్యోల్బణం, పెట్టుబడు లపై అనిశ్చితి కార ణంగా ప్రజలు బంగారాన్ని భద్రమైన పెట్టుబడిగా ఎంచు కుంటున్న వాస్తవాన్ని విస్మరించలేం. బంగారం కొనుగోలు విలాసాలకు సంబం ధించినదే కాదు, దానిపై లక్షలాది మంది స్వర్ణకారులు, చిన్న నగల దుకాణాలు, చేతివృత్తుల జీవనం ఆధారపడి ఉంటుంది. ఈ నిర్ణయం వల్ల ఉపాధిపై పడే ప్రభావం ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానం లేదు. అలాగే విదేశీ పర్యటనలను తగ్గించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు చెప్పిన ప్రధాని, తన విదేశీ పర్యటనల వల్ల దేశానికి వచ్చిన ప్రత్యక్ష పెట్టుబడులు, ? ఇక పెట్రోల్,డీజిల్ పొదుపు పాటించాలని హితబోధ చేసిన మరుసటి రోజే మధ్యప్రదేశ్‌లో సౌభాగ్య సింగ్ ఠాకూర్ అనే బీజేపీ నేత, పాఠ్య పుస్తక సంస్థ ఛైర్మన్‌గా నియమితులైనందుకు ఉజ్జాయినీ నుంచి భోపాల్ వరకు భారీ వాహనాల కాన్వాయ్‌తో ప్రయాణించిన వీడియో వైరల్ అయింది. దీంతో 'ప్రజలు మాత్రమే త్యాగాలు చేయాలా?' అంటూ సోషల్ మీడియాలో ప్రశ్నల వర్షం కురిసింది. అంతెందుకు పొరుగు రాష్ట్రం ఏపీలో కూటమి మంత్రి ప్రధాని మాటలను స్ఫూర్తిగా తీసుకుని సైకిల్‌పై అధికారిక కార్యక్రమానికి వెళ్లాడు. కానీ, ఆయన వెనుక కార్లు, మీడియా వాహనాలు పరుగులు పెట్టాయి. ?

మన్ కీ బాత్‌లో అతి ముఖ్యమైన సందేశం ప్రజలు మూఢ నమ్మకాలను వీడి శాస్త్రీయ దృక్పథంతో ఆలోచిం చాలని సూచించడం. ప్రధాని చేసిన వ్యాఖ్యల్ని స్వాగతించాల్సిందే. శాస్త్రీయ దృక్పథం ప్రతి సమాజానికీ అవసరం.

అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ విధానాలు, అధికార పార్టీ నాయకుల వైఖరి ఆ సందేశానికి అనుగుణంగా ఉన్నాయా? అనే ప్రశ్న తలెత్తుతోంది. రాజ్యాంగంలోని 51(ఎ)(హెచ్) అధికరణం శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ప్రతి పౌరుడి విధిగా పేర్కొంటుంది. కానీ విద్యారంగంలో ఎన్‌సీఈఆర్‌టీ చేస్తున్న దేమిటి? చరిత్ర పాఠాలను మార్పులు చేశారు. పదో తరగతి పాఠ్యాంశం నుంచి 'డార్విన్ పరిణామ సిద్ధాంతం' తొలగించారు.

వీటిపై విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు ఎన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినా కేంద్రం పట్టించుకోలేదు. అలాగే శాస్త్రీయ ఆధారాలు లేని వాదనలు, మూఢ విశ్వాసాలను సమర్థించే వ్యాఖ్యలు బహిరంగ వేదికలపై వచ్చినప్పుడు ప్రభుత్వం లేదా అధికార పార్టీ వాటిని ఖండించడంలో చూపిన నిర్లక్ష్యంపై కూడా విమర్శలనేకం. కొన్ని విశ్వవిద్యాలయాల్లో జ్యోతిష్యం, భారతీయ జ్ఞాన సంప్రదాయాల కోర్సులు చేర్చడం, భూత వైద్యం లాంటి అంశాలు ప్రవేశ పెట్టడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. విజ్ఞాన శాస్త్రానికి విరుద్ధమైన ప్రచారాలు, అశాస్త్రీయ వాదన లు, మూఢ విశ్వాసాలను రాజకీయంగా ప్రోత్సహించే ధోరణులు పెరగడానికి కారణం కేంద్రమేనన్న సంగతి దేశమంతా గమనిస్తూనే ఉంది. శాస్త్రీయ దృక్పథం ప్రజలకు మాత్రమే బోధించే నీతి కాదు, అది ప్రభుత్వ విధానాల్లో, విద్యా వ్యవస్థలో, ప్రజా ప్రతినిధుల ప్రవర్తనలోనూ ప్రతిబింబించాలి. ప్రజలు దేశం కోసం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉంటారు. కానీ ఆ త్యాగాలలో ప్రభుత్వం కూడా భాగస్వామి కావాలి. ప్రజలకు పొదుపు చెప్పే పాలకులు, ప్రభుత్వ వ్యయాల్లో కూడా అదే క్రమశిక్షణను చూపాలి. మాటలకు, చేతలకు మధ్య అంతరం పెరిగినప్పుడు ప్రజలు ప్రశ్నించడం సహజం.

'త్యాగం ప్రజలకు, ప్రచారం ప్రభుత్వానికి' అనే భావన బలపడకుండా ఉండాలంటే, ఆచరణ తన సందేశాలకు నిదర్శనంగా నిలవాలి. లేదంటే 'మన్ కీ బాత్'లో ప్రధాని ఎన్ని హావభావాలు ప్రదర్శించినా, ఆవేదనగా మాట్లాడినా అది 'మన్ కీ జూట్'నే అవుతుంది తప్ప దేశానికి ఒరిగేదేమీ ఉండదు.

### రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# అటవీ రేంజర్ల త్యాగాలు అసామాన్యం

ప్రకృతిని పరిరక్షించేవారు ఆయుధాలతో కాదు... అడవిలో అడుగులు వేసే నిరాహంకార పాదాలతో, వన్య జీవులను కాపాడే మానవతా హృదయాలతో. అలాంటి అటవీ సంరక్షకులు — రేంజర్లు — వారి సేవలకు స్మరణార్థంగా ప్రతి సంవత్సరం జూలై 31న ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ రేంజర్ దినోత్సవం జరుపుకుంటారు. ఈ దినోత్సవం వన రక్షకుల త్యాగాలకు, వారు ఎదుర్కొంటున్న సవాళ్లకు గుర్తింపుగా, భద్రతా హక్కులపై చర్చకు వేదికగా నిలుస్తోంది.1992లో ఏర్పడిన ఇంటర్నేషనల్ రేంజర్ ఫెడరేషన్ (IRF) ఆధ్వర్యంలో 2007 నుంచి ఈ దినోత్సవం నిర్వహించ బడుతోంది. ఇదే తేదీన 1992లో విధిలో ప్రాణాలు కోల్పోయిన యుగాండా రేంజర్‌కు స్మారకంగా జూలై 31ను ఎంచుకున్నారు. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా 100కి పైగా దేశాల్లో ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారు.




రేంజర్ పదవిని మామూలుగా అటవీ భద్రతా ఉద్యోగిగా భావించినా... వాస్తవానికి వీరు పర్యావరణ పరిరక్షణకు, జీవవైవిధ్య సంరక్షణకు ముందు వరుసలో నిలిచే యోధులు. వారివల్లే మన అడవులు, వన్య ప్రాణులు, ప్రకృతి వనరులు కాపాడ బడతాయి. వీరు వేటగాళ్లు, అక్రమ కలప స్మగ్లర్లు, అడవిని ఆక్రమించే వారితో రోజూ పోరాడాల్సి వస్తోంది. దట్టమైన అడవులు, కఠిన వాతావరణ పరిస్థితులు, హింసాత్మక ఘటనలు వీరి పని భాగమై పోయాయి. కానీ వీరికి సరైన మౌలిక వసతులు, రక్షణా పరికరాలు, శిక్షణలు చాలా చోట్ల లేవు. ఇలాంటి పరిస్థితుల్లోనూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతున్నారు.

గత 15 ఏళ్లలో ప్రపంచ వ్యాప్తంగా 1,700 మందికి పైగా వన రక్షకులు విధుల్లో ప్రాణాలు కోల్పోయారు. 2023లో ఒక్క ఏడాది లోనే 137 మంది రేంజర్లు మరణించారు, వీరిలో 46 మంది హత్యలు, 22 మంది వాతావరణ ప్రమాదాలు, 19 మంది వన్యప్రాణుల దాడుల్లో ప్రాణాలు విడిచారు. ప్రస్తుతం 105కి పైగా దేశాల్లో 2 లక్షల మంది వన రక్షకులు విధుల్లో ఉన్నారు. వారి ప్రాణాలకు గౌరవంగా పనిచేస్తున్న థిన్ గ్రీన్ లైన్ ఫౌండేషన్ వంటి సంస్థలు వీరి కుటుంబాలకు సహాయ పడుతున్నాయి.

భారత దేశం మొత్తం 7,13,789 చదరపు కిలోమీటర్ల అటవీ భూమిని కలిగి ఉండగా, దాదాపు 2.5 లక్షల మంది అటవీ ఉద్యోగులు ఈ విభాగంలో ఉన్నారు. వీరిలో రేంజర్లు, బీట్ గార్డులు, వన్య జీవ పరిరక్షణ అధికారులు ముఖ్యులు. గడచిన 20 ఏళ్లలో 250 మందికి పైగా భారత రేంజర్లు విధుల్లో ప్రాణాలు కోల్పోయారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్, నాగలాండ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో వన రక్షకులు మావోయిస్టు దాడులు, అక్రమ వేటగాళ్ల హింసను ఎదుర్కొన్నారు.

2019లో ఛత్తీస్ గఢ్‌లో ఓ రేంజర్ మావోయిస్టుల పేలుడు బాంబులో మరణించాడు. 2021లో మాధవరావ్ నేషనల్ పార్క్‌లో ఒక జింకను రక్షించేందుకు ప్రయత్నిస్తూ ఓ రేంజర్ మరణించాడు. 2023లో ఒడిశాలోని సింహాచలం అడవిలో అక్రమ వేట నుంచి ప్రాణులను రక్షిస్తూ ఒక మహిళా రేంజర్ ప్రాణాలు కోల్పోయింది. 2024లో తెలంగాణలోని కొవ్వల్ ఫారెస్ట్ రిజర్వులో అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్నందుకు వన రక్షకులపై సామూహిక దాడి జరిగింది.

ఈ నేపథ్యంలో రేంజర్లకు ఎదురయ్యే ప్రధాన సవాళ్లు: ఆధునిక టెక్నాలజీ లేమి - GPS, డ్రోన్లు, నైట్ విజన్ పరికరాలు లేవు. భద్రతా దుస్తులు, ఆయుధాల లేమి. అల్ప వేతనాలు, రాత్రిపూట పని, మానసిక ఒత్తిడికి గురయ్యే పరిస్థితులు. విధుల్లో గాయపడినా మెరుగైన వైద్యం లేకపోవడం. మరణించిన తర్వాత కుటుంబాలకు సరైన న్యాయం, పరిహారం ఆలస్యంగా రావడం.

ఈ నేపథ్యంలో కేంద్ర వనశాఖ, విధుల్లో మరణించిన రేంజర్లకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలన్న ప్రతిపాదన చేసింది. రాష్ట్రాల స్థాయిలో కూడా రేంజర్లకు విశ్రాంతి వసతులు, ఆరోగ్య శిబిరాలు, రక్షణా పరికరాలు, శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వన రక్షకులను సైనికుల్లా గౌరవించాలి. వన యోధుడు పురస్కారం వంటి అవార్డులు ఇవ్వాలి.అటవీ సంరక్షణలో సమాజం భాగస్వామ్యంగా మారాలి. పాఠశాల స్థాయిలో నుంచే వన్యజీవ సంరక్షణపై అవగాహన కల్పించాలి. పర్యాటకులు అటవీ నియమాలను గౌరవించాలి.

పౌర సమాజం రేంజర్లకు మద్దతుగా నిలవాలి.ప్రపంచ రేంజర్ దినోత్సవం అంటే కేవలం స్మరణ మాత్రమే కాదు... అది ఒక బాధ్యత. మనకు ఊపిరినిచ్చే అడవులను కాపాడే వారి పోరాటాన్ని గౌరవించాల్సిన బాధ్యత. వారు మాట్లాడే వారు కాదు, ప్రకృతికి స్వరమిచ్చే వారు. అటువంటి వనరక్షకులకు మన హృదయ పూర్వక వందనం.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

# అసలు పరీక్ష సంక్షేమానికే

రేషన్ కార్డుల ఈకేవైసీని తప్పనిసరి చేయడంలో ప్రభుత్వ ఉద్దేశాన్ని ఎవరూ తప్పుబట్టలేరు. నకిలీ లబ్ధిదారులను గుర్తించడం, అర్హులకు మాత్రమే సంక్షేమ ఫలాలు అందించడం, ప్రజాపంపిణీ వ్యవస్థను పారదర్శకంగా మార్చడం దీని లక్ష్యం. అయితే ప్రతి సంస్కరణ ప్రజల జీవన వాస్తవాలకు అనుగుణంగా అమలైతేనే దాని అసలు ప్రయోజనం కనిపిస్తుంది. ప్రస్తుతం ఈకేవైసీ అమలులో అలాంటి ప్రశ్నలే తలెత్తుతున్నాయి.జూలై 31తో గడువు ముగియనున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వేలాది కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. తెలంగాణ నుంచి ఉపాధి కోసం ముంబై, పుణె, బెంగళూరు, సూరత్, చెన్నై, ఢిల్లీ తదితర ప్రాంతాలకు వెళ్లిన వలస కార్మికులు గడువులోగా స్వగ్రామాలకు చేరుకోవడం సాధ్యంకాని పరిస్థితి ఉంది. అలాగే ఉన్నత విద్య కోసం హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాలు, ఇతర రాష్ట్రాల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ఈకేవైసీ కోసం స్వగ్రామంలోని రేషన్ దుకాణానికి రావాల్సి వస్తోంది. కుటుంబంలోని ఒక్క సభ్యుడు బయట ఉన్నా మొత్తం కుటుంబం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది.వృద్ధుల పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోంది. వయస్సు ప్రభావంతో చాలామందికి వేలిముద్రలు స్కానింగ్‌లో నమోదు కావడం లేదు. పలుమార్లు ప్రయత్నించినా యంత్రం గుర్తించకపోవడంతో డీలర్లు కూడా "వేలిముద్ర రావడం లేదు... మేమేం చేయలేం" అనే సమాధానమే చెబుతున్నారు. దీనికి రేషన్ డీలర్లను బాధ్యులను చేయడం సరికాదు. అసలు ప్రశ్న పౌర సరఫరాల శాఖ ముందుంది. ఆధార్ వ్యవస్థలో ఐరిస్ (కంటి గుడ్డు) ద్వారా ధృవీకరణకు అవకాశం ఉన్నప్పటికీ, రేషన్ దుకాణాల్లో ఐరిస్ స్కానింగ్ పరికరాలు లేకపోవడం వల్ల వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ లోటును అత్యవసరంగా సరిచేయాల్సిన అవసరం ఉంది.మరో కీలక అంశం ఈకేవైసీని కేవలం రేషన్ దుకాణాలకే పరిమితం చేయడం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాలు, ఆధార్ సేవా కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్లు (సి ఎస్ సి లు) బయోమెట్రిక్ సేవలు అందిస్తున్నాయి. ప్రభుత్వం అనుమతించిన ఈ కేంద్రాల్లో కూడా వేలిముద్ర లేదా ఐరిస్ ద్వారా ఈకేవైసీ పూర్తి చేసుకునే అవకాశం కల్పిస్తే వలస కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులకు ప్రయాణ భారం, సమయ నష్టం తగ్గుతుంది.దేశంలో 'వన్ నేషన్-వన్ రేషన్ కార్డ్' అమల్లో ఉన్నప్పుడు, మరో రాష్ట్రంలో రేషన్ పొందగలిగే లబ్ధిదారుడు అక్కడి నుంచే ఈకేవైసీ పూర్తి చేసుకునే సౌకర్యాన్ని కూడా పరిశీలించాల్సిన సమయం వచ్చింది. డిజిటల్ పాలన అంటే కేవలం బయోమెట్రిక్ ధృవీకరణ కాదు; ప్రజలకు అందుబాటులో ఉండే ప్రత్యామ్నాయాలను కూడా అందుకే పౌర సరఫరాల శాఖ మంత్రి, కమిషనర్ ఈ అంశాన్ని అత్యవసరంగా సమీక్షించి అవసరమైతే గడువు పునఃసమీక్ష, ఐరిస్ స్కానింగ్ పరికరాల ఏర్పాటు, మీసేవసీఎస్‌సీ కేంద్రాల ద్వారా ఈకేవైసీ సదుపాయం, వలస కార్మికులు, విద్యార్థులు, వృద్ధులకు ప్రత్యేక వెసులుబాటు వంటి అంశాలపై నిర్ణయం తీసుకోవాలి.వేలిముద్ర పడకపోవడం వృద్ధుడి తప్పు కాదు. ఉపాధి కోసం వలస వెళ్లడం కార్మికుడి నేరం కాదు. చదువు కోసం స్వగ్రామానికి దూరంగా ఉండడం విద్యార్థి పొరపాటు కాదు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వ్యవస్థను మార్చినప్పుడే డిజిటల్ సంక్షేమ పాలన తన అసలు లక్ష్యాన్ని చేరుకుంటుంది.



శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
జగిత్యాల
9133947176

# యూరియా యాప్‌తో రైతు బలి




**యూరియా పక్కదారి పడుతున్నదని, నిజమైన రైతులకు సబ్సిడీ అందడం లేదంటూ రాష్ట్రప్రభుత్వం తెచ్చిన 'ఫ్రేమ్ వర్క్ ఆఫ్ ఫర్టిలైజర్ సేల్' విధానం వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగమూ లేదు. ఈ యాప్ ద్వారా రైతుల పాసు పుస్తకాల్లో నమోదైన భూముల ఆధారంగా అవసరమైన ఎరువులను బుకింగ్ చేసుకోవాలి. కేంద్రం రాయితీ ఇస్తున్న యూరియా, ఇతర ఎరువులను ఈ యాప్‌లో నమోదు చేయాలి. ఆ తర్వాత రైతు మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. దీన్ని చూపి నిర్దేశించిన మొత్తంలో కేటాయించిన ఎరువులను ప్రయివేటు దుకా ణాల్లో కొనుగోలు చేయాలి.**

సాంకేతికత వినియోగం ప్రతిరంగంలోనూ అవసరమే. దీనిద్వారా ప్రభుత్వ సేవల్లో పారదర్శకత పెంచడం, అక్రమాలను అరికట్టడం, సబ్సిడీ ప్రయోజనాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా చూడడం మంచిదే. అయితే క్షేత్రస్థాయిలో ప్రజలకు సౌలభ్యాన్ని కల్పించినప్పుడే దాని అసలు ప్రయోజనం నెరవేరుతుంది. కానీ ఆ పేరుతో మొత్తం వ్యవస్థనే నాశనం చేయాలని చూస్తే పెద్దలకు లాభం తప్ప పేదలకు మేలు జరగదు. దానికి ఉదాహరణే యూరియా యాప్. యూరియా పంపిణీలో అమలు చేస్తున్న టెక్నాలజీ (యాప్ ఆధారిత విధానం) కూడా రైతులకు సౌలభ్యం కంటే ఇబ్బందులనే మరింత తెచ్చిపెడుతోంది. ఇప్పటికే అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న రైతులకు ఈ విధానం నిద్రపట్టనీయడం లేదు. ఈ యాప్ వెనుక కుట్ర ఉందని అనుమానాలు రోజురోజుకూ బలపడుతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం మాత్రం పాత వాదననే పునరుద్ఘాటిస్తోంది. అక్రమాలను అరికట్టేందుకే ఈ విధానమని చెబుతోంది. మరి అలాంటప్పుడు రైతులు ఎందుకు ఇబ్బందులు పడుతున్నారన్నదానికి సమాధానం లేదు. యూరియా పక్కదారి పడుతున్నదని, నిజమైన రైతులకు సబ్సిడీ అందడం లేదంటూ రాష్ట్రప్రభుత్వం తెచ్చిన 'ఫ్రేమ్ వర్క్ ఆఫ్ ఫర్టిలైజర్ సేల్' విధానం వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగమూ లేదు. ఈ యాప్ ద్వారా రైతుల పాసు పుస్తకాల్లో నమోదైన భూముల ఆధారంగా అవసరమైన ఎరువులను బుకింగ్ చేసుకోవాలి. కేంద్రం రాయితీ ఇస్తున్న యూరియా, ఇతర ఎరువులను ఈ యాప్‌లో నమోదు చేయాలి. ఆ తర్వాత రైతు మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. దీన్ని చూపి నిర్దేశించిన మొత్తంలో కేటాయించిన ఎరువులను ప్రయివేటు దుకా ణాల్లో కొనుగోలు చేయాలి. యాప్ తీర్చిద్దినంత సులువుగా ఎరువుల కేటాయింపు లేదు. బుకింగ్ సమయంలో ఆ మండలంలో ఏ డీలర్ వద్ద యూరియా ఉంటే అక్కడే రైతులకు రెండు బస్తాల యూరియాను కేటాయిస్తారు. ఎకరా ఉన్న రైతులకు ఒకేసారి, ఎకరం నుంచి ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులకు విడతల వారీగా ఎకరాకు రెండు బస్తాలు చొప్పున యూరియాను అందిస్తారు. యాప్‌లో ఒకసారి రెండు బస్తాలు మాత్రమే కేటాయింపు చేసుకోవాలి. ఐదు నుంచి పది ఎకరాల వరకు సాగుచేసే రైతులు అయిదు నుంచి పదిసార్లు బుక్ చేసుకోవాలి. ఈ విధానం చూస్తే సాధారణ రైతు వ్యవసాయం మానేసి, ఎరువుల బస్తాలు ఎప్పుడొస్తాయన్నది దుకాణం ముందు కూర్చొని ఎదురు చూడాలి. వాస్తవానికి ఎకరా ఉన్న రైతుకు రెండు బస్తాలు కేటాయించినా వాటిని తెచ్చుకోవా లంటే 15 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో వెళ్లి తెచ్చుకోవాలి. ఐదు, పదెకరాలు ఉన్న రైతులు రెండు బస్తాలు చొప్పున అన్ని సార్లు బుక్ చేసుకోవడానికి పడరాని పాట్లు పడాల్సిందే. పాసు పుస్తకాలున్న రైతులకే యూరియా కేటాయింపు అంటే చాలామంది రైతులకు పాసు పుస్తకాలు లేవు. అందులోనూ తప్పులు ఉంటే యాప్ తీసుకోదు. యాప్ ఓపెన్ కావాలంటే మంచి మొబైల్ ఉండాలి. దానికి తగట్టు యాప్‌ను ఓపెన్ చేసే పరిజ్ఞానం ఉండాలి. వాటిని అసలైన రైతు ఏమి అందుకుంటాడు. భూస్వాములు, పలుకుబడి ఉన్న ధనిక రైతులు తిరగకుండానే యూరియా ఇంటికి వచ్చేస్తుంది. అంటే, ఈ యాప్ పెద్దొళ్లకు మేలు చేస్తుందా? పేదలకా అన్నది ఇట్టే తెలిసిపోతోంది. అదేవిధంగా డిస్ట్రిబ్యూటర్‌లకు కేటాయించే నలభై శాతం యూరియా ఆయా జిల్లాల రైతులకే కేటాయించాలన్న నిబంధన లేదు. వందలాది ఎరువుల బస్తాలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నా పట్టించుకునే నాథుడు లేదు. ఫలితంగా యూరియా కొరత నెలకొని ఆందోళనలకు దారితీస్తోంది. యాప్ బాగుందని, నిజమైన రైతుల కు ఎరువులు అందుతాయని ప్రభుత్వం నమ్మబలికింది. గత ఖరీఫ్‌లోనే కొన్ని చోట్ల యాప్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గతంలోనే రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయలేదు. ఎరువుల వాడకాన్ని తగ్గించాలని కేంద్రం సూచనలతో యాప్ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయడం దుర్మార్గమైన చర్య. వ్యవసాయానికి అనుకూలమైన వాతావరణ పరిస్థితులు లేవని ఇప్పటికే రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. వర్షాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతు ఎరువు కోసం సహకార సంఘానికి, ఎరువుల దుకాణానికి వెళితే వ్యవసాయం చేసేదెప్పుడు? అలాగే, ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషిస్తున్నది కౌలు రైతులు. వారి అవసరాలు, సౌకర్యాలు గుర్తించకుండా రూపొందించిన విధానం సమగ్ర వ్యవసాయ విధానం ఎలా అవుతుంది? నేడు తెలంగాణలో కౌలురైతుల సంఖ్య బాగా పెరిగింది. సాగు చేస్తున్నది ఒకరు, భూయజమాని మరొకరు. కానీ యాప్ భూ యజమాని వివరాల ఆధా రంగానే వ్యవహరించడం వల్ల కౌలు రైతులు ఎరువులందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.యూరియా అక్రమ మళ్లింపు, బ్లాక్ మార్కెట్, సబ్సిడీ దుర్వినియోగం వంటి సమస్యలను నియంత్రించడానికి అనేక మార్గాలు ఉన్నాయి. యాప్ మాటున ఎరువుల వాడకాన్ని తగ్గించాలని చూస్తే రాష్ట్ర రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. యాప్‌ను వెంటనే రద్దు చేసి రైతులకు సులువైన మార్గంలో ఎరువులను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేదంటే యాప్ కుట్రకు రైతులు బలయ్యే ప్రమాదముంది.

# పాలకుల అల్పత్వం

వెలుగుతున్న ఆశ ఒకవైపు, కొనసాగుతున్న అల్పత్వము మరోవైపు. నేడు దేశ కదలికను గమనిస్తుంటే భవిష్యత్తు పట్ల ఆశలు చిగురిస్తున్నాయి. ఏం చేయలేమనే నిరాశ నుంచి ఏదైనా చేయగలమనే ధైర్యం నిండుతోంది. మాకిక తిరుగులేదనుకున్నవారికి తలలు తిరిగేట్టు జరగటం చూస్తుంటే సామాజిక శాస్త్రవేత్తలు చెప్పిన విషయాలు, సిద్ధాంతాలు ఎంత వాస్తవికమైనవో అర్థమవుతున్నది. నిరసనల నిప్పురవ్వ అంటుకుంటే ఎంత దావానలమై ముంచెత్తుతుందో స్పష్టపరిచింది నేటి యువత తిరుగుబాటు. గత 38 రోజులుగా ఢిల్లీ జంతర్ మంతర్‌లో నిరవధికంగా జరుగుతున్న నిరసన అత్యంత పదునైన దీక్షతో కొనసాగటం అనేకమంది రాజకీయ నాయకులను, సామాజిక కార్యకర్తలను, సాధారణ ప్రజలను ఆశ్చర్యపరుస్తున్నది. నిర్మాణ రూపమే లేని ఒక సోషల్ మీడియా 'కాక్రోచ్' యువత, ఇంత నిబద్ధంగా, పట్టుదలతో,క్రమశిక్షణతో ఉద్యమాన్ని నిర్మించడం చూస్తే, ఎక్కడ అణచివేత, దోపిడీ వేదన ఉంటుందో అక్కడ తిరుగుబాటు తప్పదన్న సత్యం రుజువుతున్నది. నిర్మాణాత్మక వామపక్ష విద్యార్థి ఉద్యమమూ తోడుగా చేరటము మరింత పదునుతేరుతున్నది. ఇదో శుభపరిణామం. "పదిమంది ఉక్కు గుండెలుగల యువకులను నాకివ్వండి, నేను ఈ దేశాన్ని మార్చివేస్తాను" అని స్వామి వివేకానంద చెప్పిన మాటలు ఈ సన్నివేశాన్ని చూస్తే ఎంతో నిజమని అర్థమవుతున్నది.

నిరసన చాలా సామాన్యంగానే ప్రారంభమ యింది. ప్రభుత్వమూ పెద్దగా పట్టించుకోకుండా తేలికగానే చూసింది. జూలై ఇరవై తర్వాత నిరసన ఉద్యమ రూపం అందుకుంది. దేశవ్యాప్తంగా యువత కదం తొక్కింది. బీజేపీ తిరుగులేని ఆధిపత్యం వహిస్తున్న రాష్ట్రాల నుంచి అన్ని ప్రాంతాలలోనూ ప్రశ్నతో, నినాదంతో మార్మోగింది. ఇక్కడేకాదు, దేశం వెలుపల, అనేక దేశాలలో యువత మద్దతును ఈ ఉద్యమం పొందింది. అప్పటిగానీ అయ్యవార్లకు అర్థంకాలేదు. ఎన్ని ఆటంకాలు ఎగదోసింది ప్రభుత్వం! ఎంత దుష్ప్రచారం మొదలైంది. ఎంత దారుణంగా క్రూరంగా అణచివేయటానికి పూనుకొంది. రక్తం పారించింది. తలలు పగలగొట్టింది. చేతులు, కాళ్లు విరగగొట్టింది. రబ్బరు బుల్లెట్లు, టియర్ గ్యాస్ లు, ముండ్ల కంచెలు, దేశద్రోహ కేసులు, నిర్దాక్షిణ్య నిర్బంధాలు అన్నీ ఉపయోగించింది. ఇంకోవైపు నైతికతను దెబ్బతీస్తూ, విదేశీయుల సహకారంతో, మద్దతుతో నడుస్తోందని, సంఘవిద్రోహ శక్తులని, దేశ సమగ్రతను, శాంతిని విచ్ఛిన్నం చేసే కుట్ర జరుగుతోందని, దొంగ దీక్షలు చేస్తున్నారని ఒక నీచ ప్రచారము చేసింది. నీళ్లను బంద్ చేసింది. కరెంటునూ, ఇంటర్నెట్ నూ, రహదారులను, మెట్రో స్టేషన్లను బంద్ పెట్టి నిలిపివేసింది.

ఇన్ని చేసినా, ఇంత విధ్వంసం ఒక రాజ్యం చేస్తున్నా... నిలకడగా నిబ్బరంగా వీటన్నింటినీ ఎదుర్కొని ఇన్ని రోజులుగా పోరాటం కొనసాగటం చరిత్రలో నిలిచిపోయే మహా సంఘటన. ఇది ఒక పరీక్ష పేపర్ లీకేజీ సమస్యే కాదు, విద్యావ్యవస్థ మొత్తం ప్రయివేటు, కార్పొరేట్ల చేతుల్లోకి పోవడం, పర్యవసానంగా వ్యాపారం, లాభాలు మాత్రమే లక్ష్యంగా మారింది. నిరుద్యోగం, పరిశ్రమల మూత, గ్రామీణ ప్రజల ఆదాయాల కోత, ధరల పెరుగుదల, హక్కుల అణచివేత అన్నిటి ప్రభావాల ప్రతిఫలనం ఈ ప్రతిఘటన. ప్రశ్నించినవాళ్లను, న్యాయం అడిగినవాళ్లను దేశద్రోహులుగా చూస్తున్న ప్రభుత్వ నియంతృత్వ పోకడపై వెల్లువెత్తిన ఆగ్రహం ఇది. ముప్పయి రోజుల తర్వాత, యువత దేశానికి అతి ముఖ్యమైన శక్తి అని, వారి సమస్య దేశపు సమస్య అని ప్రధాని మాట్లాడటం సిగ్గులేనితనం. ఇన్ని ఆటంకాలు పెట్టింది ఎవరు? అప్పుడు ఏమైంది ఈ ఆలోచన. వాళ్లు దేశద్రోహులని కూడా నిందలు వేశారు? మాట మారిందా! గుండె జారిందా! ఇక మన మోడీగారి అల్పత్వం గురించి ఒక సారి పరిశీలించండి.

మొన్న అర్ధరాత్రి ఒక వీడియో చేసి పెట్టారాయన. ఏమని, యువత భవిత కన్నా ముఖ్యమైన అంశం లేదని పెట్టిన వీడియోకు అపార స్పందన వచ్చిందని థాంక్యూ ఫ్రెండ్స్ అని కృతజ్ఞతలు చెప్పారు. ఎంత అల్పత్వం! ఇప్పటికీ తెలంగాణలోని వారి పార్టీ నాయకులు, ఆ ఉద్యమాన్ని, యువతను కించపరుస్తూ, దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి విదేశీ శక్తుల సహకారంతో చేస్తున్న ఉద్యమమని ఆరోపణలు ఒకవైపు చేస్తూనే ఉన్నారు. ఇది కదా ద్వంద్వ విధానం, కుట్రపూరిత ప్రవర్తన. ఇంకా మోడీగారు మంత్రిమండలి సమావేశంలో బోధన చేస్తూ, మంత్రులు ఇన్‌స్టాగ్రామ్ లో యువతతో సంబంధంలో ఉండాలనీ, రీల్స్ చేయాలనీ, సోషల్ మీడియాలో ప్రచారంలో ఉండమని కోరుతున్నాడు. అక్కడ పిల్లలు ఆందోళనలో ఉంటే పరిష్కారం కోసం ఆలోచన లేదు. ప్రచారం కావాలి ఆయనకు. గ్రాఫ్ పడిపోతున్నదని బెంబెలెత్తిపోతున్నారు గానీ అసలు విషయం మీద ఆసక్తి లేదు. అదీ మన పాలకుల అల్పత్వం!

### నిశీధి - నిద్ర

రాత్రికి నిద్రకు స్నేహం ఉందా..
కారు చీకటి నిద్ర కొరకే అయితే..
వెన్నెల వన్నెలు చూసేదెవరూ..
తళుక్కుమన్న తారల్ని
లెక్కించేదెవరూ..
పుస్తకాలు చదివేదెవరూ..
సోషల్ మీడియాలో దూరేదెవరూ..
మనసు విప్పి మాట్లాడేదెవరూ !

ఒకరినొకరు తెలుసుకునేదెపుడూ..
రేపటి గురించి ఆలోచించేదెపుడూ..
గత పొరపాట్లను గుర్తించేదెపుడూ..
ఇద్దరు కలిసి ఒకటయ్యేదెపుడూ..
ఇతరుల గూర్చి ఆలోచించేదెపుడూ !

ఈ రోజు నిద్ర తప్పనిసరి అంటే..
అది నిజం కాకుండా చూస్తా నేను !

మధుపాళీ
9949700037

# జాతీయం-అంతర్జాతీయం

## అతడిని మంత్రిగా ఎలా కొనసాగిస్తారు?

- బీహార్ సర్కార్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం
- రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడ్డారంటూ విమర్శ





**న్యూఢిల్లీ, జులై 30 (ఎ.ఎం.ఎస్):** బీహార్ బీజేపీ ప్రభుత్వంపై దేశ ఉన్నత న్యాయస్థానం తీవ్రం ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలింగ్ ద్వారా ఎన్నిక కాని మంత్రిని మంత్రి వర్గంలో ఎలా కొనసాగిస్తారని ధర్మాసనం ప్రశ్నించింది. ఆరు నెలలలోపు ఎన్నికలు నిర్వహించకుండా సదురు మంత్రిని పదవీలో కొనసాగించడం రాజ్యాంగ ఉల్లంఘనంటూ సుప్రీంకోర్టు వ్యాఖ్యనించింది. "ఇది పూర్తిగా చట్టపరమైన అంశం. ఎన్నిక కాకుండానే ఒక మంత్రి ఆరు నెలలకు పైగా పదవిలో ఎలా కొనసాగుతున్నారో ప్రభుత్వం వివరించాల్సి ఉంటుంది" అని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై అత్యవసర విచారణ కోసం ఈకేసును కోర్టు ఆగస్టు 4వ వాయిదా వేసింది.

నితిష్ కుమార్ సీఎంగా ఉన్నప్పుడు బీహార్ మంత్రివర్గంలో దీపక్ ప్రకాశ్ పంచాయతీ రాజ్ మంత్రి ప్రమాణా స్వీకారం చేశారు.ఏప్రిల్ 15, 2026న ముఖ్యమంత్రి నితీష్ కుమార్ పదవి నుంచి తప్పుకోవడంతో ప్రకాష్ పదవీకాలం ముగిసింది.

అంతకుముందు ఆయన నాలుగు నెలల 26 రోజుల పాటు పంచాయతీ రాజ్ మంత్రిగా పనిచేశారు. మే 7న సామ్రాట్ చౌదరి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత, ఎన్నిక కాకపోయినప్పటికీ ప్రకాష్ మళ్లీ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో ఎన్నికకాకున్న కూడా సదురు మంత్రి ఆరు నెలల కన్నా ఎక్కువగానే కొనసాగుతున్నారు. దీంతో దీపక్ ప్రకాశ్ చట్టవిరుద్ధంగా మంత్రి పదవీలో కొనసాగుతున్నారని పలువురు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గురువారం విచారణ చేపట్టిన ధర్మాసనం బీహార్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఎన్నికకానీ మంత్రిని ఆరు నెలలపైగా మంత్రి పదవీలో ఎలా కొనసాగిస్తారని, సమగ్ర వివరణ తెలియజేయాలని ఆదేశాలు ఇచ్చింది.

## కకావికలం చేస్తోన్న కార్చిచ్చు




**పారిస్, రెథిమ్నో, జులై 30:** దక్షిణ ఐరోపా దేశాలను కార్చిచ్చు కకావికలం చేస్తోంది. ఫ్రాన్స్‌లో చెలరేగిన మంటలు అదుపులోకి రాకుండా విస్తరిస్తుండగా, గ్రీస్‌లో విధి నిర్వహణలో ముగ్గురు ఫైర్‌ఫైటర్లు ప్రాణాలు కోల్పోయారు. తీవ్రమైన వేడి, కరవు, బలమైన గాలుల కారణంగా ఫ్రాన్స్, గ్రీస్, స్పెయిన్ దేశాల్లో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

నైరుతి ఫ్రాన్స్‌లోని గిరోండే ప్రాంతంలో రాజుకున్న కార్చిచ్చు పారిస్ నగరానికి నాలుగు రెట్ల విస్తీర్ణంలో వ్యాపించిందని అధికారులు తెలిపారు. మంటలు మరింత విస్తరించే ప్రమాదం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఫ్రాన్స్, స్పెయిన్‌లలో కలిపి దాదాపు 3.30 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఒక్క గిరోండే ప్రాంతం నుంచే 2.20 లక్షల మందిని ఖాళీ చేయించారు. 2,200 మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది, 20కి పైగా విమానాలు మంటలను ఆర్పేందుకు నిరంతరం శ్రమిస్తున్నాయి. ఇతర యూరోపియన్ దేశాల నుంచి కూడా సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. స్థానిక ప్రజలు కూడా స్వచ్ఛందంగా సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు.

మరోవైపు, గ్రీస్‌లో పరిస్థితి మరింత విషాదకరంగా మారింది. క్రీట్ ప్రాంతంలోని రెథిమ్నోలో మంటలను ఆర్పే క్రమంలో ఇద్దరు, పెలోపొన్నీస్ ప్రాంతంలో మరొకరు చొప్పున మొత్తం ముగ్గురు అగ్నిమాపక సిబ్బంది మరణించారు. స్పెయిన్‌లో కొన్ని ప్రాంతాల్లో మంటలు అదుపులోకి రావడంతో ప్రజలు ఇళ్లకు తిరిగి వస్తున్నారు. అయితే, కాస్టెలాన్‌లో ఇంకా 10,000 మంది తరలింపు శిబిరాల్లోనే ఉన్నారు.

తీవ్రమైన వేడి, తేమలేని వాతావరణం కారణంగా గడ్డి, పొదలు వేగంగా మండిపోతున్నాయని అధికారులు వివరిస్తున్నారు.

ఒక బ్రష్‌కటింగ్ యంత్రం నుంచి వచ్చిన నిప్పురవ్వల వల్లే ఫ్రాన్స్‌లో ఈ కార్చిచ్చు మొదలైందని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ మంటల వల్ల ఫ్రాన్స్‌లో తొలిసారిగా 'పైరోక్యుములోనింబస్' అనే ఉరుములతో కూడిన నల్లటి మేఘం ఏర్పడిందని, ఇది కొత్తగా మంటలను సృష్టిస్తోందని అధికారులు తెలిపారు. యూరప్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వేడెక్కుతున్న ఖండమని, ఇది ప్రపంచ సగటు కంటే రెట్టింపు వేగంతో ఉందని యూరోపియన్ యూనియన్ క్లైమేట్ సర్వీస్ 'కోపర్నికస్' నివేదిక పేర్కొంది. ప్రస్తుతం దక్షిణ ఐరోపా దేశాలు అగ్నికీలలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయి.

## రాజ్యసభలో యాంటీ పేపర్ లీక్ బిల్లు



- కఠిన చర్యలు తీసుకునేలా రూపకల్పన
- ఇప్పటికే లోక్‌సభలో ఆమోదం

**న్యూఢిల్లీ, జులై 30 (ఎ.ఎం.ఎస్):** పబ్లిక్ ఎగ్జామినేషన్(ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026ను కేంద్రం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. మంత్రి జితేందర్ సింగ్ సదురు బిల్లును సభ్యుల ముందు ఉంచారు.ఈ బిల్లును ఇప్పటికే లోక్‌సభ ఆమోదించగా.. గురువారం ఎగువసభలో దీనిపై సుదీర్ఘ చర్చ జరగనుంది. ఇటీవలి కాలంలో దేశంలోని పలు పరీక్షల్లో చోటుచేసుకున్న అవకతవకల నేపథ్యంలో పరీక్షా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని నెలకొల్పడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని కేంద్రం చెబుతోంది. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంపొందించడం, ప్రశ్నపత్రాల లీకేజీలు, మోసపూరిత చర్యలు, ఇతర అక్రమాలకు పాల్పడే వారిపై మరింత కఠిన చర్యలు తీసుకునేలా ఈ బిల్లును రూపొందించారు. పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026ను లోక్‌సభ బుధవారం ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ బిల్లుపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ క్లుప్తంగా సమాధానమిచ్చిన అనంతరం ఈ ఆమోదం లభించింది. ఈ బిల్లుపై మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన సుదీర్ఘ చర్చ రాత్రి 11 గంటల వరకు కొనసాగింది. బుధవారం నాడు తిరిగి చర్చ ప్రారంభమైంది. ప్రస్తుతం ఉన్న మూడేళ్లకు తక్కువ కాకుండా, ఐదేళ్ల నుంచి పదేళ్ల వరకు శిక్షను పొడిగించేలా పెంచాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. గరిష్ట జరిమానాను కూడా రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచాలని ప్రతిపాదించారు.

## కంగనాకు సీజేపీ నేత కౌంటర్

- తనదైన శైలిలో సౌరవ్ దాస్ సెటైర్లు
- చర్చనీయాంశమైన వ్యాఖ్యలు
- కంగనాపై తనకు వ్యక్తిగతంగా ఎలాంటి ద్వేషం లేదంటూ క్లారిటీ



**ముంబయి, జులై 30 (ఎ.ఎం.ఎస్):** బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ చేసిన 'పనికిమాలినవాడు', 'నిరుద్యోగి' అనే తీవ్రమైన వ్యాఖ్యలకు 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ తనదైన శైలిలో, హాస్యాన్ని జోడించి బదులిచ్చారు. తనపై కంగనా వ్యక్తిగత విమర్శలకు దిగడానికి కారణం, తాను "యువ హృతిక్ రోషన్‌లా కనిపించడమే" కావొచ్చని తన స్నేహితులు అంటున్నారని ఆయన చమత్కరించారు. ఇద్దరి మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధంలో ఈ వ్యాఖ్యలు మరింత ఆసక్తిని రేకెత్తించాయి. ప్రముఖ జర్నలిస్ట్ బర్ఖా దత్‌తో మాట్లాడుతూ సౌరవ్ దాస్ ఈ వ్యాఖ్యలు చేశారు. గత కొన్ని రోజులుగా కంగనా తనను లక్ష్యంగా చేసుకోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "నా స్నేహితులు నాకు టెక్స్ట్ చేసి 'ఆమె నీ వెనుక ఎందుకు పడింది?' అని అడుగుతున్నారు. వారిలో ఒకరు 'నువ్వు బహుశా యువ హృతిక్ రోషన్‌లా కనిపిస్తున్నావేమో' అని అన్నారు. ఇది నిజమేనా? ఈ గొడవ తర్వాత నా స్నేహితులు నాతో చెప్పింది ఇదే. నా లాంటి వ్యక్తిపై ఆమె ఎందుకు దాడి చేయాలనుకుంటుందోనని ఆశ్చర్యపోయాను" అని నవ్వుతూ చెప్పారు. అయితే, కంగనాపై తనకు వ్యక్తిగతంగా ఎలాంటి వ్యతిరేకత లేదని ఆయన స్పష్టం చేశారు. అభిప్రాయ భేదాలను వ్యక్తిగత దాడులతో కాకుండా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సౌరవ్ దాస్ సూచించారు. "కంగనా రనౌత్‌పై నాకు వ్యక్తిగతంగా ఏమీ వ్యతిరేకత లేదు. తనే జెన్‌జీ పైనా, ఇప్పుడు నాపైనా వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తున్నారు. నేను ఇప్పటికే నా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో చెప్పాను, 'యో కంగనా, కాస్త శాంతించు. దీని గురించి మాట్లాడుకుందాం' అని. ఈ దేశంలో ఉన్న సమస్యే ఇది. ప్రజలు ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం మానేశారు. చర్చలు, సంప్రదింపులు తగ్గిపోయాయి. మనం ఒకరినొకరు గౌరవించుకుంటూ సంభాషణలు జరపగలగాలి" అని ఆయన అన్నారు. ప్రజాప్రతినిధులు దేశ యువత గురించి మాట్లాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని, వారి మాటలు నిరాశతో కూడుకున్నవిగా ఉన్నాయని అన్నారు. తాము ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

## జెలెన్ స్కీ, నెతన్యాహూలతో ట్రంప్ భేటి



- సానుకూలంగా సమావేశాలు
- ఉక్రెయిన్‌కు సాయంపై ఎలాంటి ప్రకటనా చేయని అమెరికా

**వాషింగ్టన్, జులై 30:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూలతో విడివిడిగా సమావేశమయ్యారు. ఈ సమావేశాలు సానుకూలంగా, ఫలప్రదంగా జరిగాయని అధ్యక్షభవనం తెలిపింది. సెనెటర్ లిండ్సే గ్రహమ్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు ఇరువురు నేతలు వాషింగ్టన్ వచ్చారు. గ్రహమ్ ఇజ్రాయిల్‌కు గట్టి మద్దతుదారు. ఉక్రెయిన్‌కు అమెరికా సాయం అందించాలని ఆయన సూచించే వారు. కాగా గగనతల రక్షణ వ్యవస్థలను బలోపేతం చేసే విషయంలో సాయం చేయాలని ట్రంప్‌ను జెలెన్‌స్కీ కోరారు.

అమెరికా నుంచి పాట్రియాట్ క్షిపణులను ఉక్రెయిన్ చాలా కాలం నుంచి కోరుతోంది. రష్యా డ్రోన్, క్షిపణి దాడుల నుంచి ఉక్రెయిన్ నగరాలను కాపాడుకునేందుకు ఇవి అవసరమని చెబుతోంది. మరోవైపు ఇరాన్ విషయంలో అమెరికాఇజ్రాయిల్ మధ్య సంబంధాలు బెడిసికొట్టిన తరుణంలో ట్రంప్‌తో నెతన్యాహూ చర్చలు జరిపారు.

ఏకాంత సమావేశం బాగానే జరిగిందని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. ఉక్రెయిన్‌కు సైనిక సాయంపై అమెరికా ఎలాంటి ప్రకటన చేయకపోయినప్పటికీ పాట్రియాట్ క్షిపణులను దేశీయంగా తయారు చేయడానికి లైసెన్సులు ఇచ్చేందుకు ట్రంప్ అంగీకరించారని జెలెన్‌స్కీ చెప్పారు. బాలిస్టిక్ క్షిపణుల దాడిని అడ్డకోగలిగిన అతి కొద్ది గగనతల రక్షణ వ్యవస్థలలో పాట్రియాట్ ఒకటి. అయితే వీటి ధర చాలా ఎక్కువ. ఒక్కో పాట్రియాట్ ఖరీదు మూడు నుంచి ఐదు మిలియన్ డాలర్ల వరకూ ఉంటుంది.

## పార్లమెంటు వద్ద ప్రతిపక్షాల ఆందోళన



- విద్యార్థులపై లాఠీఛార్జీకి ఆగ్రహం

**న్యూఢిల్లీ, జులై 30 (ఎ.ఎం.ఎస్):** పార్లమెంట్ మకర ద్వారం వద్ద ప్రతిపక్షాలు ఆందోళన బాటపట్టాయి. జంతర్ మంతర్ వద్ద ఈనెల 25న నిరసన చేపట్టిన జెన్ జీ పై లాఠీచార్జీను వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశాయి. న్యాయమైన డిమాండ్ల కోసం, యువత భవిష్యత్ కోసం చేపట్టిన శాంతియుత ఆందోళనలపై పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించారని విపక్ష ఎంపీలు మండిపడ్డారు. యువతకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కేంద్రం విఫలమైందని ఆరోపించారు.

జెన్ జీ నిరసనలకు మద్దతుగా నిలిచిన, పాల్గొన్న వారిపై మోడీ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎవరిపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయబోమని జెన్ జీకి హామీ ఇచ్చిన మోడీ ప్రభుత్వం కేసులు నమోదు చేస్తూ జెన్ జీని మోసం చేస్తుందని విపక్షాలు మండిపడ్డాయి. ఉభయసభల్లో అయోధ్య విరాళాల దుర్వినియోగం చర్చ జరపాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు.

## వైద్యరంగంలో కీలక సంస్కరణలు



- శ్రీకారం చుట్టిన తమిళనాడు ప్రభుత్వం
- సింగిల్ విండో క్లియరెన్స్‌కు నిర్ణయం
- నెలల వ్యవధిలోనే పూర్తి చేయాలంటూ ఆదేశాలు

**చెన్నై, జులై 30 (ఎ.ఎం.ఎస్):** వైద్య ఆరోగ్య రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించే దిశగా తమిళనాడు ప్రభుత్వం కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో నూతన ఆసుపత్రుల ఏర్పాటుకు అవసరమైన అనుమతుల కోసం 'సింగిల్ విండో క్లియరెన్స్' (ఏక గవాక్ష) విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది.

దీనివల్ల ఏళ్ల తరబడి వివిధ ప్రభుత్వ శాఖల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, అనుమతుల ప్రక్రియ కేవలం కొన్ని నెలల్లోనే పూర్తి కానుంది. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శుక్రవారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమావేశం అనంతరం దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు (జీవో) జారీ అయ్యే అవకాశం ఉంది. ఈ నిర్ణయంతో పారిశ్రామికంగా పురోగతి సాధిస్తున్న మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాల సరసన తమిళనాడు కూడా నిలవనుంది. ప్రస్తుత విధానంలో ఆసుపత్రి భవనాలు, ప్రాజెక్ట్ డిజైన్లకు అనుమతులు లభించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని, కొన్ని సందర్భాల్లో రూ. 4050 లక్షల వరకు లంచాలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ జాప్యం కారణంగా సుమారు 78 మంది వైద్యులు తలపెట్టిన ఆసుపత్రి ప్రాజెక్టులు ప్రస్తుతం పెండింగ్‌లో పడిపోయాయి.

కొత్త సింగిల్ విండో విధానంతో పారదర్శకమైన, నిర్దిష్టమైన ఫీజుల విధానం అమల్లోకి రానుంది. దీనివల్ల అవకతవకలకు అడ్డుకట్ట పడుతుందని, అనుమతుల ప్రక్రియ వేగవంతమై వైద్య రంగంలో పెట్టుబడులు పెరుగుతాయని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్ద కాలంగా పరిశ్రమ వర్గాల నుంచి వస్తున్న విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

## హార్ముజ్‌లో నౌకలను స్వేచ్ఛగా తిరగనివ్వండి

- ఐరాస భద్రతా మండలిలో భారత్
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై తీవ్ర ఆందోళన





**న్యూయార్క్, జులై 30 :** పశ్చిమాసియాలో తిరిగి ఉద్రిక్తతలు చోటుచేసుకోవడంపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. హార్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై ఇటీవల జరిగిన దాడులను ఖండించింది. ఉద్రిక్తలను నివారించాలని, అంతర్జాతీయ జలమార్గంలో నౌకలు స్వేచ్ఛగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రయాణించేలా చూడాలని కోరింది. మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిస్థితిపై భద్రతా మండలిలో జరిగిన బహిరంగ చర్చలో భారత శాశ్వత ప్రతినిధి (ఐరాస) పర్వతనేని హరీష్ మంగళవారం ప్రసంగిస్తూ స్వల్ప విరామం తర్వాత తిరిగి శత్రుత్వాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. చర్చలు, దౌత్యానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భారత్‌కు పశ్చిమాసియా అత్యంత ప్రాముఖ్యత కలిగిన ప్రాంతమని అంటూ ఆ ప్రాంతంలో ఉద్రిక్తతల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. హార్ముజ్‌లో జరిగిన దాడులు భారతీయ పౌరులపై ప్రత్యక్ష ప్రభావం చూపాయని చెప్పారు.

'ఈ దాడులలో పలువురు భారతీయులు గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఓ భారతీయుడు ప్రాణాలు కోల్పోయాడు. మరొకరి ఆచూకీ తెలియడం లేదు. నౌకాయాన సిబ్బందిని లక్ష్యంగా చేసుకొని జరిపే హింసాత్మక చర్యలను భారత్ నిరంతరం ఖండిస్తూనే ఉంది. హార్ముజ్ వంటి అంతర్జాతీయ జలమార్గాల ద్వారా స్వేచ్ఛాయుత, సురక్షితమైన నౌకాయానానికి అంతరాయం కల్పించడాన్ని కూడా మేము నిరసిస్తూనే ఉన్నాం' అని హరీష్ తెలిపారు. మధ్యప్రాచ్యంలో శాంతి, సుస్థిరత పునరుద్ధరించబడాలంటే దౌత్యం ఒక్కటే మార్గమని భారత్ గట్టిగా అభిప్రాయపడుతోందని అన్నారు.

పశ్చిమాసియాలో భారత్ వ్యూహాత్మక ప్రయోజనాలను హరీష్ ఈ సందర్భంగా వివరించారు. పాలస్తీనా ప్రజలకు భారత్ మద్దతు కొనసాగుతుందని, రెండు దేశాల పరిష్కారానికి దీర్ఘకాలంగా మద్దతు ఇస్తోందని తెలిపారు.

## ఇరాక్‌పై విరుచుకుపడిన అమెరికా, సౌదీ



- 20 మంది మరణం
- ఉగ్రవాదులపైన్నే దాడులంటూ ఇరు దేశాల స్పష్టీకరణ

**బాగ్దాద్, జులై 30 :** ఇరాక్‌పై అమెరికాసౌదీ సేనలు బుధవారం విరుచుకుపడ్డాయి. ఈ దాడులలో మాజీ పార్లమెంటరీ కూటమికి చెందిన కనీసం 20 మంది చనిపోయారు. ఈ కూటమిలో ఇరాన్ అనుకూల గ్రూపులు కూడా ఉన్నాయి. మాజీ పార్లమెంటరీ గ్రూపులు, ఇరాక్ సాయుధ దళాలలో భాగస్వాములైన వర్గాలతో ఏర్పడిన పాపులర్ మొబిలైజేషన్ ఫోర్సెస్ (పీఎంఎఫ్) అందించిన సమాచారం ప్రకారం ఏడు రాష్ట్రాలలోని కూటమి స్థావరాలపై అమెరికాసౌదీ జరిపిన దాడులలో కనీసం 20 మంది చనిపోగా 32 మంది గాయపడ్డారు. కాగా అమెరికా సేనల పైన, సౌదీ చమురు స్థావరాల పైన జరిగిన దాడులకు ప్రతీకారంగానే ఇరాక్‌లో ఇరాన్ మద్దతిస్తున్న ఉగ్రవాదులపై దాడులు చేశామని అమెరికాసౌదీ అరేబియా ఆరోపించాయి. 2014లో జిహాదీలపై పోరాడేందుకు పారామిలటరీలు, వర్గాలతో ఏర్పడిన కూటమే పీఎంఎఫ్. ఇప్పుడది ఇరాక్ సాయుధ దళాలలో కలిసిపోయింది. కూటమిలోని కొన్ని గ్రూపులకు ఇరాన్ మద్దతు ఇస్తున్నప్పటికీ వీటిలో చాలా వరకూ స్వతంత్రంగానే వ్యవహరిస్తున్నాయి. అమెరికాసౌదీ ప్రమాదకరమైన దాడులకు పాల్పడుతున్నాయని, ఇరాక్ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘిస్తున్నాయని, ఇది తమ అధికారిక భద్రతా సంస్థలపై జరిగిన దాడిగా భావిస్తున్నామని పీఎంఎఫ్ ఓ ప్రకటనలో తెలిపింది. కాగా ఇరాక్‌లో ఇరాన్ మద్దతున్న గ్రూపులు తమ చమురు స్థావరాలను లక్ష్యంగా చేసుకొని డ్రోన్ దాడులు చేశాయని, తమ సేనలు వాటిని నిలువరించాయని సౌదీ అంతకుముందు తెలిపింది.

## హాకీ జట్టు జెర్సీపై రాజకీయం

- నీలం రంగు స్థానంలో కాషాయం
- చరిత్రను మారుస్తున్నారంటూ ప్రియాంకా గాంధీ ఆవేదన

**న్యూఢిల్లీ, జులై 30 (ఎ.ఎం.ఎస్) :** భారత హాకీ జట్టు సంప్రదాయ నీలం జెర్సీ స్థానంలో ప్రపంచకప్ కోసం కాషాయ రంగు జెర్సీని ప్రవేశపెట్టడంపై మొదలైన చర్చ రాజకీయ రంగు పులుముకుంది. మాజీ కెప్టెన్ విరేన్ రస్క్వినా ఈ నిర్ణయాన్ని ప్రశ్నించారు. తాజాగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కూడా దీనిపై స్పందించారు. జెర్సీ మార్పు ఒక్కటే కాదని, చరిత్రను మార్చే ప్రయత్నాలు జరిగినా దేశ యువత తన అభిప్రాయాన్ని ఇప్పటికే స్పష్టం చేసిందని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ బయట మీడియాతో మాట్లాడిన ఆమె, దేశ ఆత్మను మాత్రం మార్చలేరని అన్నారు. జెర్సీ మార్చినా, విద్యా విధానంలో చరిత్రను తిరగరాయాలని చూసినా ప్రజల ఆలోచనలను మార్చడం సాధ్యం కాదని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. జంతర్‌మంతర్‌లో యువత వ్యక్తం చేసిన అభిప్రాయాలే దేశ స్వరమని చెప్పారు. భారత స్వాతంత్ర్య పోరాటం అహింస, సత్యం అనే విలువలపై నిర్మితమైందని గుర్తుచేశారు. ఆ ఉద్యమంలో ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి పాత్ర లేదని, ఈ విషయాన్ని దేశ ప్రజలకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపిందని చెప్పారు. సోదరభావం, ఐక్యత, సత్యం, అహింసలోనే దేశ ఆత్మ ఉందని ప్రియాంక స్పష్టం చేశారు. ద్వేషం రెచ్చగొట్టినా, హింసను ప్రోత్సహించినా భారత మూల విలువలను ఎవరూ చెరిపేయలేరని అన్నారు. దేశ ఐక్యతను దెబ్బతీయాలనే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవని చెప్పారు. రాజకీయ భావజాలం పేరుతో దేశ స్వభావాన్ని మార్చడం అసాధ్యమని అభిప్రాయపడ్డారు.

## ప్రశాంతంగా దతియా ఉప ఎన్నిక



**భోపాల్, జులై 30 (ఎ.ఎం.ఎస్):** మధ్యప్రదేశ్ లోని దతియా అసెంబ్లీ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. ఉదయం 11 గంటల వరకు సుమారు 32.53 శాతం ఓటింగ్ నమోదైంది. జిల్లా యంత్రాంగం నిరంతర పర్యవేక్షణ, తగిన భద్రతా ఏర్పాట్ల మధ్య నియోజకవర్గ ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. అంతకుముందు, ఉదయం 9 గంటల వరకు నమోదైన ప్రారంభ పోలింగ్ సరళిలో ఓటింగ్ శాతం 12.94గా ఉంది. ఉదయం 7 గంటలకు అన్ని ప్రాంతాల్లో ప్రశాంతంగా మొదలైన ఓటింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనుంది. అంతకముందు ఉదయం 5:30 గంటలకు ప్రారంభమైన మాక్ పోల్, 7 గంటల లోపే ముగిసింది. ఓట్ల లెక్కింపు ఆగస్టు 3న చేపడతారు. ఏప్రిల్ 2న కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజేంద్ర భారతి అనర్హతకు గురికావడంతో దతియా అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది. ఈ ఎన్నికల్లో బీజేపీ అశుతోష్ తివారీని బరిలోకి దించగా, కాంగ్రెస్ ఘన్‌శ్యామ్ సింగ్‌ను అభ్యర్థిగా నిలిపింది.

## జపాన్‌లో భూకంపం



- 13 మంది మృత్యువాత
- ప్రతిక్షణం విలువైనదేనన్న జపాన్ ప్రధాని

**టోక్యో, జులై 30 :** జపాన్‌లో సంభవించిన భూకంపంలో మరణించిన వారి సంఖ్య 13కు చేరింది. క్షతగాత్రుల సంఖ్య వందలలోనే ఉంది. షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న ముగ్గురు, పేపర్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న అనేక మంది కార్మికుల ఆచూకీ తెలియడం లేదు. విద్యుత్, మంచినీటి సరఫరాలకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. యాభై వేలకు పైగా కుటుంబాలు కరెంటు లేక అంధకారంలో బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వచ్చింది. సుమారు లక్షన్నర ఆవాసాలకు నీటి సరఫరా బంద్ అయింది. భూకంపం సంభవించిన ప్రాంతంలో బుధవారం 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. భూప్రకంపనలు సంభవిస్తాయేమోనన్న భయంతో చాలా మంది మంగళవారం రాత్రి తమ కార్లలోనే నిద్రించారు. తొమ్మిది వేల మందికి పైగా బాధితులను అధికారులు సహాయ శిబిరాలకు తరలించారు. భూకంపం సంభవించిన వెంటనే 200 షాపులున్న ఓ షాపింగ్ మాల్‌లో పేలుడు జరిగింది. ప్రధాన భవనంలోని పై అంతస్తు పాక్షికంగా కూలిపోయింది. భూకంపం సంభవించగానే వినియోగదారులను, సిబ్బందిని హుటాహుటిన ఖాళీ చేయించారు. దక్షిణ ప్రాంతంలోని కుమమోటో ప్రాంతంలో రిక్టర్ స్కేలుపై 6.8 తీవ్రతతో భూకంపం సంభవించిందని ప్రధాని సానే టకైచీ బుధవారం తెలిపారు. శిథిలాల కింద చిక్కుబడిన వారి కోసం వేలాది మంది సైనికులు గాలింపు చేపట్టారని, ప్రస్తుత పరిస్థితులలో ప్రతి క్షణం విలువైనదేనని ఆయన అన్నారు. సహాయ కార్యక్రమాల కోసం 2,600 మంది సిబ్బందిని సమీకరించారు. గగనతలం నుంచి నష్టాన్ని అంచనా వేసేందుకు 20 విమానాలను పంపారు. భూకంపం ధాటికి అనేక బ్రిడ్జిలు ధ్వంసమయ్యాయి. 2016లో సంభవించిన భూకంపంలో దెబ్బతిన్న ఒక చారిత్రక కోటకు తాజా ఘటనలో మరోసారి నష్టం వాటిల్లింది. భారీ భూకంపం వచ్చిన ప్రాంతాలలో రాబోయే వారం రోజులలో మరింత బలమైన ప్రకంపనలు సంభవించవచ్చునని, కొండ చరియలు విరిగిపడతాయని వాతావరణ విభాగం హెచ్చరించింది. బుధవారం ఉదయానికి 60కి పైగా ప్రకంపనలు సంభవించాయి. రిక్టర్ స్కేలుపై వీటి తీవ్రత 14గా నమోదైంది.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## మోడల్ సోలార్ విలేజ్ పనులను వేగవంతం చేయాలి - కలెక్టర్



**హనుమకొండ/ఆత్మకూరు, జూలై 30 (వుదయం ప్రతినిధి) :**

మోడల్ సోలార్ విలేజ్ పథకం కింద ఆత్మకూర్ గ్రామంలో మిగిలిన లబ్ధిదారుల ఇళ్లపై సోలార్ యూనిట్ల ఏర్పాటు పనులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం రోజున ఆత్మకూర్ గ్రామంలో పర్యటించిన జిల్లా కలెక్టర్, పథకం అమలు పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గ్రామంలోని గొల్లపల్లి గణపతి నివాసంలో అమర్చిన సోలార్ యూనిట్‌ను పరిశీలించిన కలెక్టర్, దాని పనితీరు, ఉచిత విద్యుత్ వినియోగం వల్ల కలుగుతున్న ప్రయోజనాల గురించి లబ్ధిదారుల కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సోలార్ విద్యుత్ వాడకం వల్ల విద్యుత్ బిల్లులు తగ్గడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.తదనంతరం టీజీ రెడ్‌కో, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. మొదటి విడతగా గ్రామంలో 764 మందికి సోలార్ యూనిట్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 251 ఇళ్లలో ఏర్పాటు పూర్తి చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన ఇళ్లకు అవసరమైన మెటీరియల్‌ను వెంటనే సమకూర్చుకొని, నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను స్పష్టంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ గ్రామ సర్పంచ్ మహేశ్వరి, టీజీ రెడ్‌కో ఫీల్డ్ అధికారులు దీపక్, నవీన్ కుమార్ యాదవ్, తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల గుమ్మం వద్దకే సంక్షేమ ఫలాలు.

# చంద్రుగొండలో రూ.1.25 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 30 (వుదయం ప్రతినిధి )**

ప్రజల గుమ్మం వద్దకే సంక్షేమ ఫలాలు చేరవేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన రూ.1.25 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీవో మధు, చంద్రుగొండ తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.మంత్రి ముందుగా మంగయ్య బంజార గ్రామంలో రూ.45 లక్షల వ్యయంతో మంగయ్య బంజారు–గానుగపాడు గ్రావెల్ రోడ్డు, కల్వర్టు, సీసీ రోడ్డు, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి 24 ఇందిరమ్మ గృహాలు మంజూరు చేసినట్లు ప్రకటించారు.అనంతరం పొకలగూడెం గ్రామంలో రూ.60 లక్షల వ్యయంతో నాలుగు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామానికి ఇప్పటికే 77 ఇందిరమ్మ గృహాలు మంజూరు చేసినట్లు వెల్లడిస్తూ, మిగిలిన అంతర్గత రహదారుల అభివృద్ధికి కూడా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తదుపరి రావికంపాడు గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో రెండు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పనే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గత ప్రభుత్వం రూ.8.21 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని వదిలివెళ్లినప్పటికీ, ముఖ్యమంత్రి



రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు.ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి, తాజాగా మరో 16 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం స్వయం సహాయక సంఘాలకు రూ.70 వేల కోట్ల వడ్డీలేని రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు.అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు, నాణ్యమైన సన్నబియ్యం, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రైతు సంక్షేమ కార్యక్రమాలు, సామాజిక భద్రతా పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు.ఇందిరమ్మ గృహాల పథకం కింద తొలి విడతలో 4.50 లక్షలు, రెండో విడతలో 2.50 లక్షలు కలిపి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7 లక్షల గృహాల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో ప్రత్యేకంగా లక్ష ఇందిరమ్మ గృహాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఒక్క పేద కుటుంబం కూడా పూరి గుడిసెలో నివసించకుండా ప్రతి అర్హ కుటుంబానికి శాశ్వత గృహం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, అంతర్గత రహదారులు, కల్వర్టులు, తాగునీటి సదుపాయాలు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, చంద్రుగొండ మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తాయని మంత్రి పేర్కొన్నారు.అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ, మంగయ్య బంజార గ్రామం స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఏకగ్రీవంగా ఎంపికైన తర్వాత గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి వేగవంతమైందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవతో మండలానికి పెద్దఎత్తున అభివృద్ధి పనులు మంజూరవుతున్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని పనులు చేపడతామని తెలిపారు.జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, చంద్రుగొండ మండలంలో ఇందిరమ్మ గృహాల కోసం పూరి గుడిసెల సర్వే పూర్తైందని, అర్హుల గుర్తింపు ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతోందన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి శుక్రవారం "ఫ్రైడే–డ్రై డే" కార్యక్రమం నిర్వహిస్తూ గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సీజనల్ వ్యాధుల నివారణ, దోమల నియంత్రణ, తాగునీటి పరిశుభ్రత, ప్రజల్లో ఆరోగ్య అవగాహన కల్పనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.

## బండ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి : కమిషనర్ టి.వెంకన్న

**వరంగల్ టౌన్, జూలై 30 (వుదయం ప్రతినిధి) :**



జీడబ్ల్యూఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, కార్యాలయ నిర్వహణను మరింత పారదర్శకంగా మార్చేందుకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చర్యలు వేగవంతం చేశారు. భద్రకాళి, వడ్డేపల్లి బండ్లపై పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. గురువారం రోజున ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని పరిశీలించారు. భద్రకాళి బండ్ పై మిగిలిన పనులను కాంట్రాక్ట్ ఏజెన్సీ వారు పక్షం రోజుల్లో పూర్తి చేయాలని, అలాగే హార్టికల్చర్ గ్రీనరీ ఏర్పాటుకు అంచనాలు తయారు చేయాలని సూచించారు. వడ్డేపల్లి బండ్ పనులను ఆగస్టు నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేస్తూ, గ్రీనరీ టెండర్ ప్రక్రియ పూర్తయినందున వెంటనే పనులు ప్రారంభించాలని హార్టికల్చర్ అధికారిని ఆదేశించారు. ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజనీర్ రాజ్‌కుమార్, హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, డిఈ రాజ్‌కుమార్, ఏఈ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు – అదనపు కమిషనర్మరొకవైపు, జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ ఈసంపల్లి జోనా గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వివిధ విభాగాల్లో సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించిన ఆయన, ప్రతి ఉద్యోగీ తప్పనిసరిగా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించి, పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన పూర్తి చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీల్లో పర్యవేక్షకులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణీత షెడ్యూల్ ప్రకారం యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం పూర్తి చేయాలి: కలెక్టర్

**ఖమ్మం, వుదయం బ్యూరో జూలై - 30**

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాల పనులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు.ఖమ్మం నియోజకవర్గం పరిధిలోని రఘునాథపాలెం వైఎస్ఆర్ నగర్ ప్రధాన దారిలో రూ. 200 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను గురువారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. స్కూల్ నిర్మాణంలో హాస్టల్స్ భవనాలు, అకాడమిక్ బ్లాక్‌లు, డార్మిటరీ భవనం, వంటగది, భోజనశాల, ప్రధాన నివాస గృహం, క్వార్టర్స్ నిర్మాణ ప్రాంతాలను కాలినడకన పరిశీలిస్తూ భవనాల పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రతి పనిని సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నియోజక వర్గానికి ఒకటి చొప్పున జిల్లాలో ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగానే ఖమ్మం నియోజక వర్గానికి సంబంధించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్



నిర్మాణ పనుల్లో వేగం పెంచి అగ్రిమెంట్ ప్రకారం స్కూల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తోందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంలోనూ రాణించేలా అత్యాధునిక మౌళిక వసతులతో ఈ విద్యాసంస్థలను నిర్మిస్తున్నట్లు తెలిపారు.పాఠశాల ఆవరణలో విద్యార్థుల రాకపోకలకు అనువుగా లింక్ రోడ్లు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పచ్చదనం వంటి మౌలిక వసతులను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు.నిర్మాణ సంస్థలు, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతిరోజూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ, నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రఘునాథపాలెం మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (బాలుర) గురుకుల పాఠశాల/కళాశాల భవనం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించారు. నెలరోజుల లోపు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ తనిఖీలో కలెక్టర్ వెంట రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలి

**మెనూ షెడ్యూల్‌ను తప్పనిసరిగా అమలు చేయాలి**

**– జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



**ములుగు, జూలై 30 (వుదయం ప్రతినిధి):**

వసతి గృహాలలోని విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని తప్పనిసరిగా మెనూ పాటించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఎస్సీ ప్రీ–మెట్రిక్ హాస్టళ్లలో 2026–27 విద్యా సంవత్సరానికి అమలు చేయనున్న వారాంత ఆహార మెనూ పోస్టర్‌ను తన ఛాంబర్‌లో జిల్లా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, రుచికరమైన భోజనం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రూపొందించిన మెనూ షెడ్యూల్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రతిరోజు నిర్ణయించిన ఆహార పదార్థాలనే విద్యార్థులకు అందించాలని సూచించారు.విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహార అవసరాలను దృష్టిలో ఉంచుకుని అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం, రాత్రి భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఏ ఎస్ డబ్ల్యూ ఓ సురేష్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం పథకం లో విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి:అదనపు కలెక్టర్

**యాదాద్రి భువనగిరి జిల్లాతేది: 30.07.2026**

మధ్యాహ్న భోజనం పథకం లో విద్యార్థులకు రుచికరమైన నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ లు త్వరగా అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.గురువారం పోచంపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల (కేజీబీవీ), మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్నవిద్యార్థుల యూనిఫామ్ కుట్టు పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సందర్శించారు., మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు.ఈ సందర్భంగా అటెండెన్స్ రిజిస్టర్ ను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం



నాణ్యమైన, పోషకాహారం అందిస్తున్నారా లేదా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. భోజనం తయారీ విధానం, వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, తాగునీటి సౌకర్యం, వంటగది నిర్వహణను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆహారం నాణ్యత, రుచి, మెనూ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణం, తాగునీటి సౌకర్యం, వంటశాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు.యూనిఫాంల కుట్టు పనులను మరింత మంది టైలర్లను వినియోగించి వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా అన్ని యూనిఫాంలను సిద్ధం చేసి విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పర్వతగిరి మండల సర్వ సభ సమావేశం నకు హాజరైన

**వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**అధికారులు సమన్వయంతో ప్రజలకు సేవలు అందించాలి.**



**పర్వతగిరి, జులై 30 (వుదయం ప్రతినిధి):**

పర్వతగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్నాగరాజు మాట్లాడుతూ...అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అన్నారు. మండలంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలు, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా పనిచేయాలని ఆయన సూచించారు. మండల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్వసభ్య సమావేశం సభ్యులతో సమగ్రంగా చర్చించారు. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల అవసరాలను గుర్తించి, అభివృద్ధే లక్ష్యంగా సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏడీ మైనింగ్ స్పెషల్ ఆఫీసర్ రవిశంకర్, డీపీఓ కల్పన, ఎంపీడీఓ శంకర్ నాయక్, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీఓ శేషాంజన్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్వసభ్య సమావేశం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి**

**24 గంటలు కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పనిచేయాలి**

**లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ సహాయక చర్యలను వేగవంతం చేయాలి**

**జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

**పెద్దపల్లీ, జూలై-30 (వుదయం ప్రతినిధి)**

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు.గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి భారీ వర్షాలు, వరద పరిస్థితులపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట నుంచి జిల్లా కలెక్టర్ కోయశ్రీహర్ష, ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అతి భారీ నుంచి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ అవసరమైన సహాయక చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు.అధికారులందరూ తమ తమ ప్రధాన కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని, అన్ని జిల్లాల్లో 24 గంటల పాటు కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాల్లో నమోదైన వర్షపాతం,



జలాశయాల్లో నీటి నిల్వలు, దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, చేపట్టిన సహాయక చర్యలపై జిల్లా యంత్రాంగాన్ని అడిగి తెలుసుకున్నారు.ఇప్పటికే పలు జిల్లాల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంటూ, ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఎదురైనట్లు సమాచారం అందితే వెంటనే స్పందించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు టామ్‌టామ్ నిర్వహించాలని సూచించారు.పారిశుద్ధ్య పనులను నిరంతరం కొనసాగించాలని, వైద్యారోగ్య శాఖ అధికారులు అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, చెరువులు, కుంటలు, నదుల పరిసర ప్రాంతాలకు ప్రజలు, పశుకాపరులు, మత్స్యకారులు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తోందని తెలిపారు. అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని సారించాలని, వరద ముంపు ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ ఈ ఆర్ అండ్ బి భావ్ సింగ్ , జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఆర్డీవో గంగయ్య,సంబంధిత శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పర్వతగిరి రిజర్వాయ ద్వారా నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే

**పర్వతగిరి, జులై 30 ( వుదయం ప్రతినిధి ):**

పర్వతగిరి మండల కేంద్రంలోని రిజర్వాయర్ వద్ద వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు గురువారం పూజలు నిర్వహించి రిజర్వాయర్ నుంచి కాలువలకు నీటిని విడుదల చేశారు.రైతులకు అన్ని విధాలుగా అందుకుంటూ అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.కాలువకు నీరు వస్తే రైతులకు వ్యవసాయానికి దోహదపడుతుందన్నారు.పర్వతగిరి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందుతుందని అన్నారు. ఎల్ నీవో ప్రభావం ఉన్నప్పటికీ రైతుల బాధలు అర్థం చేసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేస్తున్నామన్నారు.స్థానికంగా కొంత మంది ప్రతిపక్ష నాయకులు రైతులకు తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రైతులకు సహాయం చేయలేని దద్దమ్మలు నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సరైన రీతిలో బుద్ధి చెప్తామన్నారు. రైతులకు అండగా నిలిచేది కాంగ్రెస్‌ప్రభుత్వమే అన్ని పేర్కొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు నాయకులతో, అధికారులతో కలిసి సందర్శించారు.రైతులకు ఇబ్బందులు కలగకుండా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీపీవో కల్పన , తహసీల్దార్ టీ. వెంకటస్వామి, ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్, ఎంపీవో శేషాంజన్, మండల అధ్యక్షులు సావిత్రి,సర్పంచ్ శంకర్,మాజీ జిల్లా ఉపాధ్యక్షులు అనిల్ రావు,గ్రామ శాఖ అధ్యక్షులు రాంచందర్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంకటేశ్వర్ రావు,ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు,సీనియర్ నాయకులు సంపత్,ఇరిగేషన్ అధికారులు, సర్పంచులు,నాయకులు,కార్యకర్తలు.

## ఎస్ఐ లుగా పదోన్నతి పొందిన నర్సింగ రావు అలీముద్దీన్ లకు ఎస్పీ శుభాకాంక్షలు

**జగిత్యాల జులై 30 (వుదయం ప్రతినిధి)**



గొల్లపల్లి కోరుట్ల పోలీస్ స్టేషన్ లలో ఏఎస్ఐలు గా విధులు విధులు నిర్వహిస్తున్న నర్సింగరావు అలీ ముద్దీన్ లు ఎస్ఐ లుగా పదోన్నతి పొందగా గురువారం జిల్లా సుపరింటెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిశారు ఈసందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఎస్ఐ హోదాకు సంబంధించిన స్టార్ చిహ్నాన్ని అలంకరించి పదోన్నతి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పదోన్నతి అనేది కేవలం హోదా పెరగడం మాత్రమే కాకుండా బాధ్యతలు కూడా మరింత పెరుగుతాయన్నారు పెరిగిన బాధ్యతలను క్రమశిక్షణ నిజాయితీ అంకితభావంతో నిర్వహిస్తూ ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసం గౌరవం మరింత పెరిగేలా విధులు నిర్వర్తించాలని సూచించారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వాగులు ఒర్రెలు దాటవద్దు..కలెక్టర్



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాగులు దాటే సాహసం చేయవద్దని జిల్లా కలెక్టర్ కె. హరిత హెచ్చరించారు.గురువారం ఆసిఫాబాద్ మండలంలోని గుండి వాగుతో పాటు అలూరి సమీపంలోని ఆర్అండ్బీ వాగు వరద ప్రవాహాన్ని కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలోని వాగులు, నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయని తెలిపారు.వ్యవసాయదారులు, పశువుల కాపరులు, ప్రజలు వరద నీటిలోకి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉధృత ప్రవాహం ఉన్న వాగులు, వంతెనలు, అల్పస్థాయి కల్వర్టుల వద్ద రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు శాఖల సిబ్బందిని మోహరించి, ఎవరినీ దాటేందుకు అనుమతించవద్దని అధికారులను ఆదేశించారు.గుండి వాగు వద్ద లోలెవల్ వంతెనపై ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించిన కలెక్టర్, అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ 8500 844365 నెంబర్ను సంప్రదించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సంబంధిత అధికారులు ఉన్నారు.

## వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**నిజామాబాద్, జూలై 30 :**

ఏకధాటిగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ భుజంగరావు తెలిపారు. వర్షాల వల్ల జిల్లాలో నెలకొని ఉన్న పరిస్థితులను కంట్రోల్ రూమ్ ద్వారా సమీక్షించడం జరుగుతుందని అన్నారు. భారీ వర్ష సూచనల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పరిస్థితి తలెత్తినా సమర్థవంతంగా ఎదుర్కొనేలా సన్నద్ధంగా ఉండాలని క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందిని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వర్షాల వల్ల ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడినట్లు సమాచారం అందిన వెంటనే అధికారులను అప్రమత్తం చేయాలని కంట్రోల్ రూమ్ సిబ్బందికి సూచించారు. జిల్లాలో ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని తెలిపారు. జిల్లా యంత్రాంగం అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షిస్తున్నామని అన్నారు. వర్షాల వల్ల జిల్లాలో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే, కలెక్టరేట్ లో కొనసాగుతున్న కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్: 08462 – 220183 కు సమాచారం అందించాలని సూచించారు.

## ప్రమాద ప్రాంతాలలో ప్రజల రాకపోకలను నియంత్రించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య**



**మంచిర్యాల/జూలై 30(వుదయం ప్రతినిధి)**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, నదులు, కల్వర్టులు ఇతర ప్రమాద ప్రాంతాల వద్దకు ప్రజలు రాకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల గ్రామపంచాయతీ పరిధిలోని వాగు ప్రవాహాన్ని, శిథిలావస్థలో ఉన్న మండల ప్రాథమికోన్నత పాఠశాలను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న వర్ష పరిస్థితుల దృష్ట్యా ప్రజా సంక్షేమ, రక్షణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. వాగు ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో ప్రజలు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, వాగు ఉధృతి పెరిగిన సందర్భంలో ప్రజలు ఎత్తి పరిస్థితులలోనూ వాగును దాటకుండా అవసరమైన ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జాగ్రత్త చర్యలలో భాగంగా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, వాగు వద్ద ప్రమాదకర పరిస్థితులు ఏర్పడకుండా పంచాయతీ, పోలీస్ సిబ్బంది సమన్వయంతో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. గ్రామంలోని మండల ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి పాఠశాల భవనం ప్రస్తుత స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల విషయంలో ఎలాంటి ప్రమాదం జరగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పాఠశాల భవనం పరిస్థితిపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.

## సదర్మాట్ బ్యారేజ్‌ను సందర్శించిన..కలెక్టర్



**జగిత్యాల జులై 30 (వుదయం ప్రతినిధి)**

భారీ వర్షాల నేపథ్యంలో సదర్మాట్ బ్యారేజ్ కు వస్తున్న వరద ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ జిల్లా సుపరింటెండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ తో కలిసి గురువారం పరిశీలించారు బ్యారేజ్ కు సుమారు 10 వేల క్యూసెక్కుల ఇన్ఫ్లో నమోదవుతుండటంతో మూడు గేట్లను ఎత్తి 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా బ్యారేజ్ కు వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని తెలిపారు నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసి అవసరమైన మేరకు గేట్ల నిర్వహణ చేపడుతున్నామని చెప్పారు బ్యారేజ్ పరిసర ప్రాంతాల ప్రజలు గోదావరి నది ఒడ్డున నివసించే వారు మత్స్యకారులు పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు ఎవరూ నది వాగులు బ్యారేజ్ సమీపంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎవరిని నీటి ప్రవాహాల వద్దకు అనుమతించవద్దని కోరారు వర్షాల నేపథ్యంలో రెవెన్యూ పోలీసు ఇరిగేషన్ విపత్తు నిర్వహణ శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు

## భారీ వర్షాలు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- వరద ప్రాంతాలకు వెళ్లొద్దు.. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి- కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, జూలై 30:**

జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వాగులు, చెరువులు, కాలువలు ఉప్పొంగే అవకాశం ఉన్నందున వరద నీటిని దాటేందుకు ప్రయత్నించవద్దని కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులు భారీ వర్షాల సమయంలో వ్యవసాయ పనులకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన తీగలు, బలహీనమైన చెట్లు, శిథిల భవనాలకు దూరంగా ఉండాలని తెలిపారు.24 గంటలూ అందుబాటులో జిల్లా యంత్రాంగం భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు నిరంతరం పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారని, ప్రజలు అత్యవసర సమయంలో అధికారులను సంప్రదించాలని సూచించారు. సీజనల్



వ్యాధులపై అప్రమత్తత అవసరంవర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. తాగునీటిని కాచి చల్లార్చి లేదా శుద్ధి చేసి మాత్రమే వినియోగించాలని, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు. ప్రతి శుక్రవారం నిర్వహించే "ఫ్రైడే–డ్రైడే" కార్యక్రమంలో భాగంగా నీటి నిల్వలను తొలగించి దోమల వ్యాప్తిని అరికట్టాలని తెలిపారు. జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. భారీ వర్షాలపై కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు అత్యవసర సహాయం అందించేందుకు కలెక్టరేట్ లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 1800 425 1939ను సంప్రదించాలని సూచించారు. కంట్రోల్ రూమ్ సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండి ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తారని తెలిపారు. భీమన్న వాగు, మత్తడి వాగు ప్రాజెక్ట్ పరిశీలన భారీ వర్షాల నేపథ్యంలో తాంసి మండలం భీమన్న వాగు కల్వర్టు ప్రాంతాన్ని, మత్తడి వాగు ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో తాంసి, తలమడుగు తహసీల్దార్లు గణేష్, రాజ్ మోహన్, నీటిపారుదల శాఖ ఈఈ నరేష్, డీఈఈ శ్రీనివాస్ రావు, ఏఈఈ హరీష్‌తో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో కడెం ప్రాజెక్టును సందర్శించి వరద పరిస్థితులను సమీక్షించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్



**నిర్మల్ జిల్లా 30 జూలై 2026 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో మొన్న రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ గురువారం కడెం ప్రాజెక్టును సందర్శించి వరద పరిస్థితులను పరిశీలించారు. ప్రాజెక్టు నీటి మట్టం, ప్రవాహ పరిస్థితులు, లోతట్టు ప్రాంతాల పరిస్థితి, ప్రజల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, రాబోయే రెండు రోజుల పాటు కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు జిల్లా పోలీసు శాఖ అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని తెలిపారు.అలాగే కడెం ప్రాజెక్టు, ఇతర వాగులు, వంకలు, చెరువులు, నీటి ప్రవాహ ప్రాంతాల వద్దకు ఎవరూ వెళ్లరాదని, సెల్ఫీలు లేదా వీడియోలు తీసేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. గొర్రెలు, పశువుల కాపరులు, మత్స్యకారులు నీటి ప్రవాహ ప్రాంతాలకు వెళ్లకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువలను దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని స్పష్టం చేశారు.గ్రామాలు, పట్టణాల్లో పాత ఇళ్లు, గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నివసిస్తున్న వారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ల సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

## భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సూచన

**కాగజ్ నగర్, దహెగాం, పెంచికల్పేట్ పరిసర ప్రాంతాల్లో ముంపు ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపిఎస్**

**పోలీస్ అధికారులకు సిబ్బందికి ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలకు విధుల పట్ల ప్రత్యేక సూచనలు**

**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ జిల్లాలోని వరద ముంపు ప్రాంతాలు, పొంగిపొర్లుతున్న వాగులు, లో లెవెల్ వంతెనల ప్రాంతాలను పరిశీలించి విధుల్లో ఉన్న పోలీస్ అధికారులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాగజ్నగర్, దహెగం, పెంచికల్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వరద ప్రాంతాలు వంతెనలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రమాదకరమైన వంతెనలు పొంగిపొర్లుతున్న వాగుల వద్ద క్షేత్రస్థాయిలో పోలీస్ సిబ్బంది ని నియమించినట్లు ఎస్పీ తెలిపారు. భద్రత చర్యలో భాగంగా ప్రమాదకరమైన ప్రాంతాల్లో ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను ఏర్పాటు చేసి, లైఫ్ జాకెట్స్ లైఫ్ బాయ్స్, రోప్స్ అందుబాటులో ఉంచుకోవాలని వారికి తగిన సూచనలు అందించారు.విధులు ఉన్న ప్రతి పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవంతరాలు తలెత్తకుండా ప్రజలకు సూచించాలని పొంగి పొర్లుతున్న వాగుల వద్ద జనాలు రాకుండా చర్యలు తీసుకోవాలని,



వాగులు వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలకు తెలిపారు. జిల్లాలో ఉన్న వాటర్ ఫాల్స్ కి అనుమతి లేదని ఎవరు కూడా వాటర్ ఫాల్స్ కు వెళ్లే సాహసం చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్నగర్ డిఎస్పీ వాహిదుద్దీన్, కాగజ్నగర్ రూరల్ ఇన్స్పెక్టర్ కుమార స్వామి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సతీష్, ఎస్సైలు రమేష్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు పోలీసు శాఖ సూచనలు – ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ దిగవద్దు.– చేపల వేట కోసం వాగులు, చెరువులు, నదుల వద్దకు వెళ్లవద్దు.– నీటిలో మునిగిపోయిన కల్వర్టులు, వంతెనలు లేదా వాగులను దాటేందుకు ప్రయత్నించవద్దు.– పశువులను మేతకు తీసుకెళ్లే వారు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి.– విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి.– వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు నీటి ప్రవాహాలు, విద్యుత్ తీగల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.– శిథిలావస్థలో ఉన్న లేదా కూలిపోయే ప్రమాదం ఉన్న ఇళ్లలో నివసించవద్దు.– అత్యవసరం కాని దూర ప్రయాణాలను వాయిదా వేసుకోవడం మంచిది.– వాహనాల్లో అనుమతించిన పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దు.– సెల్ఫీలు, రీల్స్ లేదా ఇతర వినోదాల కోసం వరద ప్రాంతాలు, వాగులు, చెరువులు, జలపాతాల వద్దకు వెళ్లి ప్రాణాలను ప్రమాదంలో పెట్టుకోవద్దు.ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే డయల్–100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి పోలీసు సేవలను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు. జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ మరియు ఇతర ప్రభుత్వ శాఖల సూచనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేయాలి :కలెక్టర్

**పెద్దపల్లి, జూలై-30 (వుదయం ప్రతినిధి)**

రామగుండం మున్సిపల్ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను మరింత వేగవంతం చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.గురువారం రామగుండం మున్సిపల్ పరిధిలోని 21వ డివిజన్ వీర్లపల్లి, ఓ.సి.పి – 3 ఏరియా,25వ డివిజన్ వరద ప్రభావిత ప్రాంతాలను రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, అదనపుకలెక్టర్ (లోకల్ బాడీస్), మున్సిపల్ కమిషనర్ రామగుండం అరుణ శ్రీ తో కలిసి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద పరిస్థితులను, నీటి నిల్వను, ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,



ఆర్అండ్ఆర్ కాలనీలో వరదల సమయంలో నీరు ఇళ్లలోకి ప్రవేశించకుండా ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార చర్యలను రూపొందించాలని ఆదేశించారు. ఓసీ–3 ప్రాంతంలో నిలిచిపోయిన వరద నీటిని యంత్రాల సహాయంతో అత్యంత వేగంగా తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నీటి నిల్వల వల్ల ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

## ప్రివెంటివ్ పోలీసింగ్ వైపు కామారెడ్డి పోలీసుల అడుగులు

**'ఆపరేషన్ కవచ్' ద్వారా నిరూపణ, విజయవంతంగా ఏడాది పూర్తి**

**ప్రజలకు రక్షణ కవచంలా, కొండంత ధైర్యంలా...కామారెడ్డి**

**పోలీసుల ఏడాది ఆదర్శ ప్రస్థానం: జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర**

**కామారెడ్డి, జూలై 30 (వుదయం ప్రతినిధి):**

రాత్రి వేళల్లో జగమంతా నిశ్శబ్దంగా నిద్రకు ఉపక్రమిస్తుంది. పగలంతా రెక్కలు ముక్కలు చేసుకుని శ్రమించిన సామాన్యుడు హాయిగా కనుమూసేవేళ అది. కానీ, అదే సమయంలో నల్లని చీకట్లను చీల్చుకుంటూ, కంటిమీద కునుకు లేకుండా కాపలా కాసే రక్షక పోలీసులు రోడ్లపైకి వస్తారు. వర్షం కురుస్తున్నా, చలి వణికిస్తున్నా.. ప్రజల భద్రతే పరమావధిగా రోడ్లపై పహారా కాసే ఖాకీ సైన్యం అది. కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర దిశానిర్దేశంలో ప్రివెంటివ్ పోలీసింగ్ (నేర నియంత్రణ) వ్యూహంతో సరిగ్గా ఏడాది క్రితం 25 జులై 2025 నాడు ప్రారంభమైన "ఆపరేషన్ కవచ్" 24 జులై 2026 నాటికి విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకుంది. ఈ ఏడాది కాలంలో ఈ వినూతన ఆపరేషన్ నేరగాళ్ల గుండెల్లో వణుకు పుట్టిస్తూనే, ప్రజలకు నమ్మకమైన రక్షణ కవచంగా నిలిచింది. ప్రజలు సుఖంగా నిద్రపోవడానికి పోలీసులు రాత్రంతా నిద్రలేని క్షణాలు గడుపుతూ చేసే వాహన తనిఖీలు కేవలం బాధ్యత మాత్రమే కాదు.. అవి ప్రజల ఆస్తి, ప్రాణాలకు, యువత చెడు దారి పట్టకుండా భరోసా ఇచ్చే అభేద్యమైన కోటలుగా నిలిచాయి.ఏడాది కాలంలోని ప్రధాన సంఘటనలు:–గంజాయి నిరోధక చర్యలు:6 NDPS కేసులు నమోదు.18 మంది నిందితుల అరెస్టు.సుమారు 403.405 కిలోల గంజాయి (విలువ సుమారు రూ. 2.01 కోట్లు) స్వాధీనం.అక్రమ రవాణా నిరోధం:–11 అక్రమ ఇసుక రవాణా కేసులు (8 లారీలు, 3 ట్రాక్టర్లు స్వాధీనం).3 అక్రమ పశువుల రవాణా కేసులు నమోదు.3 పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా కేసులు.1 గుట్కా రవాణా కేసు (మొత్తంగా రూ. 43 లక్షల నగదు స్వాధీనం).మోటార్ సైకిళ్లు దొంగతనాలు, ఆయుధాలు అక్రమ వినియోగం రికవరీ:– 18 దొంగిలించిన మోటార్ సైకిళ్లు స్వాధీనం. 5 దేశీయ తుపాకులు, 1 ఎయిర్ గన్ స్వాధీనం.ఆలయ దొంగతనాలు, ఆస్తి నేరాలు, ఏటీఎం దొంగతనం కేసులు ఛేదించబడి అంతర్రాష్ట్ర నేర ముఠాల అరెస్టు.మానవీయ కోణం:–14 ఏళ్ల బాలుడు మానసికముగా ఆందోళన చెంది సైకిల్ పై గమ్యం లేని ప్రయాణం చేస్తుండగా సురక్షితంగా రక్షించి కుటుంబ సభ్యులకు అప్పగింత.ఎన్ఫోర్స్‌మెంట్ వివరాలు:– మొత్తం 5,16,984 వాహనాల తనిఖీలు. 1,19,052 మందిని పాపిలాన్ పరికరం ద్వారా పరిశీలన.209 మంది అనుమానితుల గుర్తింపు.3,572 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు.నేరాల అణచివేత:– అంతర్రాష్ట్ర నేర ముఠాల కార్యకలాపాలు 12 నుండి 2 కి తగ్గింపు.5 మంది అంతర్జిల్లా నేరస్థుల గుర్తింపు.కోట్ల విలువైన గంజాయి రవాణా భగ్నం: యువత భవిష్యత్తుకు రక్ష. ఇలాంటి మెరుపు వేగమే డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కుపాదం మోపడంలోనూ కనిపించింది.నేటి యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్ సంస్కృతిని సమూలంగా తుడిచిపెట్టడమే ధ్యేయంగా పోలీసులు పని చేస్తున్నారు. ఒడిశా నుండి మహారాష్ట్రలోని నాసిక్‌కు పనసపండ్ల వ్యాపారం మాటున తరలిస్తున్న భారీ గంజాయి రవాణాను అడ్డుకోవడానికి ఎస్పీ ఆదేశాల మేరకు ఆపరేషన్ కవచ్ ప్రత్యేక బృందాలు జాతీయ రహదారి–44 పై పక్కా వ్యూహంతో నిఘా పెట్టాయి. క్యాసంపల్లి రాయల్ దాబా వద్ద అనుమానాస్పద వాహనాన్ని ఆపి, పనసపండ్ల కింద దాచిన సుమారు 387.128 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన ఈ గంజాయి విలువ అక్షరాలా కోటి తొంభై మూడు లక్షల రూపాయలకు పైమాటే. స్మగ్లర్లు ఎంత తెలివిగా ప్లాన్ వేసినా కామారెడ్డి పోలీసుల ఆపరేషన్ కవచ్ నిశిత నేత్రాల ముందు తలవంచక తప్పలేదు. అదే విధంగా, నర్సన్నపల్లి చౌరస్తా వద్ద తీవ్రమైన చలిని సైతం లెక్క చేయకుండా రాత్రి డ్యూటీ చేస్తున్న పోలీసులు అనుమానాస్పద ఆటోను తనిఖీ చేసి, సీట్ల క్రింద దాచి తరలిస్తున్న గంజాయిని పట్టుకుని ముగ్గురిని కటకటాల్లోకి నెట్టారు. ఈ తనిఖీలు కేవలం కేసులు పెట్టడానికి కాదు, కొన్ని వందల మంది యువకుల జీవితాలు గంజాయి బారిన పడకుండా, వారి తల్లిదండ్రుల కలలు సాకరం చేయడానికే అని కామారెడ్డి ఆపరేషన్ కవచ్ పోలీసులు నిరూపించారు.అడవి జంతువుల వేటగాళ్ల ముఠా గుట్టురట్టు: ప్రకృతి సంరక్షణనే ధ్యేయంనేరగాళ్లనే కాకుండా అడవి జంతువులను వేటాడే ప్రమాదకర ముఠాల ఆటకట్టించడంలోనూ ఆపరేషన్ కవచ్ విజయవంతమైంది. గాంధారి పోలీసులు రాత్రి వేళ మొండి సడక్ చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతూ, పోలీసులను చూసి పారిపోతున్న వేటగాళ్లను వెంబడించి పట్టుకున్నారు. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సాగిన ఈ ఆపరేషన్‌లో (8) మంది సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకుని, వారి నుండి (5) నాటు తుపాకులు, (1) ఎయిర్ గన్, భారీగా వేట సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణుల మనుగడకు ముప్పు తెచ్చే ఇలాంటి ముఠాల నెట్‌వర్క్ ధ్వంసం చేయడం ద్వారా పోలీసులు పర్యావరణ పరిరక్షణలో తమ నిబద్ధతను ఆపరేషన్ కవచ్ ద్వారా చాటుకున్నారు.యజమానికి తెలియక ముందే దొంగలించిన ట్రాక్టర్ రికవరీ: బాధ్యతాయుత పోలీసింగ్‌కు నిదర్శనంఈ నిరంతర తనిఖీల వెనుక ఉన్న పోలీసుల నిశిత దృష్టికి నిదర్శనంగా నిలిచింది పోసానిపేట ట్రాక్టర్ దొంగతనం ఉదంతం. రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామానికి చెందిన బండి పెంటయ్య అనే రైతు తన ట్రాక్టర్‌ను వ్యవసాయ పొలం షెడ్డు వద్ద ఉంచగా, జైలులో పరిచయమైన ఘరానా దొంగలు గంద్రస్వామి, వడ్ల విజయ్ కుమార్ తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో తాళాలు పగులగొట్టి దాన్ని దొంగిలించారు. కానీ, వారి దురాశ ఎక్కువ సేపు సాగలేదు. సరిగ్గా రెండు గంటల వ్యవధిలో సదాశివనగర్ పద్మజీవాడి ఎక్స్ రోడ్ వద్ద ఆపరేషన్ కవచ్ తనిఖీల్లో ఉన్న గాంధారి ఎస్సై బి. ఆంజనేయులు, వారి సిబ్బంది వెంకటరాములు, హరిలాల్, అహ్మద్ షరీఫ్, రాములు అత్యంత అప్రమత్తతతో ఆ ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. నిందితులను తమదైన శైలిలో విచారించడంతో అసలు దొంగతనం వెలుగులోకి వచ్చింది. ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్ దొంగతనానికి గురైందనే విషయం యజమాని పెంటయ్యకు తెలవక ముందే, పోలీసులు ఆ ఐదు లక్షల విలువైన ట్రాక్టర్‌ను రికవరీ చేసి యజమాని ముందు ఉంచారు.




## అధికారులకు సెలవులు రద్దు, అత్యవసరమైతేనే సెలవులు పెట్టాలి:కలెక్టర్

**అధిక వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి**

**కలెక్టరేట్ లో 08468- 220069 కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

**కామారెడ్డి, జూలై 30 (వుదయం ప్రతినిధి):**

అధిక వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని, అధికారులందరూ అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుంచి టెలికాన్ఫరెన్స్ సమావేశం జిల్లా అధికారులతో నిర్వహించారు. మండలాల వారిగా అధిక వర్షాలతో జరిగిన పరిస్థితులను స్థానిక తహసిల్దార్, ఎంపీడీవో, స్పెషల్ ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ...అధిక వర్షాల వల్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలందరూ అత్యవసరం ఉంటే తప్ప బయటకు రావాలన్నారు. అధికారులందరూ అందుబాటులో ఉండాలని, అత్యవసరం ఉంటే తప్ప అధికారులు సెలవులు పెట్టొద్దన్నారు.కలెక్టరేట్ లో 08468– 220069 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.ఎటువంటి ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకూడదని, అత్యవసర పరిస్థితులలో ప్రజలను రక్షించేందుకు రోప్స్, డ్రోన్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అంటూ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలనీ సూచించారు. చెరువులు, కల్వర్టులు, కుంటలలో నీరు ప్రవాహం రీచ్ అయ్యే అవకాశం ఉన్న దగ్గర సైన్ బోర్డులు పెట్టి చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ హాస్టల్స్ అంగన్వాడి సెంటర్స్, రూఫ్ లీకేజీ ఉన్నట్లయితే ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. వర్షాలకు దెబ్బతిన్న ఇండ్లలో ప్రజలకు నివాసం ఉండకుండా చర్యలు చేపట్టాలనీ అధికారులను ఆదేశించారు. వర్షాలు అధికమై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తే ప్రజలకు రాకపోకలు ఇబ్బంది కలకుండా ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించాలన్నారు. జిల్లా పంచాయతీ శాఖ ద్వారా సెక్రటరీలు ఎంపీవో లు సమన్వయంతో శానిటేషన్ పై ప్రత్యేక చర్యలు తీసుకుంటూ ,నీరు నిల్వ ఉండు ప్రదేశాలలో బ్లీచింగ్ పౌడర్ ఫాగింగ్ నిర్వహించాలన్నారు.వర్షాలు అధికంగా కురుస్తున్నందు వల్ల విద్యుత్ ప్రమాదాల జరిగే అవకాశం ఉన్నందున తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలన్నారు.మెడికల్ ఆఫీసర్స్ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజారోగ్య పరిరక్షణ ధ్యేయంగా కృషి చేయాలన్నారు. అంటూ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాము కాటు, అంటువ్యాధుల, సీజనల్ వ్యాధుల మందులు అందుబాటులో ఉండాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్ వై గిరి, జెడ్పీ సీఈవో చందర్, జిల్లా అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తాసిల్దారులు, స్పెషలాఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.



# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తం

- జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- కంట్రోల్ రూమ్ నెంబర్ 08455-276155



**సంగారెడ్డి, జూలై 30:-ఉదయం:** భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసే ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.

ప్రజల నుండి అందే అత్యవసర ఫిర్యాదులు, సమాచారం, నష్టం వివరాలను వెంటనే స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు చేరవేసి తక్షణ చర్యలు తీసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ప్రజలు భారీ వర్షాల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితులు, వరదలు, రహదారి అంతరాయాలు, చెట్లు కూలిపోవడం, విద్యుత్ సమస్యలు లేదా ఇతర ప్రమాదాలకు సంబంధించిన సమాచారాన్ని 08455 276155 నంబర్‌కు వెంటనే తెలియజేయాలని తెలిపారు.కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించడానికి సిబ్బందిని మూడు షిఫ్టుల్లో నియమించామని, అందిన ప్రతి ఫిర్యాదును రిజిస్టర్‌లో నమోదు చేసి సంబంధిత తహసీల్దార్‌కు వెంటనే పంపించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జిల్లాలోని రెవెన్యూ, పోలీసు, పంచాయతీ రాజ్, మున్సిపల్, విద్యుత్, వైద్య, అగ్నిమాపక తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు అవసరం లేనప్పుడు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వాగులు, చెరువులు, వరద నీటి ప్రవాహాల వద్దకు వెళ్లరాదని, అధికార యంత్రాంగం జారీ చేసే సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాల పురోగతిపై కలెక్టర్ సమీక్ష



**వనపర్తి జులై 30 (ఉదయం ప్రతినిధి)** జిల్లాలో అన్ని కార్యాలయాలు, మండల కార్యాలయాలు ఈ ఆఫీస్ ద్వారా మాత్రమే ఫైళ్ళు పంపించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపిఓ లు, ఎ.పి.యం లతో ఆయా సంక్షేమ పథకాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.అన్ని మండల కార్యాలయాలు ఈ ఆఫీస్‌కు మారాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంపై సమీక్షిస్తూ గుడిసెలు లేని జిల్లాగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం గుడిసెలు ఉన్న పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరి చేస్తుందని ఆయా మండలాలకు లక్ష్యం నిర్దేశించి సర్వే బాధ్యతను ఎంపీడీఓలకు ఇవ్వడం జరిగిందన్నారు. సర్వే ఆఫీసర్ల ద్వారా గుడిసెలు ఉన్న ఇళ్లను సర్వే చేయించి త్వరగా నివేదిక ఇస్తే పరిపాలన మంజూరు ఉత్తర్వులు జారీ చేస్తామని సూచించారు. రెండు మూడు రోజుల్లో సర్వే పూర్తి చేసి చెక్ లిస్ట్ పంపించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయి ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంకా పనులు ప్రారంభించని పేద ప్రజలతో మాట్లాడి ఇంటి నిర్మాణం చేపట్టే విధంగా చూడాలని, అవసరమైన వారికి మహిళా సంఘాల నుండి బ్యాంకు రుణాలు ఇప్పించాలని సూచించారు.ఎస్.ఐ ఆర్ గడువు మరో మూడు రోజులు మాత్రమే మిగిలి ఉందని, ఇంకా పెండింగ్ లో ఉన్న ఎన్యూమరేషన్‌లను త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వని ఓటర్లను గుర్తించి ఫారాలు తీసుకొని డిజిటలైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఒక్క ఓటరు కూడా నా దగ్గరికి రాలేదు .. ఫారం తీసుకోలేదని ఫిర్యాదు రావద్దని హెచ్చరించారు. అదేవిధంగా భూభారతికి సంబంధించి పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఒక్కో తహసిల్దార్ వారిగా పెండింగ్ లో ఉన్న భూభారతి ఫైళ్ళ పై సమీక్ష నిర్వహించారు. ఆగస్టు 7లోగా అన్ని పెండింగ్ ఫైళ్లు క్లియర్ కావాలని, అన్ని ఈ ఆఫీస్ ద్వారా పంపించాలని ఆదేశించారు.

జలసిరి పథకం కింద జిల్లాలో భూగర్భ జలాలు పెంచేందుకు వి.బి.జి.రాంజీ పథకం కింద అన్ని మండలాల్లో నీటి కుంటల ఏర్పాటుకు స్థలం చూసి పనులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. జిల్లాలో 222 నీటి కుంటలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వన మహోత్సవం మొక్కలు నాటి లక్ష్యం పూర్తి చేయాలని సూచించారు.

అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, పి.డి డిఆర్డీఓ ఉమాదేవి, ఆర్డీఓ సుబ్రమణ్యం, డి.పి.ఓ రఘునాథ్ రెడ్డి, డిప్యూటీ సి ఈ. ఒ రామ మహేశ్వర్ రెడ్డి, పి.డి. హౌసింగ్ విటోబా, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, ఎంపీఓలు, ఎ పి యం లు, ఎ.పి.ఒ లు తదితరులు పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ ఎస్సై గోవర్ధన్ బదిలీ

- నూతన ఎస్సైగా వెంకట్ రెడ్డి



**నాగర్ కర్నూల్ రూరల్ జూలై 30 (ఉదయం ప్రతినిధి):** నాగర్ కర్నూల్ నూతన ఎస్సైగా వెంకటరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఆయన గురువారం నాగర్ కర్నూల్ సిఐని మర్యాదపూర్వకంగా కలిసారు. వెంకట్ రెడ్డి ఉప్పునుంతల పోలీస్ స్టేషన్ నుంచి నాగర్ కర్నూల్ కు బదిలీపై వచ్చారు. ఎస్సై గోవర్ధన్ కు ఇంకా పోస్టింగ్ ఖరారు కాలేదు.

## కూతురిపై పలుమార్లు అత్యాచారం



**వికారాబాద్ జిల్లా (ఉదయం పూడూర్ )జులై 31,** వికారాబాద్ జిల్లా,కన్న తండ్రే కామాంధుడిగా మారి తన మైనర్ కూతురిపై పలుమార్లు బలవంతంగా అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హాస్టల్‌లో ఉంటున్న బాలిక కడుపునొప్పితో బాధపడుతూ టీచర్లకు విషయం చెప్పడంతో ఈ దారుణం బయటపడింది.పోలీసుల వివరాల ప్రకారం నిందితుడు జగన్నాథ్ (42) నారాయణఖేడ్‌కు చెందినవాడు. సుమారు 20 సంవత్సరాల క్రితం వికారాబాద్‌కు వచ్చి ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్యకు ఒక కుమారుడు, ఒక కుమార్తె కాగా, రెండో భార్యకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రెండో భార్య మరణించడంతో హాస్టల్‌లో ఉన్న పిల్లలను ఇంటికి తీసుకొచ్చిన సమయంలో మూడో కుమార్తెను మాయమాటలు చెప్పి పలుమార్లు బలవంతంగా అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.ఈ నెల 27న బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడు గురువారం ఇంటి వద్ద పరిస్థితులు తెలుసుకునేందుకు వచ్చిన సమయంలో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు వికారాబాద్ సీఐ రఘుకుమార్ తెలిపారు.

## యాంకీలో కంటైనర్ అంగన్ వాడి కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్



**నారాయణపేట, జూలై 30 (ఉదయం ప్రతినిధి):** నర్వ మండలం జాతీయ స్థాయిలో ఆదర్శ మండలంగా నిలవాలని, ఇక్కడ చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందేలా మన అందరం కలిసి పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక పిలుపునిచ్చారు. గురువారం నారాయణ పేట జిల్లా నర్వ మండలం(యాస్పరేషన్ బ్లాక్) లోని యాంకీ గ్రామంలో నూతన కంటైనర్ అంగన్ వాడీ కేంద్రాన్ని గ్రామ సర్పంచి కల్యాణి తో కలిసి ఆమె ప్రారంభించారు. కేంద్రంలో సరస్వతి మాత చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంగన్ వాడీ కేంద్రంలో ఎంత మంది చిన్నారులు ఉన్నారని?.అందులో శ్యామ్ మ్యామ్ చిన్నారులు ఎంత మంది ఉన్నారని అంగన్ వాడీ టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. అంగన్ వాడీ కేంద్ర ఆవరణలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి చిన్నారి తప్పనిసరిగా విద్యను అభ్యసించాలనీ, ఒక్క విద్యార్థి కూడా చదువు మానేయకుండా చూడడం మనందరి బాధ్యత అని తెలిపారు. చాలా సంవత్సరాలుగా ప్రారంభించాలని భావించిన ఈ అంగన్‌వాడీ కేంద్రం ఈరోజు ప్రారంభం కావడం ఎంతో ఆనందంగా ఉందని కలెక్టర్ తెలిపారు.ఈ కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా, పరిశుభ్రంగా ఉపయోగించుకోవాలన్నారు. ఇది సాధారణ భవనం కాకుండా కంటైనర్ మోడల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రం అని, అందరూ బాధ్యతతో సంరక్షించాలని ఆమె తెలిపారు.. గ్రామాల అవసరాలను యాస్పరేషన్ బ్లాక్ సమన్వయ కర్త దృష్టికి తీసుకు వస్తే అందుబాటులో ఉన్న నిధుల నుంచి వాటికి ఆమోదం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. నర్వ మండలంలోని సర్పంచ్‌లు, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ప్రస్తుతం నర్వ మండలంలో యాస్పరేషన్ బ్లాక్ కింద అనేక భవనాల నిర్మాణాలకు ఆమోదాలు ఇవ్వడం జరిగిందని, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మరుగుదొడ్ల నిర్మాణాలకు కూడా అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ, అధికారులు, సర్పంచ్‌లకు ఆమె సూచించారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులలో పత్తి, వరి వంటి సంప్రదాయ పంటలకు బదులుగా కందులు, పెసర్లు వంటి స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ఈ సందర్భంగా ఆమె రైతులకు సూచించారు. దీనివల్ల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు మెరుగైన ఫలితాలు పొందే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. అంతకు ముందు డీ డబ్ల్యు ఓ,డిపివో, డీఆర్డీవో, తహసిల్దార్, ఎంపిడివో, సిడిపివో లను కలెక్టర్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీ డబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్, డీఆర్డీవో,డిపివో వెంకట్ రాములు, తహసిల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, యాస్పరేషన్ బ్లాక్ సమన్వయ కర్త బాలాజీ, సిడిపివో, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా కిట్ల పంపిణీ

- 12 ఏళ్లగా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం



**పటాన్చెరు ( ఉదయం):** సమాజ సేవ, సుస్థిర అభివృద్ధి పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం గురువారం రుద్రారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్లాస్ మేట్ నోట్ బుక్ లు, క్రేయాన్లు, పెన్నులు, పెన్సిళ్లు, స్టేషనరీ కిట్లతో పాటు భోజనం ప్లేట్లను పంపిణీ చేసింది.చుట్టుపక్కల గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విద్యా అవసరాలకు మద్దతుగా, గత 12 సంవత్సరాలుగా గీతం నిరంతరం నిర్వహిస్తున్న సుదీర్ఘకాల అవుట్‌రీచ్ కార్యక్రమంలో ఇది ఒక భాగం.ఈ పంపిణీ కార్యక్రమం, 'వ్యర్థాల నుంచి సంపద' అనే నినాదంతో గీతం చేపడుతున్న సుస్థిరతా ప్రయత్నం. ఈ కార్యక్రమం ద్వారా, గీతం విద్యార్థులు ఆతిథ్య విభాగం సహకారంతో ప్రాంగణం నుంచి చదివేసిన వార్తాపత్రికలు, పాత రికార్డులు, పుస్తకాలు, ఇతర పునర్వినియోగ కాగితపు సామగ్రిని సేకరిస్తారు. ఈ సామగ్రిని రీసైక్లింగ్ కోసం ఐటీసీ పేపర్ బోర్డ్స్ అండ్ స్పెషాలిటీ పేపర్స్ విభాగానికి అప్పగిస్తారు. వీటిని పేద విద్యార్థులకు పంపిణీ చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత రెండింటినీ గీతం ప్రోత్సహిస్తోంది.ఈ విద్యా కిట్లను గీతం హైదరాబాద్ రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ పీవీ నాగేంద్రకుమార్, గీతం పూర్వ విద్యార్థి, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనూజ్ తదితరులు పంపిణీ చేయగా, ఇక్లబ్ చైర్మన్ మాధవ్ భాస్కర్, ఇక్లబ్ సభ్యులు సహకరించారు.విద్యార్థులు నోట్ బుక్‌లు, స్టేషనరీ కిట్లను ఎంతో ఉత్సాహంగా స్వీకరించి, చిరునవ్వులతో, హృదయపూర్వక కృతజ్ఞతతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు తమ విద్యార్థులకు గీతం, ఐటీసీ అందిస్తున్న నిరంతర మద్దతు, సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ప్రతినిధులు మాట్లాడుతూ, సమాజంపై శాశ్వత సానుకూల ప్రభావాన్ని సృష్టించే కార్యక్రమాల ద్వారా నాణ్యమైన విద్య, పర్యావరణ సుస్థిరత, అర్థవంతమైన సామాజిక భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి గీతం కట్టుబడి ఉందని చెప్పారు.

## డిగ్రీ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తాం

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి
- గజ్వేల్, సిద్దిపేట మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్ భవనాల పరిశీలన
- ఏ ఒక్క విద్యార్థి అడ్మిషన్ వదులుకోవద్దు



**సిద్దిపేట, జూలై 30 (ఉదయం బ్యూరో)** దోస్త్ ఆన్లైన్ ద్వారా గజ్వేల్, సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం తరపున హాస్టల్ సౌకర్యం కల్పిస్తామని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. ప్రైవేట్ గదులు తీసుకునే స్థోమత లేక ఏ ఒక్క నిరుపేద విద్యార్థి అడ్మిషన్ వదులుకోవద్దని, విద్యార్థి, విద్యార్థినులకు వేర్వేరుగా వసతి సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు.గురువారం గజ్వేల్ ఎడ్యుకేషన్ హబ్‌లోని భవనాలను, అలాగే సిద్దిపేటలోని సఖి కేంద్రం వెనుక ఉన్న వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌ను కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి వసతి ఏర్పాట్లను పరిశీలించారు.

గజ్వేల్ ఎడ్యుకేషన్ హబ్‌లో ఏర్పాట్లు గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల కోసం ఎడ్యుకేషన్ హబ్‌లో ఖాళీగా ఉన్న భవనాలను వెంటనే హాస్టల్ కొరకు సిద్ధం చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా, ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్‌లో కొన్ని గదులను కేటాయించి బెడ్స్, వాష్ రూమ్‌లు, కిచెన్ సౌకర్యాలు వేగంగా పూర్తి చేయాలని TG EWIDC ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ సూచించారు.సిద్దిపేట వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ పరిశీలన

సిద్దిపేట మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌ను కేటాయిస్తున్నామని, అందులో ఉన్న చిన్న చిన్న రిపేర్లను తక్షణమే పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం ప్రాంగణంలోని సఖి కేంద్రాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రకళ, గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అనిత, TG EWIDC ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డిడబ్ల్యూఓ శారద, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలనకు అందరి భాగస్వామ్యం అవసరం: కలెక్టర్ ఖుష్బూ గుప్తా




**మహబూబ్ నగర్ జిల్లా ,30జూలై (ఉదయం బ్యూరో):** గురువారం కలెక్టరేట్ సమావేశంలో జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, సరఫరాను పూర్తిగా అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పి .డి జానకి తో కలిసి

పాలమూరు యూనివర్సిటీ, ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీ ప్రతినిధులుతో పాటు వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, పోలీసు, ఎక్సైజ్, విద్యాశాఖ తదితర అధికారులతో నిర్వహించిన నార్కోటిక్స్ అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు.డ్రగ్స్ సరఫరా, వినియోగానికి సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే తెలియ చేయాలని, డ్రగ్స్ నిర్మూలన పై ప్రత్యేక కంట్రోల్ రూమ్ నంబర్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.విద్యార్థుల్లో డ్రగ్స్ వినియోగానికి సంబంధించిన లక్షణాలను గుర్తించేలా అధ్యాపకులు, వార్డెన్లు, భద్రతా సిబ్బందికి అవగాహన ఉండాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పీ డి. జానకి మాట్లాడుతూ, డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు సమాచారం అందితే సంబంధిత వ్యక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైతే డీఅడిక్షన్ కేంద్రాలకు పంపిస్తామని తెలిపారు. ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే యువతను మళ్లీ సాధారణ జీవితంలోకి తీసుకురావచ్చన్నారు. డ్రగ్స్ నియంత్రణ అనేది ఒక్క పోలీసు శాఖ బాధ్యత కాదని, ప్రతి పౌరుడు సమాచారం అందించడంలో భాగస్వామి కావాలని కోరారు. జిల్లాను డ్రగ్ ఫ్రీ మహబూబ్‌నగర్‌గా తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమని పేర్కొన్నారు.జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (DLSA) కార్యదర్శి డి. ఇందిర మాట్లాడుతూ, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (NALSA) అమలు చేస్తున్న డ్రగ్ అవేర్‌నెస్ అండ్ వెల్‌నెస్ నావిగేషన్ పథకం ద్వారా మాదకద్రవ్యాల నిర్మూలనపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యాసంస్థల్లో నిర్వహించే అవగాహన కార్యక్రమాలకు విద్యార్థులందరినీ హాజరయ్యేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్ వినియోగించినట్లు గుర్తించిన విద్యార్థులపై వెంటనే శిక్షాత్మక చర్యలకే పరిమితం కాకుండా, ముందుగా కౌన్సెలింగ్, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడం, అవసరమైతే డీఅడిక్షన్ కేంద్రాలకు తరలించడం వంటి పునరావాస చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పోలీసు శాఖతో పాటు లీగల్ సర్వీసెస్ అథారిటీ, పారాలీగల్ వాలంటీర్లు సమన్వయంతో పనిచేస్తే యువతను డ్రగ్స్ బారినుంచి కాపాడవచ్చని ఆమె పేర్కొన్నారు.ఈ సమావేశంలో, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, వివిధ కళాశాలల ప్రిన్సిపల్లు, ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలల ప్రతినిధులు, పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'చలో బెంగళూరు' పోస్టర్ ఆవిష్కరణ

- BC ఉద్యోగుల సంఘం



**నాగర్ కర్నూల్ రూరల్, జులై 30 (ఉదయం ప్రతినిధి)** బీసీల రిజర్వేషన్లు, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం ఆగష్టు 7న బెంగళూరులో జరిగే 11వ అఖిల భారత OBC మహాసభ పోస్టర్‌ను BC ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్‌లో గురువారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ BC ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు, క్రీమీ లేయర్ ఎత్తివేత, EWS రద్దు ప్రధాన డిమాండ్లు అన్నారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో పాల్గొనాలని జిల్లా అధ్యక్షుడు K. వెంకటేశ్వర్ రావు కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి K. రాజు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కోటాజీ, ఉపాధ్యక్షులు రాసూరి జ్ఞానేశ్వర్, BC సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్, BC విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహేష్ యాదవ్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ నాగేశ్వర్ రావు, ఉపాధ్యక్షులు గోపి, ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మీ నారాయణ, DMHO సంఘం ప్రధాన కార్యదర్శి కొట్ర నిరంజన్ తదితరులు పాల్గొన్నారు

## వరి సాగుపై అప్రమత్తం.. నీటి భరోసా ఉంటేనే పంట

- ఎల్‌నినో ప్రభావంతో వర్షాలపై అనిశ్చితి.. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచన



**గద్వాల,జూలై 30 (ఉదయం బ్యూరో):** ప్రస్తుతం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నప్పటికీ, ఎల్‌నినో ప్రభావంతో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు పంటల ఎంపికలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. పంట కాలమంతా సాగునీటి లభ్యతపై పూర్తి భరోసా ఉన్న రైతులు మాత్రమే వరి సాగు చేపట్టాలని, మిగిలిన వారు తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంచుకోవడం ద్వారా నష్టాలను నివారించవచ్చని పేర్కొన్నారు.

గురువారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ మాట్లాడుతూ, బోర్లు, బావులు లేదా ఇతర నీటి వనరుల ద్వారా నిరంతరాయంగా సాగునీరు అందే పరిస్థితి ఉన్నప్పుడే వరి సాగుకు ఉపక్రమించాలని స్పష్టం చేశారు. తగినంత నీటి వనరులు లేని రైతులు వరికి బదులుగా ప్రత్యా మ్నాయ పంటలను ఎంచుకోవడం ప్రస్తుత పరిస్థితుల్లో శ్రేయస్కరమని సూచించారు. వ్యవసాయ క్షేత్రాల్లో పంట కుంటల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని, వర్షాకాలంలో వచ్చే నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా వర్షాభావ పరిస్థితుల్లో పంటలను కాపాడుకోవచ్చని తెలిపారు.జిల్లాలో కూరగాయల సాగుతో పాటు ఆయిల్ పామ్ తోటల విస్తీర్ణాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులను నిరంతరం గమనిస్తూ, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనల మేరకు పంటల ఎంపిక, సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు.



## ధరూర్ సర్పంచ్‌కు ఎమ్మెల్యే బండ్ల భరోసా

- సర్పంచ్ విజయ్‌ను నివాసంలో పరామర్శించిన గద్వాల శాసనసభ్యుడు

**గద్వాల జూలై 30 (ఉదయం బ్యూరో)** ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలపాలైన ధరూర్ గ్రామ సర్పంచ్ డి.ఆర్. విజయ్‌ను గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గురువారం పరామర్శించారు. ఇటీవల కాలు జారి పడటంతో విజయ్ చేతికి తీవ్ర ఫ్రాక్చర్ అయి చికిత్స పొందుతున్నారు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల, నేరుగా సర్పంచ్ నివాసానికి చేరుకుని ఆయన ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం చికిత్స అందిస్తున్న వైద్యులతో మాట్లాడి, బాధితుడికి అవసరమైన మెరుగైన వైద్య సేవలు సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు. విజయ్ త్వరగా కోలుకోవా లని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, నాయకుడు అజయ్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**సిద్దిపేట/(జగదేవపూర్), జూలై 30 (ఉదయం ప్రతినిధి):** మండలంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ తీవ్ర అప్రమత్తంగా ఉండాలని జగదేవపూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

భారీ వర్షాల కారణంగా చెరువు కట్టలు తెగడం, మత్తడులు పొంగిపొర్లడం, రోడ్లు దెబ్బతినడం, లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం వంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయని తెలిపారు. అలాగే విద్యుత్ స్తంభాలు, చెట్లు కూలిపోవడం, తీగలు తెగిపడే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని, ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు.

చెరువులు, వాగులు, పొంగిపొర్లుతున్న మత్తడులు, వరద నీరు ప్రవహించే రోడ్లు మరియు కల్వర్టుల వద్దకు ఎవరూ వెళ్లకూడదు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ప్రమాదకర ప్రాంతాల వైపు వెళ్లకుండా కుటుంబ సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నేలపై కూలిన విద్యుత్ స్తంభాలు లేదా తెగిపడిన తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకకూడదు, వాటికి దూరంగా ఉండాలి. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడినా, వరద నీటిలో చిక్కుకున్నా వెంటనే ''డయల్ 100' ద్వారా జగదేవపూర్ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కృష్ణారెడ్డి కోరారు.

## భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి



- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలి

**నాగర్ కర్నూల్, జూలై 30 (ఉదయం ప్రతినిధి):** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, లోతట్టు ప్రాంతాలు, వరద ముంపు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, చెరువులు, వాగులు, రిజర్వాయర్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అత్యవసర సేవలు 24 గంటలూ అందుబాటులో ఉండాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

**నాగర్‌కర్నూల్ కలెక్టర్ వివరణ**

నాగర్‌కర్నూల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ, ఈ నెలలో సాధారణం కంటే 38 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, కానీ గత రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. అమ్రాబాద్ ఏజెన్సీ, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని, అవసరమైన చోట బృందాలను సిద్ధంగా ఉంచామని చెప్పారు. వర్షాకాల వ్యాధుల నివారణకు వైద్య శిబిరాలు, తాగునీటి శుభ్రత చర్యలు చేపట్టామని, వర్షాభావం దృష్ట్యా రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు .ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చెన్నయ్య, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పేటను డ్రగ్స్ రహిత జిల్లాగా నిర్మిద్దాం



- తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఎస్పీ పివి. పద్మజ
- జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట జూలై 30 (ఉదయం ప్రతినిధి)** డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల నుండి సమాజాన్ని విముక్తి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా ముందుకు రావాలని తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఎస్పీ పి.వి. పద్మజ, జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ లు పిలుపునిచ్చారు.తెలంగాణ ఈగల్ ఫోర్స్, నారాయణపేట జిల్లా పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో డ్రగ్స్ వ్యతిరేకంగా భారీ అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఎస్పీ పి.వి. పద్మజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలన కోసం విస్తృత స్థాయిలో దాడులు నిర్వహిస్తూ సమర్థవంతంగా పనిచే స్తోందన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. నారాయణపేట జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువత తమ జీవిత లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. స్నేహితులు లేదా పరిచయస్తుల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు తెలిసినా, విక్రయిస్తున్నట్లు గమనిం చినా వెంటనే 1908 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా సమీప పోలీసు అధికారులకు సమాచారం అందించాలని కోరారు.జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక మాట్లాడుతూ మాదకద్రవ్యాల విషయంలో ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దని విద్యార్థులకు సూచించారు. ఎవరైనా డ్రగ్స్ వినియో గిస్తున్నా లేదా విక్రయిస్తున్నా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలనిసూచించారు.జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూరాష్ట్ర ఈగల్ ఫోర్స్ బృందం డ్రగ్స్ నిర్మూ లన కోసం నిరంతరం ప్రత్యే క దాడులు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజలు, ముఖ్యంగా యువత, మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.

ఈ కార్య క్రమంలో డీఎస్పీలు నల్లపు లింగయ్య, తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఉమ్మడి మహబూబ్‌నగర్ ఇన్‌చార్జి డీఎస్పీ బుచ్చయ్య, డీఎంహెచ్‌వో జయ చంద్ర మోహన్, సీఐలు శివశం కర్, రామ్‌లాల్, సైదులు, భగవంత్ రెడ్డి, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సుమారు 1000 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో రహదారులపై పడిపోయిన చెట్లను వెంటనే తొలగించిన జగిత్యాల పోలీసులు..

## ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా రాకపోకలు పునరుద్ధరణ...






జగిత్యాల జులై 30 (వుదయం ప్రతినిధి) జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలుచోట్ల రహదారులపై చెట్లు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది సమాచారం అందుకున్న వెంటనే జగిత్యాల జిల్లా పోలీసులు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని చెట్లను తొలగించి ట్రాఫిక్‌ను యథావిధిగా పునరుద్ధరించారు బుగ్గారం పోలీస్ స్టేషన్ పరిదిలోని గంగాపూర్ గ్రామంలో రహదారిపై చెట్టు కూలిపోవడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చెట్టును తొలగించి వాహనాల రాకపోకలకు మార్గాన్ని క్లియర్ చేశారు పెగడపల్లి--రామడుగు ప్రధాన రహదారిపై భారీ చెట్టు కూలిపోవడంతో బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు అలాగే కొండగట్టు మండలం రాజారం గ్రామ సమీపంలోని హైవే రహదారిపై రెండు చెట్లు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సంబంధిత శాఖల సిబ్బందితో కలిసి చెట్లను తొలగించి హైవేను పూర్తిగా క్లియర్ చేశారు భారీ వర్షాల సమయంలో అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు చేయవద్దని రహదారులపై చెట్లు విద్యుత్ స్తంభాలు లేదా ఇతర అడ్డంకులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్--100కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు



# కల్లూరు గ్రామ వాగు బ్రిడ్జిపై పేరుకుపోయిన గుర్రపు డెక్క/కలుపు తొలగింపు...

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన...

కోరుట్ల జులై 30 (వుదయం ప్రతినిధి) కోట్ల మండలం కల్లూరు గ్రామపంచాయతీ పరిధిలో కోరుట్ల రాయికల్ ప్రధాన రహదారిపై గలవాగు బ్రిడ్జిపై ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నీటి ప్రవాహానికి అడ్డంకిగా పేరుకుపోయిన గుర్రపుడెక్క కలుపు ఇతర చెత్తను తేదీ 30 7 2026 గురువారం జెసిబి సహాయంతో పూర్తిగా తొలగించారు బ్రిడ్జిపై పేరుకుపోయిన చెత్తను తొలగించడం ద్వారా వర్షపు నీటి ప్రవాహం సాఫీగా సాగర చర్యలు చేపట్టారు ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా వాగులు బ్రిడ్జిల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని వరద నీటిని దాటే ప్రయత్నం చేయవద్దని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో కోరుట్ల సర్పంచ్ లక్ష్మీనారాయణ ఎంపీడీవో వోదెల రామకృష్ణ కల్లూరు గ్రామ సర్పంచ్ చిట్నేని లత రమేష్ ఉపసర్పంచ్ జంగస్వామి వార్డు సభ్యులు శ్రీధర్ పంచాయతి కార్యదర్శి శ్రీరాముల సరిత పోలీసు సిబ్బంది గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# భారీ వర్షాల నేపథ్యంలో యామాపూర్ ఫకీర్ కొండాపూర్ గ్రామాల వాగును పరిశీలలించిన...

## జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్



ఇబ్రహీంపట్నం జులై 30 (వుదయం ప్రతినిధి) భారీ వర్షాల కారణంగా ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్ ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వాగును జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ తో కలిసి గురువారం పరిశీలించారు వాగులో ప్రవాహ పరిస్థితులను పరిశీలించి ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు వర్షాల కారణంగా వాగుల ప్రవాహం ఎక్కువ ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు వాటిని దాటేందుకు ప్రయత్నించవద్దని సూచించారు లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చోట ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు ప్రమాదకర ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి పోలీసు రెవెన్యూ పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పని చేసి ప్రజల ప్రాణాలకు ఎలాంటి ముప్పు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని అదేవిధంగా నది ప్రవాహ ప్రాంతాలను చూడడానికి ప్రజలు రావద్దని అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ కు వెంటనే సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు ఈ పరిశీలనలో తహసీల్దార్ ఎంపిడివో సంబంధిత శాఖల అధికారులు రెవెన్యూ పోలీసు పంచాయతీరాజ్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు

# వరుణయాగంతో లోకకల్యాణ సంకల్పం.. గుడి చెరువు బండ్ పార్క్ ప్రారంభం

- ♦ సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని మంత్రుల ఆకాంక్ష.
- ♦ భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, వరుణయాగానికి శ్రీకారం.
- ♦ రూ.12 కోట్లతో అభివృద్ధి చేసిన గుడి చెరువు బండ్ పార్క్ ప్రారంభం.
- ♦ బస్‌స్టాండ్ ఆధునీకరణ పనులకు శ్రీకారం..







- వేములవాడ--బాసర కొత్త బస్సు ప్రారంభం.

వేములవాడ, జూలై 30 (వుదయం ప్రతినిధి ):రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆకాంక్షించారు. జిల్లా పర్యటనలో భాగంగా గురువారం వేములవాడకు వచ్చిన మంత్రులకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు పూర్ణకుంభంతో మంత్రులకు స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, సంజయ్ కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఇదే సందర్భంగా శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని ఏకాంతంగా నిర్వహించారు. జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు సత్వర సద్యఃసువృష్టి కోసం నిర్వహించనున్న ఋశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణయాగం, వరుణ పర్జన్య జపానుష్ఠానాలు, హవనాలు, సంతత ధారాభిషేక కార్యక్రమాలకు మంత్రులు యాగశాలలో అధికారికంగా శ్రీకారం చుట్టారు. భీమేశ్వర సదన్ ఈశాన్య మూలలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతను ప్రత్యేక పూజలతో ప్రారంభించి, అక్కడ ఏర్పాటు చేసిన వసతి గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ వరుణయాగం కేవలం ఆధ్యాత్మిక క్రతువు మాత్రమే కాదని, లోకకల్యాణం కోసం నిర్వహించే మహోన్నత వైదిక సంప్రదాయమని పేర్కొన్నారు. సమృద్ధిగా వర్షాలు కురిస్తే చెరువులు, కుంటలు, జలాశయాలు నిండిపోవడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి రైతులకు సాగునీరు సమృద్ధిగా లభిస్తుందని అన్నారు. రైతాంగం ఆర్థికంగా బలోపేతమై రాష్ట్ర వ్యవసాయరంగం మరింత అభివృద్ధి చెందుతుందని, తాగునీటి సమస్యలు పరిష్కారమవడంతో పాటు పర్యావరణ సమతుల్యత కూడా నెలకొంటుందని పేర్కొన్నారు. తెలంగాణ సస్యశ్యామలంగా వెలుగొందాలని ఆకాంక్షిస్తూ ఈ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రులు, ప్రభుత్వ విప్, ప్రజాప్రతినిధులు కలిసి శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ గుడి చెరువులో రూ.12 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు, బండ్ పార్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నటరాజ విగ్రహం, సప్తమాతృకల విగ్రహాలు, గార్డెన్, మొక్కలు, భారీ శివుడి విగ్రహాన్ని పరిశీలించారు. అదేవిధంగా వేములవాడ బస్‌స్టాండ్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేసి, వేములవాడ--బాసర మధ్య నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో రమాదేవి, అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్డీవో కేఎస్‌బీ కుమారి, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# వైశ్య వైభవ రత్న అవార్డుకు ఎంపికైన నల్మాస్ ప్రభాకర్‌కు ఘన సన్మానం

మంథని జూలై 30: వుదయం ప్రతినిధి

పెద్దపెల్లి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు నల్మాస్ ప్రభాకర్ గత 25 సంవత్సరాలుగా వైశ్య సంఘం ద్వారా, అలాగే వివిధ సామాజిక వేదికల ద్వారా వైశ్యులు ఇతర సామాజిక వర్గాల అభ్యున్నతి కోసం అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా హైదరాబాద్‌కు చెందిన లలిత కళా సమాఖ్య (సామాజిక--సాంస్కృతిక సేవా సంస్థ) ప్రతిష్ఠాత్మక వైశ్య వైభవ రత్న బిరుదుతో పాటు సువర్ణ కంకణం, బంగారు పతకం అందించి సత్కరించేందుకు ఎంపిక చేసింది.

ఈ సందర్భంగా రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, పొన్నూరు మాజీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ జెడ్పీటీసీ గంద్ర వెంకటరమణ రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బుచ్చన్న, యూత్ కాంగ్రెస్ నాయకుడు రావిగంటి సతీష్ తదితరులు నల్మాస్ ప్రభాకర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, సమాజ సేవలో నల్మాస్ ప్రభాకర్ అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. "వైశ్య వైభవ రత్న" అవార్డుకు ఆయన ఎంపిక కావడం జిల్లా ప్రజలకు, ముఖ్యంగా వైశ్య సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు.

# ప్రమాదాలకు నిలయంగా వేములవాడ--సిరిసిల్ల రహదారి

- రేణుక ఎల్లమ్మ ఆలయ మలుపు వద్ద వరుస ప్రమాదాలు.. ఒకరి మృతి.
- బ్యారికేడ్లు, హెచ్చరిక బోర్డులు లేక భక్తులు, ప్రయాణికుల ప్రాణాలు గాల్లో...
- ఇంకెంత మంది బలైతే అధికారులు మేల్కొంటారు..? ప్రజల్లో ఆగ్రహం.
- తక్షణమే భద్రత చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్.



వేములవాడ, జూలై 30 (వుదయం ప్రతినిధి) : వేములవాడ--సిరిసిల్ల ప్రధాన రహదారిపై తిప్పాపూర్ సమీపంలోని రేణుక ఎల్లమ్మ ఆలయానికి వెళ్లే ప్రమాదకర మలుపు నిత్యం ప్రాణాలను బలిగొంటున్నా సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతోంది, ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రుల పాలయ్యారు, అయినప్పటికీ ఈ ప్రమాదకర ప్రాంతంలో శాశ్వత భద్రతా చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు, భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్న అనంతరం భీమేశ్వర ఆలయం, అక్కడి నుంచి తిప్పాపూర్‌లోని రేణుక ఎల్లమ్మ ఆలయానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు చేరుకుంటారు, అయితే ప్రధాన రహదారి నుంచి ఆలయానికి వెళ్లే మూలమలుపు అత్యంత ప్రమాదకరంగా ఉండటంతో ప్రతి రోజు ప్రాణభయంతోనే ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది, ఈ మలుపు వద్ద బ్యారికేడ్లు, డివైడర్ సూచికలు, రిఫ్లెక్టివ్ హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, ఫ్లాషింగ్ సిగ్నల్ లైట్లు వంటి కనీస భద్రతా ఏర్పాట్లు లేకపోవడంతో ఎల్లమ్మ ఆలయానికి వెళ్లే భక్తులు, స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఎదురుగా వచ్చే వాహనాలు ఒక్కసారిగా కనిపించడంతో ఢీకొనే ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని చెబుతున్నారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందడం, పలువురు తీవ్రంగా గాయపడడం ఈ మలుపు ఎంత ప్రమాదకరమో మరోసారి రుజువు చేసింది, అయినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలు కోల్పోయిన తర్వాత స్పందించడం కాకుండా, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రేణుక ఎల్లమ్మ ఆలయ మలుపు వద్ద శాశ్వత బ్యారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు స్పీడ్ బ్రేకర్లు, రిఫ్లెక్టివ్ హెచ్చరిక బోర్డులు, ఫ్లాషింగ్ సిగ్నల్ లైట్లు, డివైడర్ సూచికలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అవసరమైతే ట్రాఫిక్ నియంత్రణ చర్యలు కూడా చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరో ప్రాణనష్టం జరిగే వరకు అధికారులు ఎదురుచూస్తారా..? లేక వెంటనే స్పందించి ఈ ప్రమాదకర మలుపును సురక్షితంగా మారుస్తారా..? అనే ప్రశ్నకు సంబంధిత శాఖలు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు, భక్తులు, ప్రజాప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రమాదకర శిథిల భవనాలు నేలమట్టం


- ప్రజల భద్రతే ముఖ్యం
- మున్సిపల్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి




ధర్మపురి, జులై 30(వుదయం ప్రతినిధి):పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల భద్ర తకు అత్యంత ప్రాధాన్యత ఇస్తు న్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి స్పష్టం చేశా రు. వర్షాల వల్ల ఎలాంటి ప్రమా దాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా ధర్మపురి పట్ట ణంలో శిథిలావస్థకు చేరి, ప్రమా దకరంగా మారిన భవనాలను పురపాలక శాఖ అధికారులచే కూల్చివేసినట్లు తెలిపారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకే ఈ నివారణ చర్యలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ పట్టణంలో ని పలు వార్డుల్లో పర్యటించి, వర్షాల వల్ల తలెత్తిన పరిస్థితు లను క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలించారు. అనంతరం స్థాని క కస్తూర్బా పాఠశాలను సంద ర్శించి ఆవరణలో చేరిన వర్షపు నీటిని పరిశీలించారు. వెంటనే డ్రైనేజీ సదుపాయం ద్వారా నీటిని బయటకు పంపాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా తక్షణ చర్య లు తీసుకోవాలని అధికారుల ను ఆదేశించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో ప్రమాదక రంగా ఉన్న చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని సూచిం చారు. పాఠశాలలో ఉ పాధ్యా యుల హాజరు పట్టికను, విద్యా ర్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి న ఆమె, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, భోజ నం విషయంలో రాజీ పడకూడ దని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు కౌన్సిలర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలి



పెద్దపల్లి, జూలై-30 (వుదయం ప్రతినిధి) గత 48 గంటలుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, రానున్న 24 గంటల పాటు రెడ్ అలర్ట్ నేపథ్యంలో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండి ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. గురువారం ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ లతో కలిసి భారీ వర్షాల పరిస్థితిపై జిల్లా అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు.

సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, జిల్లాలోని ఒక్క చెరువు కూడా గండి పడకుండా లేదా తెగిపోకుండా సాగునీటి శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా సాగునీటి శాఖ అధికారి ఆధ్వర్యంలో లస్కర్లు, సహాయ ఇంజినీర్లు అందరూ క్షేత్రస్థాయిలోనే ఉండి పూర్తి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) చెరువులను పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలతో కలిసి నిరంతరం పరిశీలించాలని సూచించారు. చెరువుల్లో గండ్లు, నీటి పొంగిపొర్లడం లేదా ప్రమాదకర పరిస్థితులు కనిపించిన వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించి అత్యవసర నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

నీట మునిగిన కాజ్‌వేలు, లోతట్టు రహదారులను వెంటనే రాకపోకలకు మూసివేయాలని, అలాంటి ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలు, పోలీసు సిబ్బందిని మోహరించి ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వర్షాల వల్ల దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్లను వెంటనే గుర్తించి అత్యవసర మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్లు వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇళ్లు, పశువుల నష్టం వంటి ఘటనలను వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిహార ప్రతిపాదనలు సిద్ధం చేసి ట్రెజరీకి పంపించి బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న 24 గంటల పాటు రెడ్ అలర్ట్ కొనసాగనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. గ్రామ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్‌పర్సన్లు తదితర స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

నీట మునిగిన ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించి, అక్కడ ఆహారం, తాగునీరు, వసతి, తదితర అన్ని మౌలిక సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. అలాగే శిథిలావస్థలో ఉన్న పాత ఇళ్లను వెంటనే గుర్తించి వాటిలో నివసిస్తున్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్‌పీడీసీఎల్) అధికారులు విద్యుత్ సరఫరాపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించి, దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థలను అత్యవసరంగా పునరుద్ధరించాలని మంత్రి ఆదేశించారు.

గోదావరి నదీ పరివాహక ప్రాంతాలు, సరిహద్దు మండలాలు, గ్రామాల్లో ప్రత్యేక అప్రమత్తత పాటించాలని, చేపల వేట, పశువులను మేపడం లేదా ఇతర ప్రమాదకర కార్యకలాపాల కోసం ఎవరూ నదిలోకి వెళ్లకుండా విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న లేదా రాకపోకలకు అంతరాయం కలిగిన రహదారులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఏవైనా అత్యవసర సంఘటనలు జరిగిన వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో గంగయ్య, సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## వర్షాకాలంలో.. ఆరోగ్యంగా..!



కాలం మారుతున్న కొద్దీ వివిధ రకాల ఇన్ఫెక్షన్లు మన శరీరంపై దాడి చేస్తుంటాయి. వాటిని సమర్థంగా ఎదుర్కోవాలంటే రోగనిరోధక వ్యవస్థను దృఢంగా ఉంచుకోవాలి. ఈ క్రమంలోనే ఆయా కాలాల్లో లభించే పండ్లు, కాయగూరలు తీసుకోవడంతో పాటు ఆహార నియమాల్లోనూ పలు మార్పులు–చేర్పులు చేసుకోవడం అవసరం అంటున్నారు పోషకాహార నిపుణులు. ఈ క్రమంలో– ఈ చిటపట చినుకుల కాలంలో ఏయే పదార్థాలు తీసుకోవాలి.. ఫలితంగా ఆరోగ్యానికి చేకూరే ప్రయోజనాలేంటి? తదితర విషయాల గురించి తెలుసుకుందాం రండి.. వర్షాకాలంలో తీగ జాతికి చెందిన సొరకాయ, గుమ్మడి, కాకర, బీరకాయలతో పాటు క్యారట్, చిలగడదుంప, చేమదుంప.. వంటి దుంప జాతికి చెందిన కాయగూరల్ని ఆహారంగా తీసుకోవాలి. ఇవన్నీ జీర్ణాశయంలో మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేయడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడతాయట. వర్షాకాలంలో రాగి జావ, రాగి రొట్టె, రాగులతో తయారుచేసుకునే అప్పడాలు కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చు అంటున్నారు పోషకాహార నిపుణులు. అలాగే సామలు, కొర్రలు.. వంటి చిరుధాన్యాలు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. ఈ క్రమంలో వీటితో ఆయా ప్రాంతాల్లో లభించే సంప్రదాయ వంటకాల్ని తయారుచేసుకొని పెరుగు, బటర్‌తో ఆరగించచ్చు. ఇక అన్నం, జొన్నలు, గోధుమలను ఏ సీజన్‌లోనైనా తీసుకోవచ్చు. కొంతమంది వర్షాకాలంలో మాంసం, చేపలు తినడానికి ఇష్టపడరు. ఈ క్రమంలో– ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజాలతో నిండి ఉన్న పప్పు ధాన్యాలు వర్షాకాలంలో ఆరోగ్యానికి కావాల్సిన పోషకాలన్నీ అందిస్తాయి. ఇక వీటిలోనూ మొలకెత్తినవి తీసుకుంటే మరీ మంచిదంటున్నారు నిపుణులు. పప్పులతో తయారుచేసుకునే వంటకాలు, పప్పులన్నీ కలిపి తయారుచేసే సబ్జీ, అప్పడాలు.. ఇలా ఎవరి ప్రాంతానికి తగినట్లుగా వారు సరికొత్త వంటకాలు తయారుచేసుకొని తీసుకోవచ్చు. ఇక ఈ సీజన్‌లో ఉలవలు, అలసందలు మరీ మంచివి. ఈ రెండు పప్పు ధాన్యాలు చర్మ ఆరోగ్యానికి, కేశ సంరక్షణకు తోడ్పడతాయట. మనం తీసుకునే ఆహారంలో విటమిన్ 'డి', అత్యవసర కొవ్వులుండేలా చూసుకోవాలి. ఎందుకంటే అత్యవసర కొవ్వులు రక్తంలో చక్కెర స్థాయుల్ని క్రమబద్ధీకరించడానికి తోడ్పడతాయట. ఇక విటమిన్ 'డి' రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా, ఎముకలు బలంగా ఉండడానికి దోహదం చేస్తుందంటున్నారు నిపుణులు.

## చిరుతిండ్లు తినేద్దాం

ఆరోగ్యం కోసం వ్యాయామశాల వైపు ఎంత మందని చూడగలరు. వర్కవుట్లు అందరికీ వర్కవుట్ అయ్యే విషయం కాదు. మరి ఆరోగ్యంగా ఉండాలంటే చిరుధాన్యాలను నమ్ముకోవాలని సూచిస్తున్నారు నిపుణులు. ఖరీదైన సప్లిమెంట్స్ కాకుండా కాయగూరలు, ఆకుకూరలు, పండ్లు తీసుకుంటే... భారీ కసరత్తులు చేయకుండానే ఆరోగ్యంగా ఉండొచ్చని సలహా ఇస్తున్నారు. ఇందుకోసం ప్రతిరోజూ ఆహారంలో అధిక ప్రొటీన్ ఉండేలా చూసుకోవడంతో పాటు సమతుల ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని చెబుతున్నారు. స్నాక్స్ అనగానే బిస్కెట్లు, చాక్కెట్లు, కుర్‌కురే, చిప్స్, రస్నాలు గుర్తుకువస్తాయి. ఇవి నాలుకను ఎంత సంతోషపెడతాయో, ఆరోగ్యానికి అంత చేటుచేస్తాయన్నది జగమెరిగిన సత్యం. గుండె నాళాల్లో రక్త సరఫరాకు అంతరాయం కలిగించి, కొవ్వు పేరుకునేలా చేస్తాయి. తద్వారా హృదయ సంబంధ రోగాలకు బీజాలు వేస్తాయి. వాటికి ప్రత్యామ్నాయంగా అదే ఆకారంతో రుచికి ఏ మాత్రం తీసిపోకుండా రాగి, జొన్న వంటి చిరుధాన్యాలతో చిప్స్, బిస్కెట్లు లభ్యమవుతున్నాయి. చక్కెర వాడకుండా తాటి బెల్లంతో అదే తీపిదనాన్ని, రుచిని కోల్పోకుండా తయారవుతున్న స్నాక్స్ దొరికేస్తున్నాయి. ఈ 'చిరు'తిళ్లను తినడం వల్ల ఆరోగ్యాన్ని సంపాదించుకోవచ్చు. అలాగే సిరిధాన్యాలతో తయారుచేసిన నూడుల్స్, స్నాక్స్, నూకలు మార్కెట్‌లో



లభ్యమవుతున్నాయి. ఆహారపదార్థాలు ఒక్కసారిగా మార్చకుండా రోజూ చేసుకునే ఆహారంలోనే చిన్న చిన్న మార్పులతో ప్రారంభించి అలవాటు చేసుకుంటూ వెళ్లాలి. ఒకరోజు రాగిసంకటి, ఒకరోజు జొన్నలు. చిరుధాన్యాలు చేసే మేలు అంతా ఇంతా కాదు. వారానికి ఒకసారి చిరుధాన్యాలతో చేసిన వంటకాలు ప్రారంభించి ప్రతిరోజూ వంటలో చిరుధాన్యాలకు కొంత చోటివ్వడంతో అనతికాలంలోనే ఆరోగ్యంలో, శరీరాకృతిలోనూ ఎంతో మార్పును గమనించవచ్చు.

## ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అంటే ఏమిటి..

ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు శరీరానికి అత్యంత అవసరమైన ఆరోగ్యకరమైన కొవ్వులలో ఒకటి. ఇవి మెదడు పనితీరు, గుండె ఆరోగ్యం, శరీర కణాల పనితీరుకు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే శరీరం ఈ ముఖ్యమైన కొవ్వులను స్వయంగా తయారు చేసుకోలేదు. అందుకే ఆహారం ద్వారా తప్పనిసరిగా తీసుకోవాలి. సమతుల్య ఆహారంలో ఒమెగా 3 సమృద్ధిగా ఉండే పదార్థాలను చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు శరీరంలో వాపులను తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఇవి కీలక పాత్ర పోషిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇవి మెదడు ఆరోగ్యానికి కూడా ఎంతో ఉపయోగపడతాయి. అందుకే రోజువారీ ఆహారంలో ఒమెగా 3 అధికంగా ఉండే ఆహారాలను చేర్చాలని నిపుణులు సూచిస్తున్నారు. సాల్మన్ చేప ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లకు అత్యుత్తమ వనరులలో ఒకటి. ఇందులో ఒమెగా 3తోపాటు ప్రొటీన్, పొటాషియం, సెలీనియం వంటి ముఖ్యమైన పోషకాలు కూడా సమృద్ధిగా ఉంటాయి. క్రమం తప్పకుండా చేపలు తినే వారికి ఇది మంచి ఎంపికగా నిలుస్తుంది. చియా గింజలు కూడా ఒమెగా 3కి అద్భుతమైన వనరు. వీటిని స్మూతీలు, మిల్క్‌షేక్‌లు, పెరుగు లేదా ఓట్స్‌లో కలిపి తీసుకోవచ్చు. అలాగే ధాన్యాలకు ప్రత్యామ్నాయంగా కూడా వీటిని ఉపయోగించవచ్చు. చిన్న పరిమాణంలోనే ఎక్కువ పోషకాలు అందించే గింజలలో చియా గింజలు ముఖ్యమైనవి. వాల్‌నట్స్‌లో ఒమెగా 3తో పాటు యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉంటాయి. వీటిని ఆరోగ్యకరమైన స్నాక్‌గా తీసుకోవచ్చు. రోజూ కొద్దిపాటి వాల్‌నట్స్ తినడం వల్ల గుండె ఆరోగ్యానికి



మేలు కలగడమే కాకుండా శరీరానికి అవసరమైన మంచి కొవ్వులు కూడా అందుతాయి. అవిసె గింజలు (ఫ్లాక్స్‌సీడ్స్) సూపర్‌ఫుడ్‌గా గుర్తింపు పొందాయి. వీటిలో ఒమెగా 3తో పాటు ఫైబర్, ఇతర ముఖ్యమైన పోషకాలు కూడా ఉంటాయి. ఇవి ఆకలిని నియంత్రించడంలో, తీపి పదార్థాలపై కోరికను తగ్గించడంలో, బరువు నియంత్రణకు సహాయపడటంలో ఉపయోగపడతాయి. వీటిని పొడి చేసి చపాతీ పిండి, పెరుగు లేదా స్మూతీల్లో కలిపి తీసుకోవచ్చు. సోయాబీన్స్ కూడా ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లకు మంచి వనరు. ముఖ్యంగా ఇందులో ఉండే ఆల్ఫా–లినోలెనిక్ యాసిడ్ (ALA) గుండె ఆరోగ్యాన్ని కాపాడటానికి తోడ్పడుతుంది.

## ఆకలి తగ్గిందా.. ఏమీ తినాలనిపించడం లేదా.. అందుకు కారణాలు ఇవే..

ఆకలి తగ్గిపోవడం అంటే చాలా మందిలో కనిపించే సాధారణ సమస్య. దీని వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందక బరువు తగ్గడం, బలహీనత, అలసట వంటి సమస్యలు వస్తాయి. కొన్నిసార్లు అనారోగ్యం, ఒత్తిడి లేదా జీవనశైలి కారణంగా ఆకలి తగ్గుతుంది. అయితే కొన్ని సులభమైన అలవాట్లను పాటించడం ద్వారా ఆకలిని సహజంగా పెంచుకోవచ్చు. ఒకవేళ ఆకలి రెండు వారాలకు పైగా తగ్గిపోవడం లేదా అనుకోకుండా బరువు తగ్గడం కొనసాగితే వైద్యులను తప్పనిసరిగా సంప్రదించాలి. ఆకలి అవకపోయినా భోజన సమయాలను ముందుగానే నిర్ణయించుకోవడం మంచిది. ప్రతిరోజూ ఒకే సమయానికి తినే అలవాటు చేసుకుంటే శరీరం క్రమంగా ఆ సమయానికి ఆకలిని కలిగిస్తుంది. ముఖ్యంగా పనుల్లో బిజీగా ఉండేవారికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఒకేసారి మూడు పెద్ద భోజనాలు చేయడం కష్టంగా అనిపిస్తే, రోజుకు ఐదు లేదా ఆరు చిన్న చిన్న భోజనాలుగా విభజించి తీసుకోవచ్చు. ఇలా తినడం వల్ల పొట్టపై భారం పడకుండా అవసరమైన పోషకాలు అందుతాయి. ఆకలి పెరిగిన తర్వాత మళ్లీ సాధారణ భోజన విధానానికి మారవచ్చు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం కూడా ఆకలిని పెంచడంలో సహాయపడుతుంది. వ్యాయామం వల్ల శరీరం ఎక్కువ శక్తిని వినియోగిస్తుంది. దీంతో శరీరానికి మళ్లీ శక్తి అవసరమై సహజంగానే ఆకలి పెరుగుతుంది. అయితే ఈ ప్రభావం కనిపించడానికి కొన్ని రోజులు పడుతుంది. ఆకలి లేకపోయినా శరీరానికి తగిన కేలరీలు అందేలా చూడాలి. అలాంటి సమయంలో ప్రొటీన్, కేలరీలు అధికంగా ఉండే పానీయాలు లేదా స్మూతీలు తీసుకోవడం ద్వారా శక్తి అవసరాలను కొంతవరకు తీర్చుకోవచ్చు. ఒంటరిగా తినడం కంటే కుటుంబ సభ్యులు లేదా స్నేహితులతో కలిసి భోజనం చేయడం వల్ల ఎక్కువగా తినాలనే ఆసక్తి కలుగుతుంది. మంచి వాతావరణంలో భోజనం చేయడం కూడా ఆకలిని పెంచడంలో సహాయపడుతుంది. ఫైబర్ అధికంగా ఉండే ఆహారం ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగిస్తుంది. ఆకలి తక్కువగా ఉన్నవారు తాత్కాలికంగా అధిక ఫైబర్ ఆహారాన్ని పరిమితంగా తీసుకుని, పోషకాలు అధికంగా ఉండే ఇతర ఆహారాలకు ప్రాధాన్యం ఇవ్వవచ్చు. అయితే ఫైబర్‌ను పూర్తిగా మానేయకూడదు, ఎందుకంటే అది జీర్ణ ఆరోగ్యానికి అవసరం. ఆకలి తక్కువగా ఉన్నవారు చిప్స్, ఐస్‌క్రీమ్ వంటి పోషకాలు తక్కువగా ఉండే ఆహారాల కంటే ప్రొటీన్, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండే ఆహారాలను ఎంచుకోవాలి. గుడ్లు, పాలు, పెరుగు, పప్పులు, చేపలు, చికెన్ వంటి ఆహారాలు శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. అల్లం, జీలకర్ర, మిరియాలు, దాల్చిన చెక్క వంటి కొన్ని సుగంధ ద్రవ్యాలు జీర్ణక్రియను మెరుగుపరచడంలో, కడుపు ఉబ్బరాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. వీటిని వంటల్లో ఉపయోగించడం వల్ల ఆహారం రుచిగా ఉండటంతోపాటు తినాలనే ఆసక్తి కూడా పెరుగుతుంది. భోజనానికి ముందు లేదా భోజనం చేసే సమయంలో ఎక్కువగా నీరు తాగితే కడుపు త్వరగా నిండిన భావన కలిగి తక్కువ ఆహారం తీసుకునే అవకాశం ఉంటుంది. అందువల్ల ఎక్కువ నీరు తాగాల్సి ఉంటే భోజనం చేసిన సుమారు అరగంట తర్వాత తాగడం మంచిది. అయితే రోజంతా తగినంత నీరు తాగడం మాత్రం తప్పనిసరి. ప్రతిరోజూ ఒకే రకమైన ఆహారం తినకుండా అప్పుడప్పుడు కొత్త రుచులు, కొత్త వంటకాలు ప్రయత్నించడం వల్ల భోజనంపై ఆసక్తి పెరుగుతుంది. రుచులు, వాసనలు, వంట విధానాల్లో మార్పులు చేయడం ద్వారా ఆకలిని సహజంగా ప్రేరేపించవచ్చు. ఆకలి తగ్గడం కొన్నిసార్లు థైరాయిడ్ సమస్యలు, జీర్ణవ్యవస్థ వ్యాధులు, డిప్రెషన్, కొన్ని మందుల దుష్ప్రభావాలు లేదా ఇతర ఆరోగ్య సమస్యల సంకేతంగా కూడా ఉంటుంది.



## అందానికి బాదం నూనె!

బాదం పప్పు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అయితే బాదం నూనెలోనూ అందానికి మేలు చేసే గుణాలెన్నో ఉన్నాయంటున్నారు నిపుణులు. ఇందులోని విటమిన్లు, ఖనిజాలు వివిధ చర్మ సమస్యల్ని దూరం చేస్తాయంటున్నారు. మరి, బాదం నూనె వల్ల సౌందర్యపరంగా చేకూరే ప్రయోజనాలేంటో తెలుసుకుందాం రండి.. జుట్టు చివర్లు చిట్లడం, పొడిబారడం.. వంటి సమస్యలు చాలామందిని ఇబ్బంది పెడుతుంటాయి. ఇలాంటప్పుడు బాదం, ఆముదం, ఆలివ్ నూనెల్ని సమపాళ్లలో తీసుకొని కలపాలి. ఈ మిశ్రమంతో కుదుళ్లను మర్దన చేసుకోవాలి. ఇలా వారంలో కనీసం రెండుసార్లు చేస్తే జుట్టు ఆరోగ్యంగా, ఒత్తుగా పెరుగుతుందంటున్నారు నిపుణులు. స్నానం చేయడానికి ముందు శరీరానికి బాదం నూనె రాసుకొని బాగా మర్దన చేసుకోవాలి. తద్వారా ఇందులోని పోషకాలు చర్మంలోకి ఇంకి మేనికి మెరుపును, తేమను అందిస్తాయట. కళ్ల కింద నల్లటి వలయాలు ఇబ్బంది పెడుతున్నాయా..? అయితే రాత్రి పడుకునే ముందు కొన్ని చుక్కల బాదం నూనెను కళ్ల కింద అప్లై చేసుకొని.. కాసేపు మృదువుగా మర్దన చేసుకోవాలి. ఫలితంగా సమస్య తగ్గే అవకాశం ఉంటుందట. చిన్న వయసులోనే వృద్ధాప్య ఛాయలతో ఇబ్బంది పడుతున్న వారికి బాదం నూనె మేలు చేస్తుంది. ఇందులోని పోషకాలు యాంటీ ఏజింగ్ కారకాలుగా పనిచేస్తాయట. దీన్ని తరచూ చర్మానికి రాసుకోవడం వల్ల ముడతలు తగ్గుముఖం పడతాయంటున్నారు నిపుణులు. దుమ్ము, ధూళి.. వంటివి చర్మాన్ని నిర్జీవంగా మారుస్తాయి. రెండు చెంచాల పెసరపిండిలో సరిపడా బాదం నూనె కలుపుకొని పేస్ట్‌లా చేసుకోవాలి. దీన్ని చర్మానికి నలుగులా పెట్టుకుంటే మృతకణాలు తొలగిపోతాయట. చర్మం తాజాగా మారుతుంది. పొడిబారి గరుకుగా మారిన చర్మానికి, పగిలిన మడమలకు ఈ నూనెను పట్టించి బాగా మర్దన చేస్తే.. ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు.



## పసుపు తెలుపు రంగులోనూ ఉంటుందని మీకు తెలుసా..

తెల్ల పసుపు (వైట్ టర్మరిక్) లేదా జెడోయరీ భారతీయులకు పెద్దగా పరిచయం లేని అరుదైన సుగంధ ద్రవ్యం. మన దేశంలో ఎక్కువగా పసుపు రంగు పసుపును పండిస్తారు. అందువల్ల తెల్ల పసుపు చాలా తక్కువగా కనిపిస్తుంది. ఇది అల్లంలా కనిపించినప్పటికీ, ప్రత్యేకమైన ఔషధ గుణాలు కలిగిన దుంప. శాస్త్రీయంగా దీనిని కుర్కుమా జెడోయారియా (Curcuma zedoaria) అని పిలుస్తారు. కొన్ని భారతీయ భాషల్లో దీనిని



అంబా పసుపు అని కూడా అంటారు. మామిడి, పసుపు కలిసినట్లుగా ఉండే సువాసన దీని ప్రత్యేకత. తెల్ల పసుపు బయటకు గోధుమరంగు తొక్కతో, లోపల నారింజ లేదా లేత పసుపు రంగులో గట్టి దుంపలా ఉంటుంది. అల్లంలా కనిపించినప్పటికీ, ఇది పసుపు కుటుంబానికి చెందిన మొక్క. సాధారణంగా పొడి రూపంలో, ఎండబెట్టిన ముక్కలుగా లేదా తాజాగా మార్కెట్‌లో లభిస్తుంది. భారతీయ వంటల్లో తెల్ల పసుపును తాజాగా వాడటమే కాకుండా ఊరగాయల తయారీలో కూడా ఉపయోగిస్తారు. ఇండోనేషియా వంటి దేశాల్లో దీనిని ఎండబెట్టి కరివేపాకు పొడులు, ముఖ్యంగా సముద్ర ఆహార కూరల్లో మసాలాగా ఉపయోగిస్తారు. తెల్ల పసుపులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ (వాపులను తగ్గించే), యాంటీ మైక్రోబియల్ (సూక్ష్మక్రిములను నిరోధించే) గుణాలు ఉంటాయి. అందువల్ల జీర్ణకోశం, శ్వాసకోశానికి సంబంధించిన కొన్ని సమస్యలను తగ్గించడంలో ఇది సహాయపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు. జీర్ణక్రియ సరిగా లేకపోవడం, గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలను తగ్గించడంలో తెల్ల పసుపు ఉపయోగపడుతుంది. జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో ఇది సహాయకారిగా ఉంటుంది. తెల్ల పసుపులో ఉండే వాపు నిరోధక గుణాలు కీళ్ల వాపు, ఆర్థరైటిస్ వంటి సమస్యలతో బాధపడేవారికి కొంత ఉపశమనం కలిగిస్తాయి. అలాగే చిన్న గాయాలు, కొన్ని చర్మ సమస్యల నుంచి కోలుకోవడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే కుర్కుమెనోల్ అనే సమ్మేళనం నొప్పిని తగ్గించడంలో సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు శరీర కణాలను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్ ప్రభావాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే ఇందులో ఉండే కుర్కుమిన్ వంటి సమ్మేళనాలు అలెర్జీ ప్రతిచర్యలను ప్రేరేపించే కొన్ని రసాయనాల విడుదలను తగ్గించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. శ్వాసకోశ ఆరోగ్యానికి కూడా తెల్ల పసుపు ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. ఊపిరితిత్తుల్లో కఫం, శ్లేష్మం పేరుకుపోవడం వల్ల ముక్కు మూసుకుపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు, జలుబు, ఆస్తమా వంటి సమస్యలు తలెత్తితే, తెల్ల పసుపులోని కొన్ని గుణాలు ఈ సమస్యలను తగ్గించడంలో తోడ్పడతాయని నిపుణులు చెబుతున్నారు. అయితే తెల్ల పసుపుపై జరిగిన పరిశోధనలు ఇంకా పరిమితంగానే ఉన్నాయి. కాబట్టి దీనిని ఆరోగ్య ప్రయోజనాల కోసం అధికంగా తీసుకునే ముందు వైద్యులు లేదా పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. సమతుల్య ఆహారంలో భాగంగా ఊరగాయలు, టీ లేదా కూరల్లో పరిమిత మోతాదులో చేర్చుకోవడం ద్వారా దీని రుచి, పోషక ప్రయోజనాలను పొందవచ్చు.

## అవకాడోతో అభయం

మన గుండెకు అవకాడో అభయం ఇస్తుంది. శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంతోపాటు గుండె, రక్తనాళాల ఆరోగ్యాన్నీ కాపాడుతుంది. అమెరికాకు చెందిన జర్నల్ ఆఫ్ క్లినికల్ లిపిడాలజీ తాజాగా నిర్వహించిన ఓ పరిశోధన.. ఈ విషయాన్ని తేల్చింది. ప్రస్తుతం చెడు కొలెస్ట్రాల్ సమస్య చాలామందిని వేధిస్తున్నది. ఎలాంటి ఆహార నియమాలు పాటించినా, ఎన్ని మందులు వాడినా.. ప్రాణాలకు మీదికి తెస్తున్నది. అయితే, రోజుకు ఒకేఒక్క అవకాడో తింటే.. గుండె పదిలంగా ఉంటుందని జర్నల్ ఆఫ్ క్లినికల్ లిపిడాలజీ అధ్యయనం వెల్లడించింది. ఈ అధ్యయనం కోసం అధిక బరువు, చెడు కొలెస్ట్రాల్‌తో బాధపడుతున్న కొందరిని ఎంపిక చేశారు. వారిని రెండు బృందాలుగా విభజించి.. కొందరికి రోజూ తినే ఆహారంతోపాటు ఒక అవకాడో పండును అందించారు. రెండో గ్రూప్ వాళ్లకు మాములు ఆహారం పెట్టారు. ఆరు నెలల తర్వాత వాళ్లందరికీ రక్త పరీక్షలు నిర్వహించారు. ఇందులో రోజూ ఒక అవకాడో తిన్న వారి రక్తంలో చెడు కొలెస్ట్రాల్‌తో పాటు గుండె జబ్బుల ప్రమాదం దాదాపు 4 శాతం వరకు తగ్గినట్టు పరిశోధకులు గుర్తించారు. ఇందుకు గల కారణాలను వివరిస్తూ.. అవకాడోలో మన శరీరానికి మేలుచేసే మోనోఅన్‌శాచురేటెడ్ ఫ్యాట్ చాలా ఎక్కువగా ఉంటుంది.

ఈ సహజమైన కొవ్వు.. మన శరీరంలో పేరుకుపోయిన చెడు కొవ్వును బయటికి పంపడంలో సమర్థంగా పనిచేస్తుంది. ఇందులోని ఫైబర్.. మనం తినే ఆహారంలోని ఫ్యాట్‌ను పొట్ట, పేగులు పీల్చుకోకుండా అడ్డుకుంటుందని పరిశోధకులు చెబుతున్నారు. అవకాడాలో ఉండే పొటాషియం బీపీని అదుపులో ఉంచుతుందనీ, విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లు రక్తనాళాలు దెబ్బతినకుండా కాపాడతాయని వివరిస్తున్నారు. అందుకే.. రోజువారీ ఆహారంలో అవకాడోను చేర్చుకోవడం వల్ల గుండెకు కొండంత రక్షణ లభిస్తుందని అంటున్నారు. అయితే, గుండెకు అవకాడో ఎంత మేలు చేసినప్పటికీ.. ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటిస్తేనే గుండెకు పూర్తి రక్షణ లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు.



## బీఎస్-3 వాహనాల్లో కొన్ని రబ్బరు భాగాలు మార్చాల్సి రావచ్చు: గడ్కరీ



దేశంలో 2016 ముందు తయారైన బీఎస్–3 వాహనాలను ఇ–20 ఇంధనంతో (20% ఇథనాల్ కలిపిన పెట్రోలు) నడిపినప్పుడు, వాటిలోని కొన్ని రబ్బరు భాగాలు, గాస్కెట్లు దెబ్బతినే అవకాశం ఉందని ప్రభుత్వం బుధవారం తెలిపింది. ఇ–20 వాడటం వల్ల మైలేజీ తగ్గుతుందన్న ఆందోళనలపై రాజ్యసభలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. కేవలం ఇంధనమే కాకుండా పలు ఇతర అంశాలు కూడా వాహన మైలేజీని ప్రభావం చేస్తాయని వాహన తయారీ సంస్థలు, వాహన / ఇంజిన్ పరీక్షా సంస్థలు స్పష్టం చేసినట్లు మంత్రి తెలిపారు.




# బ్రిటన్ పోర్టుల్లోకి అదానీ గ్రూప్!




అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ బ్రిటన్‌లోని అతిపెద్ద పోర్టు నిర్వహణ సంస్థ అసోసియేటెడ్ బ్రిటిష్ పోర్ట్స్ (ఏబీపీ)ని స్వాధీనం చేసుకునేందుకు బిడ్ వేయాలని పరిశీలిస్తున్నారని సమాచారం. ఇది కార్యరూపం దాల్చితే యునైటెడ్ కింగ్‌డమ్‌లో అదానీ గ్రూప్ చేసే తొలి పెట్టుబడి అవుతుంది. ప్రస్తుతం ఏబీపీ లో వాటాలు కలిగి ఉన్న రెండు కెనడియన్ పెన్షన్ ఫండ్లు తమ వాటాలు విక్రయించేందుకు సిద్ధమవుతుండగా.. వీటిని కొనుగోలు చేసే అంశాన్ని అదానీ పరిశీలిస్తున్నట్లు ఈ వ్యవహారంపై అవగాహన ఉన్న ముగ్గురు వ్యక్తులు తెలిపారని ఆంగ్లపత్రికలు పేర్కొన్నాయి. ఏబీపీలో కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డుకు 30%, అంటారియో మునిసిపల్ ఎంప్లాయిస్ రిటైర్మెంట్ సిస్టమ్‌కు 33.88% వాటాలున్నాయి. మరో 6% వాటా కలిగిన హెర్మెస్ అసెట్ మేనేజ్‌మెంట్ కూడా తన వాటా విక్రయించే అవకాశముంది. ఈ ఒప్పందం ముందుకు సాగినా ఈ ఏడాదిలో పూర్తయ్యే అవకాశాలు తక్కువే.

బ్రిటన్ సముద్ర వాణిజ్యంలో కీలక సంస్థ: బ్రిటన్ సముద్ర మార్గం ద్వారా జరిగే మొత్తం వాణిజ్యంలో ఏబీపీ వాటా దాదాపు 25%. దేశవ్యాప్తంగా 21 పోర్టులను నిర్వహిస్తోంది. సంస్థలో సింగపూర్ ప్రభుత్వ సంపద నిధికి 20%, కువైట్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీకి చెందిన రెన్ హౌస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు 10% వాటాలున్నాయి. అదానీ గ్రూప్ ఇప్పటికే ఇజ్రాయెల్, శ్రీలంక, టాంజానియాల్లో పోర్టులను నిర్వహిస్తుండగా, ఆస్ట్రేలియాలో బొగ్గు గనిని నిర్వహిస్తోంది.

# 6 శాతం పడిపోయిన పసిడి డిమాండ్..

బంగారం కొనుగోళ్లకు దూరం ఉండాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు, పెరిగిన ధరలు ఈసారి బంగారం గిరాకీపై ప్రభావం చూపించాయి. ఏప్రిల్ – జూన్ త్రైమాసికంలో భారత్‌లో పసిడికి డిమాండ్ 6శాతం పడిపోయి 131.4 టన్నులుగా ఉందని ప్రపంచ స్వర్ణ మండలి (WCG) వెల్లడించింది. అయితే, ధరలు ఆకాశాన్ని తాకడంతో విలువ పరంగా చూసుకుంటే గిరాకీ 50శాతం పెరిగి రూ.1,98,100 కోట్లకు చేరిందని తెలిపింది. 2026లో భారత్‌లో పుత్తడి డిమాండ్ 650 నుంచి 750 టన్నుల మధ్య ఉంటుందని డబ్ల్యూసీజీ అంచనా వేసింది. పశ్చిమాసియా ఉద్రికత్తల కారణంగా బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. ఈ క్రమంలోనే విదేశీ మాదక ద్రవ్యాన్ని కాపాడుకునేందుకు



బంగారం కొనుగోళ్లను ఆపేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. దీనితో పాటు బంగారం దిగుమతులపై సుంకాలను విధించారు. ఈ క్రమంలోనే పసిడికి గిరాకీ తగ్గింది. జూన్ త్రైమాసికంలో ఆభరణాల డిమాండ్ 15 శాతం తగ్గి 75.1 టన్నులకు చేరింది. సుంకాల పెంపు, ప్రధాని పిలుపు మేరకు బంగారానికి డిమాండ్ తగ్గినప్పటికీ.. ఇది గ్రే మార్కెట్ నిర్వహణను, స్మగ్లింగ్‌ను ప్రోత్సహించే అవకాశం ఉందని డబ్ల్యూసీజీ రీజినల్ సీఈఓ సచిన్ జైన్ అభిప్రాయపడ్డారు. ఈ పరిణామాలను సునిశితంగా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. మరోవైపు, సమీక్షించిన త్రైమాసికంలో బంగారంలో పెట్టుబడులు పెరిగాయి. బార్, కాయిన్ డిమాండ్ 9 శాతం వృద్ధి నమోదు చేసి 50.3 టన్నులకు చేరింది. భారత గోల్డ్ ఈటీఎఫ్‌లు 4.2 టన్నులకు చేరాయి. మొత్తం బంగారం రీసైక్లింగ్ జూన్ త్రైమాసికంలో 17 శాతం తగ్గి 19.2 టన్నులుగా ఉంది. రెండో త్రైమాసికంలో నికర బంగారం దిగుమతులు 23 శాతం తగ్గి 98.1 టన్నులకు పడిపోయాయి.

# మైక్రోసాఫ్ట్ నుంచి సరికొత్త ఏఐ సూపర్ యాప్: సీఈవో




ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్‌కు పోటీగా మైక్రోసాఫ్ట్ కూడా సరికొత్త ఏఐ సూపర్ యాప్‌ను తీసుకురానుంది. ఈ విషయాన్ని కంపెనీ త్రైమాసిక ఫలితాల విడుదల వేళ సీఈవో సత్య నాదెళ్ల వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోపైలట్ చాలా వేగంగా చాట్‌బాట్ స్థాయిని దాటి సరికొత్త సూపర్ యాప్ రూపును సంతరించుకొంటోందని పేర్కొన్నారు. ఇది కీలక ముందడుగు అని అభివర్ణించారు. భవిష్యత్తులో దీనికి సంబంధించి మరిన్ని వివరాలు పంచుకొంటామని తెలిపారు. సాధారణ ఏఐ యాప్స్‌తో చేసే వాటి కంటే తమ సూపర్ యాప్‌తో చాలా పనులు సులువుగా చేయవచ్చని వివరించారు. ఈ ఏడాది మైక్రోసాఫ్ట్ వార్షిక ఆదాయం 331 బిలియన్ డాలర్లను దాటిందని సత్య నాదెళ్ల పేర్కొన్నారు. క్లౌడ్ వ్యాపారం 214 బిలియన్ డాలర్లుగా ఉందన్నారు. ఓ రకంగా తమ కంపెనీ ఆదాయం 2025లో ఈజిప్ట్ జీడీపీకి దగ్గర్లో ఉందని వ్యాఖ్యానించారు. జూన్ 30 నాటికి ముగిసిన త్రైమాసికానికి నికర ఆదాయం 35.8 బిలియన్ డాలర్లకు పెరిగిందని చెప్పారు. మరోవైపు దక్షిణ కొరియా టెక్ దిగ్గజం శామ్‌సంగ్ కూడా ఈ సారి కంపెనీ చరిత్రలో ఎన్నడూ ప్రకటించనంత లాభాన్ని వెల్లడించింది. మొత్తం 62 బిలియన్ డాలర్ల నిర్వహణ లాభం వచ్చినట్లు వెల్లడించింది. దీంతో దక్షిణ కొరియా మార్కెట్ సూచీ కోస్పి గురువారం కొంచెం పుంజుకొని దాదాపు 4%కి పైగా లాభాలను నమోదు చేసింది.

# రూ.2 లక్షల కోట్ల దివీస్




హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఔషధ సంస్థ దివీస్ లేబొరేటరీస్, మార్కెట్ విలువ పరంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. దేశంలో సన్ ఫార్మా తర్వాత రూ.2 లక్షల కోట్ల మార్కెట్ విలువ మైలురాయిని అధిగమించిన రెండో కంపెనీగా నిలిచింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి, ఈ ఘనత సాధించిన ఔషధ సంస్థ దివీస్ మాత్రమే. 2010లో రూ.8,000 కోట్లుగా ఉన్న దివీస్ మార్కెట్ విలువ, 2020లో రూ.లక్ష కోట్లకు చేరింది. ఆ తర్వాత తన సామర్థ్యాన్ని పెంచుకుంటూ.. ఆరేళ్లలోనే రూ.2.07 లక్షల కోట్ల స్థాయికి చేరింది. బుధవారం (జులై 29) మదుపరుల కొనుగోళ్ల జోరుతో దివీస్ ల్యాబ్స్ షేరు ఎన్ఎస్ఈలో రూ.7,818.50 గరిష్ఠానికి చేరింది. మార్కెట్ ముగిసే సమయానికి రూ.7814.50 వద్ద స్థిరపడింది. ఒక్క రోజే ఈ షేరు 5.25% పెరిగింది. ఈనెల 1న షేరు విలువ రూ.6,542 కాగా, ఇప్పటికే రూ.1,276 పెరిగింది. అంతర్జాతీయ ఫార్మా కంపెనీలకు అవసరమైన యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్స్ (ఏపీఐ) సరఫరాలో దివీస్ తొలి స్థానంలో ఉంది. నొప్పుల నివారణ, దగ్గు మందు తదితర కీలక ఔషధాల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని చెలాయిస్తోంది.

అప్పులేని కంపెనీగా దివీస్ కొనసాగుతోంది. కాకినాడ ప్రాజెక్టు సహా దాదాపు రూ.2,500 కోట్ల మూలధన వ్యయం ప్రణాళికలను సొంత నిధులతోనే చేపడుతుండటం మదుపరుల్లో నమ్మకాన్ని పెంచింది. జీడిమెట్ల, చౌటుప్పల్, విశాఖ తయారీ కేంద్రాల ఉత్పత్తుల్లో 85–90% అమెరికా, ఐరోపా దేశాలకే ఎగుమతి అవుతున్నాయి. డాక్టర్ మురళి దివీ సారథ్యంలోని ఈ కంపెనీ హైదరాబాద్‌ను ఫార్మా హబ్‌గా మార్చడంలో ఎంతో కీలకంగా వ్యవహరిస్తోంది.

# ఏఐతో 'తయారీ'లో పెరిగిన పోటీతత్వం





భారత పారిశ్రామిక తయారీ రంగంలో పోటీతత్వాన్ని కృత్రిమ మేధ (ఏఐ) పెంచగలదని పీడబ్ల్యూసీ ఇండియా అంటోంది. ఏఐని పరిశ్రమ తమ వ్యాపార వ్యూహాల్లో, నమూనాల్లో, రోజువారీ కార్యకలాపాల్లో ఎంతలా అమలు చేస్తారన్నదానిపైనే ఇది ఆధారపడి ఉంటుందని అంటోంది. 'రీరైటింగ్ ద రూల్స్: ద నెక్స్ట్ చాప్టర్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రియల్ మాన్యుఫాక్చరింగ్' పేరిట పీడబ్ల్యూసీ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. వచ్చే అయిదేళ్లలో తమ వ్యూహాత్మక లక్ష్యాలను చేరడానికి ఏఐ కీలక పాత్ర పోషించగలదని 59% భారతీయ తయారీదార్లు భావిస్తున్నారు. అంతర్జాతీయ సగటు 52% కంటే ఇది ఎక్కువే.

తమ వ్యూహాత్మక లక్ష్యాలను సాధించడంలో ఏఐ అత్యంత ప్రధానమైన అంశమని ప్రతి 10 మంది భారత తయారీదార్లలో ఆరుగురు అనుకుంటున్నారు. 71% మంది ఆ దిశగా భాగస్వామ్యం కుదుర్చుకోవాలనీ భావిస్తున్నారు. భవిష్యత్తులో పోటీపరంగా ప్రయోజనం పొందాలంటే కేవలం ఏఐ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంటే సరిపోదని, ఎంతలా తమ వ్యాపార వ్యూహాల్లో, రోజువారీ కార్యకలాపాల్లో ఏఐని అందిపుచ్చుకుంటామన్న దానిపైనే ఆధారపడి ఉంటుందని నివేదిక చెబుతోంది. వచ్చే అయిదేళ్లలో తమ వేల్యూ చెయిన్ అంతటా భారత తయారీదార్లు ఆటోమేషన్‌ను వేగవంతం చేయనున్నారు. అందులో డేటా క్యాప్చర్–అనలిటిక్స్ (82%), క్వాలిటీ అసూరెన్స్(69%), ప్రణాళికలు–అంచనాలు (65%), వినియోగదార్లతో సంబంధాలు(63%) వంటివాటికి అధిక ప్రాధాన్యం ఇవ్వొచ్చు.




## మళ్లీ నం.1గా గిల్



ఐసీసీ వన్డే బ్యాటర్ ర్యాంకింగ్స్‌లో భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (801 పాయింట్లు) నంబర్‌వన్ స్థానాన్ని తిరిగి దక్కించుకున్నాడు. ఈ ఏడాది జనవరి నుంచి ఆ స్థానంలో ఉన్న డారిల్ మిచెల్ (794, న్యూజిలాండ్)ను అతడు వెనక్కి నెట్టాడు. గిల్ 2023 నవంబరులో తొలిసారి అగ్రస్థానం చేరుకున్నాడు. టీమ్ఇండియా స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లి (767) మూడు, రోహిత్ శర్మ (758) నాలుగో స్థానంలో కొనసాగుతున్నారు. శ్రేయస్ అయ్యర్ 13వ స్థానంలో ఉన్నాడు. టీ20 బ్యాటర్లలో ఇషాన్ కిషన్ (910) నం.1 ర్యాంకును నిలబెట్టుకున్నాడ[ు. ఇంగ్లాండ్, జింబాబ్వే సిరీస్‌ల్లో విఫలమైన అభిషేక్ శర్మ (819) ఒక స్థానం కోల్పోయి మూడుకు పడ్డాడు. పాకిస్థాన్ బ్యాటర్ షాహిబ్జాద ఫర్హాన్ (848) రెండో స్థానంలో ఉన్నాడు. భారత జట్టు వైస్ కెప్టెన్ తిలక్‌వర్మ రెండు స్థానాలు ఎగబాకి ఆరో స్థానానికి చేరుకున్నాడు. వన్డే, టీ20 టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత్ నం.1 స్థానంలో కొనసాగుతోంది.

# బంగ్లా అత్యంత సురక్షితం: తమీమ్ ఇక్బాల్




బంగ్లాదేశ్‌లో టీమ్ఇండియా పర్యటనపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. షెడ్యూల్ ప్రకారం గతేడాది ఆగస్టులో మూడు వన్డేలు, మూడు టీ20లను ఆడేందుకు భారత్ వెళ్లాలి. కానీ, ఆ దేశంలో ఉన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో నాడు సిరీస్ జరగలేదు. ఆ పర్యటనను ఈ ఏడాది సెప్టెంబర్‌కు వాయిదా వేస్తూ అప్పుడు నిర్ణయం తీసుకున్నారు. అయితే, బంగ్లాదేశ్‌లో భద్రతపరంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉద్దేశంతో బీసీసీఐ పునరాలోచనలో పడింది. ఈ క్రమంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు తమీమ్ ఇక్బాల్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ తప్పకుండా తమ దేశానికి వస్తుందనే నమ్మకం ఉందన్నారు. "భారత్‌తో సిరీస్ గురించి ఇప్పుడే చెప్పలేను. కానీ, తప్పకుండా ఆ జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటిస్తుందని ఆశిస్తున్నా. ఇప్పటికే బీసీసీఐతో సంప్రదింపులు జరుపుతున్నాం. ఈమెయిల్స్ రూపంలోనూ చర్చలు జరుగుతున్నాయి. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నాం. భారత్ – బంగ్లాదేశ్ (India vs Bangladesh) మధ్య సిరీస్ మరింత ఆసక్తికరంగా ఉంటుందని భావిస్తున్నా. బంగ్లా అత్యంత సురక్షితమైన దేశం. ఇక్కడ వారికి ఎలాంటి భద్రతాపరమైన ఇబ్బందులు ఉండవు. మా వైపు నుంచి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నాం" అని తమీమ్ స్పష్టం చేశారు.

భారత క్రికెట్ క్యాలెండర్‌లో సెప్టెంబర్ విండో ఖాళీగా లేదు. అఫ్గాన్‌తో మూడు టీ20ల సిరీస్‌లో టీమ్ఇండియా తలపడనుంది. ఇప్పుడు బంగ్లా పర్యటనను ఖరారు చేస్తే అఫ్గాన్‌తో సిరీస్‌ను వాయిదా వేయాల్సి ఉంటుంది. దీనిపైనా తమీమ్ స్పందిస్తూ "బీసీబీ అధ్యక్షుడిగా నాకూ కొన్ని పరిమితులు ఉంటాయి. వాటిని నేను క్రాస్ చేయలేను. నా బాధ్యత పరిధిలో సాధ్యమైనంత వరకూ సంబంధిత వ్యక్తులతో మాట్లాడుతూనే ఉన్నా. బంగ్లాతో సిరీస్ ఆడితే ప్రయోజనం ఏంటనేది వారికి వివరించే ప్రయత్నం చేస్తున్నా" అని తమీమ్ వ్యాఖ్యానించారు.

# శ్రీశంకర్‌కు రజతం




పురుషుల లాంగ్‌జంప్‌లో మురళీ శ్రీశంకర్ సత్తాచాటాడు. అతడు 8.09 మీటర్లు దూరం దూకి రెండో స్థానంలో నిలిచాడు. మొదటి ప్రయత్నంలో 8.03 మీటర్లు నమోదు చేసిన అతడు.. రెండోసారి దాన్ని అధిగమించాడు. శ్రీశంకర్ రజతం నెగ్గడం కామన్వెల్త్ క్రీడల్లో ఇది వరుసగా రెండోసారి. 2022లోనూ (8.08 మీ) రెండో స్థానంలోనే నిలిచాడు. మరో భారత లాంగజంపర్ లోకేశ్ సత్యనాథన్ (7.70) అయిదో స్థానంతో ముగించాడు. తజయ్ గేల్ (8.15, జమైకా) స్వర్ణం, స్టీఫెన్ మెకెంజీ (8.08, స్కాట్లాండ్) కాంస్యం సాధించారు. పురుషుల 400 మీటర్ల హర్డిల్స్‌లో సంతోష్ కుమార్ తమిళరాసన్, యశస్ పలాక్ష ఫైనల్‌కు చేరుకున్నారు. సంతోష్ (49.51 సెకన్లు) ఏడు, యశస్ (49.65 సె) ఎనిమిదో స్థానాల్లో నిలిచారు.

# ప్రణయ్ శుభారంభం

తైపీ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో భారత స్టార్ హెచ్ఎస్.ప్రణయ్ శుభారంభం చేశాడు. బుధవారం పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో అతడు 21–11, 21–14తో మినోరు కొగా (జపాన్)ను ఓడించాడు. 35 నిమిషాల్లోనే ముగిసిన ఈ పోరులో ప్రత్యర్థి నుంచి ప్రణయ్‌కు పెద్దగా ప్రతిఘటన ఎదురు కాలేదు. ఏడో సీడ్ ప్రణయ్.. రెండో రౌండ్లో జేసన్ గునావాన్ (హాంకాంగ్)తో తలపడనున్నాడు. మరో మ్యాచ్‌లో మిథున్ మంజునాథ్ 18–21, 4–21తో జేసన్ చేతిలో ఓడాడు. కిరణ్ జార్జి, తరుణ్ మన్నేపల్లి ముందంజ వేశారు. కిరణ్ 21–10, 21–18తో వాంగ్ పో వీయ్ (మలేసియా)ను ఓడించగా.. తరుణ్ 21–12, 21–15తో జియాన్ జిన్ (కొరియా)పై గెలిచాడు. రౌనక్ చౌహాన్ 14–21, 16–21తో రిచీ రికార్డో (ఇండోనేసియా)కు తలొంచాడు. మహిళల సింగిల్స్‌లో మూడో సీడ్ ఉన్నతి హుడా ముందంజ వేసింది. తొలి రౌండ్లో ఉన్నతి 21–12, 21–18తో పీయూ వాంగ్ (చైనీస్ తైపీ)పై గెలిచింది. రెండో రౌండ్లో సహచర షట్లర్ తన్యా హేమంత్‌తో ఉన్నతి తలపడనుంది. తొలి రౌండ్లో తన్యా 21–16, 14–21, 21–16తో వెన్ సు (చైనీస్ తైపీ)పై నెగ్గింది. దేవిక సిహాగ్, తన్వి శర్మ, అన్మోల్ కూడా తొలి రౌండ్ దాటారు. దేవిక 14–21, 21–7, 21–15తో గా పార్క్ (కొరియా)పై, తన్వి 21–16, 22–20తో తస్నీమ్ మీర్ (భారత్)పై, అన్మోల్ 21–15, 11–21, 21–19తో ఇషిక జైస్వాల్ (అమెరికా)పై విజయం సాధించారు. శ్రేయాంశి వలిశెట్టి 11–21, 12–21తో సుపనిద (థాయ్‌లాండ్) చేతిలో ఓడింది.




# కాషాయం రంగులోకి జెర్సీ..

మరికొద్ది రోజుల్లో పురుషుల హాకీ ప్రపంచ కప్ జరగనుంది. ఈ టోర్నీకి బెల్జియం, నెదర్లాండ్స్ సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. ఈ క్రమంలోనే వరల్డ్ కప్‌నకు ముందు భారత పురుషుల, మహిళల జాతీయ జట్ల జెర్సీని నీలం నుంచి కాషాయం రంగులోకి మార్చడం వివాదాస్పదమైంది. దీనిపై విమర్శలు రావడంతో జెర్సీ రంగును ఎందుకు మార్చాల్సి వచ్చిందో హాకీ ఇండియా వివరణ ఇచ్చింది. బ్లూ సింథటిక్ మైదానంలో ఆటగాళ్లు బాగా కనిపించేందుకే జెర్సీ రంగును మార్చినట్లు స్పష్టతనిచ్చింది.

"ఆటగాళ్లు, సహాయక సిబ్బందితో సమగ్రంగా చర్చించిన తర్వాతే జెర్సీ రంగును మార్చాం. దీని వెనుక ప్రధానమైన సాంకేతిక కారణం ఉంది. అంతర్జాతీయ హాకీ పిచ్‌లకు ప్రస్తుతం ప్రామాణికంగా ఉన్న బ్లూ సింథటిక్ ఉపరితలంతో మన ఆటగాళ్ల బ్లూ జెర్సీ కలిసిపోయినట్లుగా ఉంది. దీంతో మైదానంలో ఆటగాళ్లు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో కోచ్‌లు, ప్లేయర్లు పసుపు లేదా



కాషాయం వంటి ప్రత్యామ్నాయ రంగులను సూచించారు. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత కాషాయం రంగును ఫైనల్ చేశాం. మన జాతీయ పతాకంలోని రంగులలో ఒకటైన కాషాయం.. ధైర్యం, త్యాగం, జాతీయ గౌరవానికి ప్రతీక. అందుకే దీన్ని ఎంచుకున్నాం. సాంకేతికంగానూ ఇది ఉత్తమంగా అనిపించింది" అని హాకీ ఇండియా పేర్కొంది. భారత హాకీ జట్టు జెర్సీ రంగులను మార్చడం కొత్తేమీ కాదని తెలిపింది. 2014 ప్రపంచ కప్ సమయంలో పసుపు రంగులోకి, 2018 వరల్డ్ కప్ వేళ స్కై బ్లూలోకి మార్చిన విషయాన్ని గుర్తు చేసింది.

ఈ ఏడాది పురుషుల హాకీ ప్రపంచ కప్ ఆగస్టు 15 నుంచి 30 వరకు జరగనుంది. పూల్ డిలో ఉన్న భారత్ ఆగస్టు 15న వేల్స్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. 17న ఇంగ్లాండ్‌తో, 19న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. చివరగా 2023లో జరిగిన వరల్డ్ కప్‌లో భారత్ తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఈ టోర్నీలో భారత జట్టు ఒక్కసారి మాత్రమే ఛాంపియన్‌గా నిలిచింది. 1975లో పాక్‌ను ఓడించి విజేతగా అవతరించింది. తర్వాత ఒక్క పతకం కూడా సాధించలేదు. అంతకుముందు 1971లో కాంస్యం, 1973లో రజతం దక్కాయి.

# వుదయం సినిమా

MOVIE TIME!

## అట్టహాసంగా ముస్తాబవుతున్న 'సైమా'

**వుదయం సినిమా** దక్షిణాది సినీ తారల సందడికి మరోసారి రంగం సిద్ధమైంది. అద్భుత ప్రతిభ కనబరిచిన నటీనటులు, సాంకేతిక నిపుణులను సత్కరించే ప్రతిష్టాత్మక 'సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్' (సైమా) వేడుక త్వరలో జరగనుంది. 2025 సంవత్సరంలో బాక్సాఫీస్ వద్ద సందడి చేసిన పలు చిత్రాలకు సంబంధించిన నామినేషన్ల జాబితాను 'సైమా' కమిటీ గురువారం అధికారికంగా ప్రకటించింది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషలకు చెందిన ఉత్తమ చిత్రాలు ఈ పురస్కారాల కోసం పోటీ పడుతున్నాయి. టాలీవుడ్ (తెలుగు) విభాగంలో గతేడాది బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించిన పలు చిత్రాలు వివిధ కేటగిరీల్లో అత్యధిక నామినేషన్లు దక్కించుకుని సత్తా చాటాయి.

**తెలుగు నామినేషన్ల ప్రధానాంశాలు:**

అగ్రస్థానంలో 'మిరాయ్': కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తేజ సజ్జా, మంచు మనోజ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఫాంటసీ అడ్వెంచర్ ఫిల్మ్ 'మిరాయ్' ఏకంగా 11 నామినేషన్లు దక్కించుకుని అగ్రస్థానంలో నిలిచింది. రూ.140 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ చిత్రం సైమా అవార్డుల రేసులోనూ దుమ్మురేపుతోంది. రెండో స్థానంలో ఫ్యామిలీ ఎంటర్టైనర్: అనిల్ రావిపూడి దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్ నటించిన హిట్ చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' ఏకంగా 10 నామినేషన్లతో గట్టి పోటీనిస్తోంది. తండేల్, కోర్ట్ చిత్రాల హవా: యువసామ్రాట్ నాగచైతన్య హీరోగా నటించిన 'తండేల్', అలాగే చిన్న చిత్రంగా విడుదలై అనూహ్య విజయాన్ని అందుకున్న 'కోర్ట్' సినిమాలు చెరో 9 నామినేషన్లను తమ ఖాతాలో వేసుకున్నాయి.


## 'ఐ యామ్ గేమ్' అల్ట్రా స్టైలిష్, ఎడ్జ్-ఆఫ్-ది-సీట్ ట్రైలర్



**వుదయం సినిమా:** దుల్కర్‌సల్మాన్ ప్రతిష్టాత్మక చిత్రం 'ఐ యామ్ గేమ్' ట్రైలర్ విడుదలైంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ ట్రైలర్ ని లాంచ్ చేశారు. ఈ సందర్భగా సోషల్ మీడియాలో స్పెషల్ పోస్ట్ పెట్టారు. "#ఐయామ్‌గేమ్ ట్రైలర్‌లోని ఆ ఫైరీ వైబ్ నాకు బాగా నచ్చింది. మొదటి నుంచి చివరి వరకు ఎంతో గ్రిప్పింగ్‌గా, ఎంగేజింగ్‌గా సాగింది. నా సోదరుడు దుల్కర్ మరో స్పెషల్ మూవీతో వస్తున్నారని నమ్మకం కలిగింది. తనకి మంచి ఫలితాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను. అతనితో పాటు మొత్తం చిత్ర బృందానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు!" అని ట్వీట్చేశారు. ప్రేక్షకులు, అభిమానులు ఎంతోఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం 2026 ఆగస్టు 20న ఓణం కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్ల లో విడుదల కానుంది. దుల్కర్ సల్మాన్ వేఫేరర్ ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ భారీ బడ్జెట్ ఫాంటసీ థ్రిల్లర్, ఆయన కెరీర్‌లోనే అత్యంత భారీ చిత్రంగా రూపొందు తోంది.ఈ చిత్రానికి నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తు న్నారు. దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ వేఫేరర్ ఫిల్మ్స్ బ్యాన ర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాజిర్ బాబా, ఇస్మాయిల్ అబూ బక్కర్, బిలాల్ మొయిదు స్క్రీన్‌ప్లే అందించగా, సాజిర్బాబా, ఆదర్శ్ సుకుమారన్, షబాస్ రషీద్ సంభాషణలు రాశారు.విడుదలైన ట్రైలర్ ఆద్యంతం ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసే ఎడ్జ్–ఆఫ్–ది–సీట్ ఎంటర్‌టైనర్‌ను వాగ్దానం చేస్తోంది. అద్భుతమైన విజువల్స్, ఉత్కంఠభరితమైన యాక్షన్, హై–ఆక్టేన్ ఛేజ్ సీక్వెన్స్‌లతో 'ఐ యామ్ గేమ్', మలయాళ సినీ ప్రేక్షకులు ఇప్పటివరకు చూడని స్టైలిష్ ఫాంటసీ థ్రిల్లర్‌గా కనిపిస్తోంది.

## 10 ఏళ్ల ఔట్ స్టాండింగ్ కెరీర్ పూర్తి చేసుకున్న హీరో విజయ్ దేవరకొండ

**వుదయం సినిమా:** హీరో విజయ్ దేవరకొండ 10 ఏళ్ల అద్భుతమైన కెరీర్ ను కంప్లీట్ చేసుకున్నారు. ఆయన సోలో హీరోగా నటించిన తొలి సినిమా పెళ్లి చూపులు 2016లో ఇదే రోజు రిలీజైంది. అప్పటికే ఎవడే సుబ్రహ్మణ్యం సినిమాలో నటించి పేరు తెచ్చుకున్న విజయ్..పెళ్లి చూపులు సినిమాతో సోలో హీరోగా అరంగేట్రం చేశారు. మొదటి చిత్రంతోనే ప్రేక్షకుల ప్రేమాభిమానాలు సంపాదించుకుని, బాక్సాఫీస్ వద్ద పెద్ద హిట్ కొట్టారు విజయ్. ఈ సినిమా విజయంతో ఆయన వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. టాక్సీవాలా, అర్జున్ రెడ్డి, గీత గోవిందం, ఫ్యామిలీ స్టార్, ఖుషి, కింగ్డమ్ ఇలా..వరుసగా సక్సెస్ ఫుల్ సినిమాలు చేస్తూ పాన్ ఇండియా స్టార్ గా ఎదిగారు విజయ్ దేవరకొండ. ప్రభాస్ కల్కి సినిమాలో అర్జునుడి పాత్రలో స్పెషల్ అప్పీయరెన్స్ ఇచ్చారు. భారీ చిత్రాలు చేస్తూ పాన్ ఇండియా స్థాయిలో తెలుగు సినిమా స్పాన్ పెరగడంలో తన వంతు కృషి చేస్తున్నారు విజయ్. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా చిన్న సినిమాతో కెరీర్ మొదలుపెట్టి పెద్ద స్టార్ గా ఎదిగిన విజయ్ ప్రస్థానం ఎంతోమంది కొత్త వాళ్లకు ఇన్స్పిరేషన్ గా నిలుస్తోంది.విజయ్ ఈ పదేళ్లలో సాధించింది ఒక హిస్టరీ. ఈ దశాబ్ద కాలంలో జయాపజయాలు, ఎత్తుపల్లాలు, ప్రేమ, ద్వేషం ఎదుర్కొన్నారు విజయ్. మరే హీరో చూడనంత వెర్సటైల్ కెరీర్ చూశారు.



## "ది మేజ్" నుంచి ఫస్ట్ సింగిల్ 'నన్నే నన్నే..' రిలీజ్



**వుదయం సినిమా:** తమిళ, తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న హీరో శ్రీరామ్ (శ్రీకాంత్) నటిస్తున్న కొత్త సినిమా "ది మేజ్". ఈ మూవీలో ప్రియాంక, హ్రితిక శ్రీనివాస్, కమల్ కామరాజు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని డాక్టర్ నైమిష రెడ్డి కసిరెడ్డి సమర్పణలో శ్రౌష కమల ఆర్ట్స్, యూఆర్ క్రియేషన్స్ బ్యానర్స్ పై డాక్టర్ ఉదయ్ కె. రెడ్డి పాల్వాయి, డాక్టర్ కేఎస్ఆర్ (కరెడ్డి శ్రీధర్ రెడ్డి), డాక్టర్ భరత్ రెడ్డి గోపు, డాక్టర్ అనిరుధ్ రెడ్డి సోమ నిర్మిస్తున్నారు. "ది మేజ్" చిత్రాన్ని సరికొత్త సైకలాజికల్ థ్రిల్లర్ కథతో దర్శకుడు డాక్టర్ రవికిరణ్ గడలాయ్ రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. తాజాగా ఈ చిత్రం నుంచి హీరో ఆనంద్ దేవరకొండ చేతుల మీదుగా ఫస్ట్ సింగిల్ 'నన్నే నన్నే..' రిలీజ్ చేశారు.

## హ్యాపీ బర్త్ డే టు యంగ్ టాలెంటెడ్ హీరో విక్రాంత్



**వుదయం సినిమా:** సంతాన ప్రాప్తిరస్తు సినిమాతో తెలుగు ప్రేక్షకుల్లో తనకుంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు యంగ్ టాలెంటెడ్ హీరో విక్రాంత్. ఈ సినిమాలో విక్రాంత్ నటనకు మంచి పేరొచ్చింది. సంతాన ప్రాప్తిరస్తు సినిమా థియేట్రికల్ గా మంచి విజయాన్ని సాధించింది. ఓటీటీల్లోనూ ప్రేక్షకుల ఆదరణ పొందింది. డిస్నీ హాట్ స్టార్, ప్రైమ్ వీడియోలో ఈ సినిమా 200 మిలియన్స్ మినిట్స్ వ్యూస్ దక్కించుకుని కొన్ని వారాల పాటు ట్రెండింగ్ లో నిలిచింది. ఈ సినిమా విజయం ఇచ్చిన ప్రోత్సాహంతో హీరో విక్రాంత్ ప్రస్తుతం పలు ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ చేస్తున్నారు. విక్రాంత్ ప్రస్తుతం ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మాణ సంస్థ దిల్ రాజు డ్రీమ్స్ బ్యానర్ లో మార్కండేయ అనే డివోషనల్ మిస్టికల్ థ్రిల్లర్ మూవీలో నటిస్తున్నారు. దిల్ రాజు డ్రీమ్స్ సంస్థ తొలి సినిమా హీరో విక్రాంత్ కావడం విశేషం. ఈ సినిమా త్వరలో చిత్రీకరణ జరుపుకోనుంది.

## 'రామాయణ: పార్ట్ 1' ట్రైలర్

**వుదయం సినిమా:** నితీశ్ తివారి దర్శకత్వంలో, నమిత్ మల్హోత్రా ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, ఎనిమిది అకాడమీ అవార్డులు (ఆస్కార్® ) గెలుచుకున్న విజువల్ ఎఫెక్ట్స్ స్టూడియో డీఎన్ఈజీ (DNEG), యశ్ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ భాగస్వామ్యంతో నిర్మితమవుతున్న 'రామాయణ: పార్ట్ 1' ప్రపంచవ్యాప్తంగా దీపావళి 2026 సందర్భంగా విడుదల కానుంది. ఈ చిత్రాన్ని అంతర్జాతీయంగా సోనీ పిక్చర్స్, ఉత్తర భారతదేశంలో ధర్మ ప్రొడక్షన్స్ విడుదల చేయనున్నాయి.ఎంతో



ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'నమిత్ మల్హోత్రా రామాయణ: పార్ట్ 1' అఫీషియల్ ట్రైలర్‌ను చిత్ర బృందం ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసింది. జూలై 30 తెల్లవారుజామున విడుదలైన ఈ ట్రైలర్ హిందీ, కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చి ప్రపంచవ్యాప్తంగా అభిమానులను, సినీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.నమిత్ మల్హోత్రా 'రామాయణ' గురించి:విజనరీ మేకర్ నమిత్ మల్హోత్రా నుంచి ప్రపంచంలోనే అత్యంత శాశ్వతమైన మహాకావ్యాల్లో ఒకటైన రామాయణం ఆధారంగా రూపొందుతున్న రెండు భాగాల భారీ సినీ ప్రయాణం 'రామాయణ: పార్ట్ 1' ప్రేక్షకుల ముందుకు రానుంది.సృష్టి ఆరంభం నుంచి త్రిమూర్తులు మూడు లోకాలను పాలిస్తున్నారు. సృష్టికర్త బ్రహ్మ, రక్షకుడు విష్ణు, పరివర్తనకు ప్రతీక అయిన శివుడు విశ్వాన్ని నడిపిస్తుంటారు. స్వర్గం, భూమి అశాంతి వైపు సాగుతున్న సమయంలో సమతుల్యతను పునరుద్ధరించేందుకు విష్ణుమూర్తి అవతారమెత్తి భూమిపైకి దిగివస్తాడు. ఈసారి ఆయన శ్రీరాముడు (రణ్‌బీర్ కపూర్)గా జన్మిస్తాడు.

## నేడే 'పోలీస్ కంప్లైంట్' స్ట్రీమింగ్

**వుదయం సినిమా:** హారర్–యాక్షన్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న 'పోలీస్ కంప్లైంట్' చిత్రం ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. జూన్‌లో థియేటర్ల లో విడుదలై మంచి స్పందనతో పాటు సానుకూల సమీక్షలు అందుకున్న ఈ చిత్రం, ఈ



శుక్రవారం (జూలై 31) నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో తెలుగు, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది.తెలుగు, కన్నడ భాషల్లో దాదాపు 300 థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. విడుదలైన తొలి రోజు నుంచే హారర్, యాక్షన్, థ్రిల్లర్ అంశాల సమ్మేళనంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమాకు విమర్శకుల నుంచి ప్రశంసలు లభించాయి. ప్రముఖ సినీ వెబ్‌సైట్లలోనూ, IMDbలోనూ మంచి రేటింగ్‌లు, పాజిటివ్ రివ్యూలు సొంతం చేసుకుంది.

## 'నేను నా లల్లీ' ఆడియో విడుదల

**వుదయం సినిమా:** దర్శక–నిర్మాత, కథానాయకుడు ఎన్.ఎన్.ఆర్. చౌదరి నేతృత్వంలో రూపొందుతున్న సరికొత్త ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నేను నా లల్లీ'. ఇటీవల సెన్సార్ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ కార్యాలయంలో సినీ ప్రముఖుల సమక్షంలో అత్యంత వైభవంగా 'నేను నా లల్లీ' ఆడియో విడుదల జరిగింది. బిగ్ సీడీని లాంఛ్ చేసిన దర్శకుడు రాజవన్నెం రెడ్డి మాట్లాడుతూ.. నేను నా లల్లీ చిత్రం క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. పాటలు చాలా బావున్నాయి. ట్రైలర్ సినిమాపై ఆసక్తిని కలగజేసింది. హీరో ఎన్.ఎన్.ఆర్. చౌదరి ఈ సినిమా ద్వారా బాలయ్య బాబుని మరోసారి గుర్తు చేస్తారు. చక్కటి నటనతో ఫ్యామిలీ ఆడియన్స్ ని ఆకట్టుకోవడం ఖాయం. సినిమా యూనిట్ కి అభినందనలు అన్నారు. నటుడు అదిరే అభి మాట్లాడుతూ.. సినిమా ట్రైలర్ చూశాను. అదిరిపోయింది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా ఉంది. సినిమాను ప్రేక్షకులు ఆదరించి విజయాన్ని అందించాలని కోరారు. విజన్ వి.వి.కె హౌసింగ్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ సీఎండి



వి. విజయకుమార్ మాట్లాడుతూ.. 'నేను నా లల్లీ' క్లీన్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్. సినిమా చూసిన సెన్సార్ సభ్యులు ఎంతగానో ప్రశంసల వర్షం కురిపించారు. చిత్రం అందర్నీ అలరించే విధంగా రూపుదిద్దుకుంది. హీరో చౌదరి చక్కటి నటనతో అలరించి ప్రేక్ష కుల మనసు దోచుకుంటారు. సినిమా తప్పకూండా మంచి విజయాన్ని అందుకుంటుందన్న గట్టి నమ్మకం నాకుంది. ఈ సినిమాకు ప్రేక్షకుల ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.

## ఆగస్టు 7 "అమ్మా......నాకు ఆ అబ్బాయి కావాలి"

**వుదయం సినిమా:** జిఎస్ఆర్ మూవీ మేకర్స్ పతాకంపై పవన్ మహావీర్ ను హీరోగా పరిచయం చేస్తూ... ప్రముఖ మహిళా వ్యాపారవేత్త శైలజ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన విభిన్న ప్రేమకథా చిత్రం "అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి". లండన్ లో వైద్య విద్య అభ్యసిస్తున్న పవన్ మహావీర్ ఈ చిత్రంలో



హీరోగా నటించడం విశేషం. శివాల ప్రభాకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వర్షిక, సుహానా హీరోయిన్లు. సుమన్, రావు రమేష్, రాజీవ్ కనకాల, సత్యకృష్ణ, సుజాత తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన సీనియర్ హీరో ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించి, ఈ చిత్రం గురించి మాట్లాడారు! సీనియర్ హీరో సుమన్ మాట్లాడుతూ... "అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి"లో నేను ఒక ముఖ్య పాత్ర పోషించాను. సినిమా చాలా బాగా వచ్చింది. పవన్ మహావీర్ కు ఇది పరిచయచిత్రమంటే నాకే నమ్మబుద్ధి కాలేదు. అలాగే నిర్మాత శైలజ రెడ్డి కూడా పదిపదిహేను సినిమాలు తీసిన అనుభవజ్ఞురాలైన నిర్మాతలా ప్రాజెక్ట్ ను అద్భుతంగా హ్యాండిల్ చేశారు. కోడి రామకృష్ణ దర్శకత్వం లో నేను హీరోగా నటించిన పలు చిత్రాలకు కో–డైరెక్టర్ గా పనిచేసిన శివాల ప్రభాకర్ ఈ చిత్రాన్ని చాలా గొప్పగా తీర్చిదిద్దారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Augustin, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.